
శుక్రవారం 24, జూలై 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## దేశంలో విశాఖ టాప్!

- జాబ్ మార్కెట్‌లో ప్రథమస్థానం
- లింక్డిన్ 'సిటీస్ ఆన్ ది రైజ్' రెండో ఎడిషన్ జాబితాలో చోటు

14





## 50 ఏళ్లలోపు బీపీఎల్ చేనేతలకు భరోసా

- ఏడాదికి రూ.25 వేలు సాయం
- రెండోదశ 3,168 ఉద్యోగాల భర్తీకి మరింత అధ్యయనం
- గోదావరి పుష్కరాల కోసం భద్రతా ఏర్పాట్లకు రూ.50 కోట్లు
- 1800 మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్టుకు నెడ్‌క్యాప్‌కు భూముల కేటాయింపు
- టూరిజం ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ స్థలాలు
- కుప్పంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్
- ఏపీ క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు

ఏపీ క్యాబినెట్ సమావేశం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగింది. 25కు పైగా అంశాలపై చర్చ జరిగింది. వాటికి ఆమోదిస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. 'నేతన్న భరోసా' కింద 50 ఏళ్లలోపు బీపీఎల్ చేనేత కుటుంబాలకు ఏటా రూ.25 వేల ఆర్థికసాయం ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండో దశలో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై చర్చించింది. గోదావరి పుష్కరాల కోసం భద్రతా ఏర్పాట్లకు రూ.50 కోట్లు మంజూరు చేసింది.

2

## భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీ



- మీ భూమి-బ్లాక్ చెయిన్‌తో భూములకు భద్రత
- డబుల్ రిజిస్ట్రేషన్లను నివారించేలా విధానం
- ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులు
- పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు

భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. గురువా రం సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రాజెక్టును ప్రారంభిం చారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూ వివా దాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఈ విధానంలో డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్ పడుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపు రం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమ లు చేస్తున్నట్టు తెలిపారు.

3

## సమర్థవంతమైన పోలీసింగ్‌కు సర్టిఫికేషన్ కోర్సులు

- ఏపీ పోలీస్ రిట్రీట్ కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- ఏపీ పోలీస్ వెబ్‌సైట్, అస్త్రం యాప్ ఆవిష్కరణ





రాష్ట్రంలో సమర్థవంతమైన పోలీసింగ్ కోసం వివిధ స్థాయి ల్లోని పోలీసులకు సర్టిఫికేషన్ కోర్సులను అందించి వారి సేవలను వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు వ్యవస్థను కూడా ఆధునిక సాంకేతికతతో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో ఏపీ పోలీస్ రిట్రీట్-2026: ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో సీఎం దిశానిర్దేశం చేశారు.

5

## సంక్షేమ పాలనలో సరికొత్త ప్రమాణం!

- అమ్మఒడికి మించి తల్లికి వందనంలో రెట్టింపు సంక్షేమం
- జగన్ పాలనలో ఇంటికి ఒక్కరికే పరిమితం
- నేడు ఇంట్లో ఎందరు పిల్లలున్నా అందరికీ లబ్ధి
- రెండు రెట్లు ఎక్కువ నిధులు ఖర్చు
- పేద పిల్లల చదువుకు చంద్రన్న ఆసరా

10



## అమరావతిలో క్వాంటం ఇన్నోవేషన్ హబ్

- పంజాబ్ నేషనల్ బ్యాంకుతో ఎంవోయూ
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం
- బ్యాంకింగ్ రంగంలోనే సరికొత్త చరిత్ర

4






## రెండేళ్లలో రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులు

- పరిశ్రమల గ్రౌండింగ్‌లో ప్రతినెలా పురోగతి కనిపించాలి
- ఎంఎస్ఎంఈల ప్రోత్సాహకాలకు ఆటోమేటిక్ వ్యవస్థ
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చిత్తశుద్ధితో అమలుచేయాలి
- మంత్రుల బృందం సమావేశంలో లోకేష్ దిశానిర్దేశం

6

## నేడు రంపచోడవరంలో సీఎం చంద్రబాబు పర్యటన

- మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌కు హాజరు
- 'తల్లికి వందనం' లబ్ధిదారులతో ముఖాముఖి
- ప్రభుత్వ బడిలో విద్యార్థులతో మధ్యాహ్న భోజనం

4



## నేరం చేసిన అప్పలరాజు అమాయకుడా..!

- అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్న జగన్
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

12

చైతన్యరథం



50 ఏళ్లలోపు

# బీపీఎల్ చేనేతలకు భరోసా

- ఏడాదికి రూ.25 వేలు సాయం
- రెండోదశ 3,168 ఉద్యోగాల భర్తీకి మరింత అధ్యయనం
- గోదావరి పుష్కరాల కోసం భద్రతా ఏర్పాట్లకు రూ.50 కోట్లు
- 1800 మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్టుకు నెడ్‌క్యాప్‌కు భూముల కేటాయింపు
- టూరిజం ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ స్థలాలు
- కుప్పంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్
- ఏపీ క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు
- 25కు పైగా అంశాలతో రాష్ట్ర మంత్రివర్గం భేటీ







అమరావతి(చైతన్యరథం): ఏపీ క్యాబినెట్ సమావేశం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగింది. ఉద్యోగాల కల్పన, సంక్షేమం, విద్య, నీటిపారుదల రంగాల వంటి కీలక అంశాలకు ఆమోదం తెలపటమే అజెండా గా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. రెండో దశలో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై చర్చించింది. దీనిపై మరింత అధ్యయనం తరువాత ఉద్యోగాల భర్తీపై మంత్రివర్గ ఉపసంఘం తదుపరి భేటీలో చర్చకు సీఎం నిర్ణయం నిర్ణయించారు. 'నేతన్న భరోసా' కింద 50 ఏళ్లలోపు బీపీఎల్ చేనేత కుటుంబాలకు ఏటా రూ.25 వేల ఆర్థికసాయం ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భుజానికి శస్త్రచికిత్స కారణంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హాజరుకాలేదు. దాదాపు 25కు పైగా అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జాబ్ క్యాలెండర్ 2026-27లో భాగంగా రెండో దశ కింద 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తదుపరి భేటీలో చర్చకు సీఎం నిర్ణయించారు. బాపట్ల జిల్లా వేదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రభు త్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గోదావరి పుష్కరాల కోసం భద్రతా ఏర్పాట్లకు రూ.50 కోట్లు మంజూరు చేసింది.



## 1800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుకు భూములు

అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు ఆమోదం లభించింది. పరిశ్రమలు, విద్య, మౌలిక సదుపాయాలకు ఊతమిస్తూ వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది. విష్ణు ఉమెన్స్ యూనివ ర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్ మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నీటిపారుదల రంగంలో నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641 కోట్ల పరిపాలనా అనుమతి, హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల వ్యయాన్ని రూ.312 కోట్లకు పెంచే ప్రతిపాదనలకు ఆమోద ముద్ర పడింది. విశాఖలో ఏఐజీ సంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్సెస్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణానికి భూ కేటా యింపులు చేశారు. నంద్యాల జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థ ఆధ్వర్యం లో 700 మెగావాట్ల సోలార్, 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుల స్థాపనకు రెండు విడతల్లో భూములు కేటాయించారు. గండికోట పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పరిధిలో అదానీ సంస్థ నిర్మిస్తు న్న 1800 మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్ట్ పనుల కోసం నెడ్‌క్యాప్‌కు భూములు కేటాయించారు. కుప్పంలో శ్రేష్ఠ రెన్యూవ బుల్స్ ఆధ్వర్యంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు, నంద్యాలలో ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ మినీ హైడల్ ప్రాజెక్టుకు 33 ఏళ్ల లీజుపై భూములిస్తూ క్లియరెన్స్ ఇచ్చారు.

## పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ స్థలాల బదిలీ

పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా ఏపీ టూరిజం అథారిటీకి కీలక భూ బదిలీలు జరిగాయి. చిత్తూరు, కాకినాడ నగరాల్లో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్, స్టార్ హోటళ్లు, సరికొత్త టూరిజం ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాలను బదిలీ చేస్తూ మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విజయనగరంలో యశశ్రీ విరోహా ఇంపెక్స్ సంస్థ ఆధ్వర్యంలో "రద్దీస్ రీజెనరేటివ్ హబ్" పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. పుట్టపర్తి లో ఎస్ఎస్ఎస్ ఏరోస్పేస్ ప్రాజెక్టు స్థాపన కోసం శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భూములపై ఉన్న 76.13 ఎకరాల నిషేధాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గ సమావేశంలో ల్యాండ్ పూలింగ్ రైతులకు న్యాయం చేయడంతో పాటు పలు మౌలికవసతుల ఒప్పందాలకు సవరణలు చేశారు. అనకాపల్లి ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా చెర్లపాలి ఖండం రైతులకు 1,800 చదరపు గజాలు లేఅవుట్ డెవలప్ చేసిన ప్లాట్లను పరిహారంగా ఇవ్వనున్నారు. విజయవాడ జెట్ సిటీ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో స్థలాల కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కుల వేగవంతం కోసం ఏపీఐఐసీ-ఎన్ఐసీడీఐట మధ్య జరిగిన ఒప్పందాన్ని సవరించారు.

## మంత్రులు ప్రో-యాక్టివ్‌గా ఉండాలి


క్యాబినెట్ సమావేశంలో మంత్రులకు సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఎల్‌నినోను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని చెప్పారు. తాగునీటి సరఫరా, పశువులకు మేతపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులు, అధికారులకు సూచించారు. మెగా డీఎస్సీ అంశాన్ని ఢిల్లీలో జరుగుతున్న ఆందో ళనలతో ముడిపెట్టి వైసీపీ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్ని స్తోందని వ్యాఖ్యానించారు. లేని వివాదాలను సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయని, అలాంటి చర్యలపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొగాకు ధరల అంశాన్ని సమావేశంలో మంత్రులు ప్రస్తావించారు. ఈ అంశాన్ని వివాదా స్పదం చేసేం దుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని మంత్రులు చెప్పగా.. వాళ్లకు ఎందుకు అవకాశం ఇవ్వాలని సీఎం ప్రశ్నించారు. ప్రభుత్వం పొగాకు రైతుల కోసం తీసుకున్న చర్యలను ప్రజలకు ముందుగానే వివరించాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల కు ముందే తెలియజేస్తే ప్రతిపక్షానికి అవకాశం ఉండదని, ప్రో-యాక్టివ్‌గా మంత్రులు ముందుకెళ్లాలని స్పష్టం చేశారు.



# భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీ

- మీ భూమి-బ్లాక్ చెయిన్‌తో భూములకు భద్రత
- డబుల్ రిజిస్ట్రేషన్లను నివారించేలా విధానం
- ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులు
- పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు





అమరావతి(చైతన్యరథం): ప్రక్షాళన-విముక్తి-భద్రత అంశాలుగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కూటమి ప్రభు త్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నా మని తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును తెచ్చా మని చెప్పారు. గురువారం సచివాలయం నుంచి మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకతలను సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు వివరించారు. భూ రికార్డుల కు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచ నల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూ శాఖ రూపొందిం చినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా... ప్రతీ ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి ట్యాంపర్-ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థ ను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని... ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పనిచేస్తోందని అధికారులు వివరించారు.

## ఏడు జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు

భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. ఎన్ఐసీ ఆంధ్రప్రదేశ్, ఎన్ఐసీ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్న వరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీ-సర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. మీ భూమి-బ్లాక్ చెయిన్ అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్‌ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

## అధ్యయనం చేయాలి..లోపాలు సరిదిద్దాలి

మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ భూ రికార్డు లు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఏపీ లోనూ భూ తగాదాలు, వివాదాలు పెరిగాయి.

22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తు న్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టు ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబం ధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నామని తెలిపారు.

## ఒకే వేదికపైకి రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు

బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదిక మీదకు వస్తాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలట్ ప్రాజెక్టు అమలును పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి. దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటినుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాల జీ వ్యవస్థలోకి వెళతాయి. నవంబరు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కా రం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కా రం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని చెప్పా రు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, ఏపీ-ఎన్ఐసీ, బెంగళూ రు-ఎన్ఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

- వ్యూహాత్మక భాగస్వామ్యంతో ముందుకు రండి
- క్వాంటినమ్ టెక్నాలజీస్ సీఈవోతో సీఎం చంద్రబాబు
- ప్రపంచస్థాయి ఎకోసిస్టం అభివృద్ధికి సంస్థ ఆసక్తి

# క్వాంటం పరిశోధనలకు అమరావతి అత్యుత్తమం




అమరావతి(చైతన్యరథం): క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్య త్ టెక్నాలజీగా క్వాంటం కంప్యూటింగ్ రంగాన్ని గుర్తించి అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పనిచేయటం ప్రారంభిస్తుందని.. ఇప్పటికే క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు ఏపీలో పనిచేయడం ప్రారంభించాయని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి ఫుల్ స్టాక్ క్వాంటం కంప్యూ టింగ్ కంపెనీ క్వాంటినమ్ సంస్థ సీఈవో రాజీబ్ హజ్రా సహా ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో గురువారం ముఖ్యమం త్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతి క్వాంటం వ్యాలీని క్వాంటం ఇన్నోవేషన్ సహా పరిశోధనలు తదితర అంశా ల్లో కీలకమైన హబ్‌గా తయారుచేసేందుకు వ్యూహాత్మక భాగ స్వామ్యాల ఏర్పాటుపై చర్చించారు.

జాతీయ క్వాంటం మిషన్‌కు అనుగుణంగా ప్రపంచస్థాయి ఎకోసిస్టంను అభివృద్ధి చేసేందుకు ఏపీతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు క్వాంటినమ్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. క్వాంటం నైపుణ్యాలు, ఏఐ ఎనెబుల్డ్ క్వాంటం అప్లికేషన్లు, అడ్వాన్స్ కంప్యూటింగ్ రీసెర్చి, స్టార్టప్ ఇంక్యుబేషన్ టెక్నాలజీలపై పనిచేయాలని సీఎం సూచించారు. గతంలో ఐటీని ప్రోత్సహించాం.. ఇప్పుడు ఏఐ, క్వాంటం టెక్నాల జీల ద్వారా వేగంగా సమస్యలకు పరిష్కారం అందించాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. క్వాంటం పరిశోధనలకు ఏపీ అమరావతి అత్యుత్తమ ప్రాంతమని పేర్కొన్నారు. ఏపీలో క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తితో పాటు అల్గారిథమ్స్ వరకూ సహ కారం అందించేందుకు తాము సిద్ధమని క్వాంటినమ్ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షు డు సీతారామకృష్ణ, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

## నేడు రంపచోడవరంలో సీఎం చంద్రబాబు పర్యటన

- మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌కు హాజరు
- 'తల్లికి వందనం' లబ్ధిదారులతో ముఖాముఖి
- ప్రభుత్వ బడిలో విద్యార్థులతో మధ్యాహ్న భోజనం



అమరావతి (చైతన్యరథం): పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం పర్యటించనున్నారు. రంపచోడవరంలోని ప్రభుత్వ హైస్కూల్ - జూనియర్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించే మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ కూడా హాజరుకానున్నారు. విద్యార్థులతో కలిసి తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం అవుతారు. అనంతరం వారి తో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తారు. తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు కలిసి విద్యార్థుల విద్యా ప్రగతిని సమీక్షించి, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలను తీసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 2024లో ప్రభుత్వం ఏర్పడ్డాక మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించడం ఇది నాలుగోసారి.

**ముఖ్యమంత్రి పర్యటన ఇలా..**

సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం 9:10 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10:00 గంటలకు పోలవరం జిల్లా రంపచోడవరానికి చేరుకుంటారు. 10:20 గంటలకు ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కాలేజీ ప్రాంగణానికి చేరుకుంటారు. 10:20 మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొంటారు. 11:35 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1:20 నుంచి గంటలకు మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 02:30 గంటలకు ఐ.పోలవరంలో టీడీపీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4:25 గంటలకు రంపచోడవరం పర్యటన ముగించుకుని 5:15 గంటలకు క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

## అమరావతిలో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్



- పంజాబ్ నేషనల్ బ్యాంకుతో ఎంవోయూ
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం
- సైబర్ నేరాలు, మోసాలకు అడ్డుకట్టే లక్ష్యం

అమరావతి(చైతన్యరథం): అమరావతి క్వాంటం వ్యాలీలో మరో కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందుకు వచ్చింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ లో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ఏపీ క్వాంటం మిషన్-పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఒప్పందం కుది రింది. ముఖ్యమంత్రి చంద్రబాబు- పీఎన్‌బీ సీఈవో, ఎండీ అశోక్‌చంద్ర సమక్షంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశం లో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా క్వాంటం ఫైనాన్స్ ఇన్నో వేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మొట్టమొదటి బ్యాంక్‌గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచింది.

బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను పటిష్టం చేయటంతో పాటు ఆర్థిక మోసాలను ముందుగా గుర్తించే వ్యవస్థ ఏర్పాటు, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలను సురక్షితంగా నిర్వహించేం దుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తోంది. పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలతో పాటు ప్రభుత్వ ఏజెన్సీలను కూడా ఒకే వేదికపైకి తెచ్చేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ పని చేయ నుంది.

క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేం దుకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించేలా ఈ హబ్ పనిచేయనుంది.

**డిజిటల్ లిటరసీపై ప్రత్యేక కార్యాచరణ**

అమరావతిని క్వాంటం సహా డీప్ టెక్నాలజీలకు కేంద్రంగా మార్చాలని సంకల్పించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏక్యూవీలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్వాంటం ఏఐ ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయటం మరో కీలకమైన మైలురా యి అవుతుందని పేర్కొన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వ హించే వినియోగదారులతో పాటు ప్రజలకు డిజిటల్ లిటరసీ పెంచే దిశగా కృషి చేయాలని పీఎన్‌బీ ఉన్నతాధికారులకు సూచిం చారు. ఈ దిశగా ప్రభుత్వాలు- బ్యాంకులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయటంలో టెక్నాలజీ మరింత విస్తృతమవ్వాలని సూచించారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు భద్రతను అత్యుత్తమ స్థాయిలో అందించాలని స్పష్టం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్‌ను మరింత పటిష్టంగా, సులభతరంగా సేవ లు అందించేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను అమరావ తిలో ఏర్పాటు చేస్తున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈవో ఎండీ అశోక్ చంద్ర సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎన్‌బీ ఉన్నతాధికారులు, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పాల్గొన్నారు.

చైతన్యరథం




# సమర్ధవంతమైన పోలీసింగ్‌కు సర్టిఫికేషన్ కోర్సులు

- హెడ్ కానిస్టేబుల్, ఏఎస్‌ఐల సేవలు వినియోగించుకోవాలి
- ఏఐ, డిజిటల్ లిటరసీతో పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దాలి
- మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలి
- సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవాలి
- ప్రజలతో ఫ్రెండ్లీగా..నేరస్థులపై కఠినంగా ఉండాలి
- ఏపీ పోలీస్ రిట్రీట కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- ఏపీ పోలీస్ వెబ్‌సైట్, అస్త్రం యాప్ ఆవిష్కరణ







అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సమర్థవంతమైన పోలీసింగ్ కోసం వివిధ స్థాయిల్లోని పోలీసులకు సర్టిఫికేషన్ కోర్సులను అందించి వారి సేవలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని, అలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు వ్యవస్థను కూడా ఆధునిక సాంకేతికతతో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో మూడు రోజుల పాటు జరిగిన ఏపీ పోలీస్ రిట్రీట్-2026: ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశం గురువారం జరిగింది. రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులతో కలిసి భవిష్యత్ పోలీసింగ్‌కు అవసరమైన సంస్కరణలపై సీఎం సమీక్ష నిర్వహించారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లిటరసీ ఆధారంగా భవిష్యత్ పోలీసింగ్‌ను నిర్మించడమే లక్ష్యంగా ముందుకుసాగాలని సూచించారు. 2001లోనే ఇదే తరహాలో ఫ్యూచర్ పోలీసింగ్ వర్క్‌షాప్ నిర్వహించామని గుర్తు చేసిన సీఎం, అప్పటితో పోలిస్తే నేడు నేరాల తీరు, నేరస్థుల పద్ధతులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం, విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయ త్నాలు పెరిగాయని, వాటిని ఎదుర్కొనే సామర్థ్యం పోలీసు వ్యవస్థ కు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

## శిక్షలు పడతాయనే భయం నేరస్థుల్లో పెరగాలి

నేరాలను అరికట్టడమే కాదు... నేరం చేసిన వారికి వేగంగా శిక్ష లు పడేలా దర్యాప్తు వ్యవస్థ పనిచేస్తేనే నేరస్థుల్లో భయం ఏర్పడు తుందని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ముందస్తు ప్రణాళికలు, సమర్థవంతమైన దర్యాప్తు, వేగవంతమైన ఫలితాలే పోలీసింగ్‌కు అసలైన ప్రమాణాలన్నారు. మారుతున్న అవసరాల కు అనుగుణంగా పోలీసు వ్యవస్థను రీ-స్ట్రక్చర్ చేయాలని, ఇన్విజిబుల్ పోలీస్... విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా విని యోగిస్తే పరిమిత సిబ్బందితోనూ క్లిష్టమైన ఆపరేషన్లను విజయ వంతంగా నిర్వహించవచ్చని చెప్పారు. ఇందుకు ఆపరేషన్ సింధూర్ నిదర్శనమని గుర్తు చేశారు. పోలీసులు ప్రజలతో స్నేహ పూర్వకంగా, అందుబాటులో ఉండాలని... అదే సమయంలో నేరస్థుల విషయంలో రాజీపడకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. తిరుమల మెట్ల మార్గంలో అపహరణకు గురైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని అత్యంత వేగంగా టెక్నాలజీ సాయం తో గుర్తించి స్వాధీనం చేసుకున్న ఘటనను ఉదాహరణగా ప్రస్తా వించారు. ఇలాంటి ఘటనల్లో వెంటనే స్పందించకపోతే ప్రజల్లో అపోహలు వ్యాపిస్తాయని, ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అపహరించిన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని త్వరితగతిన గుర్తించడానికి కారణం టెక్నాలజీనేనన్న విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు.

## దుష్ప్రచారాన్ని వేగంగా తిప్పికొట్టాలి

ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేసేందుకు కొందరు రాజకీ యంగా నేరాలను కూడా ఉపయోగించుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పాస్టర్ ప్రవీణ్ మరణం ఘటనలో కొన్ని పార్టీలు చేసిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నాలుగైదు రోజులు పట్టిందని గుర్తుచేస్తూ, ఇలాంటి వాటి విషయా ల్లో త్వరితగతిన స్పందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అలాగే సోషల్ మీడియా ద్వారా జరిగే తప్పుడు ప్రచారా న్ని వెంటనే ఖండించే సమర్థ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గంజాయి నియంత్రణలో పురోగతి సాధించినా... ఇంకా పూర్తిస్థాయిలో కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి, డ్రగ్స్ కారణంగా కుటుంబాలు నాశన మవుతున్నాయని, మత్తు పదార్థాల ప్రభావంతో జరిగే నేరాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల దుష్పరిణా మాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పు అవసరం

పోలీసు వర్క్‌ఫోర్స్‌కు రీ-ఓరియెంటేషన్ అవసరమని, ప్రతి పోలీసు సిబ్బందికి డిజిటల్ లిటరసీ తప్పనిసరిగా ఉండాలని, పోలీసింగ్‌లో ఏఐ వినియోగాన్ని పెంచాలని సూచించారు. అలాగే వివిధ అంశాలకు సంబంధించి సమర్థవంతమైన పోలీసింగ్ కోసం శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు అవసర మైన సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా, సైబర్ నేరాలు, గంజాయి-డ్రగ్స్, మహిళలపై నేరాల నియంత్రణ, కన్విక్షన్ వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఏపీఎస్పీలో శిక్షణ పొందుతున్న సిబ్బందిని అవసరమైతే డెప్యూటేషన్‌పై జిల్లాల కు పంపే అంశాన్ని పరిశీలించాలని, పోలీసు ఉన్నతాధికారులు కూడా వివిధ రంగాల నిపుణులు, ప్రొఫెసర్లతో నిరంతరం సంప్ర దింపులు జరుపుతూ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని సూచించారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల అనుభవాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నేరాలను అరికట్టడమే కాకుండా నేరాలకు అలవాటు పడిన వారిని సంస్కరించడం.. వారిని కంట్రోల్లో పెట్టడం వంటి చర్యలు కూడా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

## ఫోరెన్సిక్‌కు మరింత బలం

డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ విభాగాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. శాంతి భద్రతలను అదుపు చేయడం... నేరాలను కట్టడి చేయడంలో ప్రణాళికలు రచించడంతో పాటు ఫలితాలు చూపగలగాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే రౌడీయిజాన్ని, ఫ్యాక్షనిజాన్ని కంట్రోల్ చేశామంటూ నాడు జరిగిన కొన్ని సంఘట నలను ప్రస్తావించారు. ఏపీ పోలీస్ వెబ్‌సైట్, ధర్మ యాప్, విజయ వాడ పోలీసులు రూపొందించిన ఏపీ అస్త్రం మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అలాగే రోడ్ సేఫ్టీ, పుష్కరాల్లో సాంకేతిక వినియోగం ద్వారా క్రౌడ్ మేనేజ్‌మెంట్ వంటి 8 అంశాలపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఏపీ పోలీసులు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విట్ యూనివర్శిటీతో ఎంఓయూ కుదు ర్చుకున్నారు. ఈ సదస్సులో హోంమంత్రి అనిత, హోం సెక్రటరీ కుమార్ విశ్వజిత్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సహా పోలీస్ ఉన్న తాధికారులు, జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

# రెండేళ్లలో రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులు

- పరిశ్రమల గ్రౌండింగ్‌లో ప్రతినెలా పురోగతి కనిపించాలి
- ఎంఎస్ఎంఈల ప్రోత్సాహకాలకు ఆటోమేటిక్ వ్యవస్థ
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చిత్తశుద్ధితో అమలుచేయాలి
- మంత్రుల బృందం సమావేశంలో లోకేష్ దిశానిర్దేశం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.29,30,357 కోట్ల పెట్టుబడు లతో 1037 పరిశ్రమలు ముందుకు వచ్చాయని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ పరిశ్రమల ద్వారా 24,66,165 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది.. ప్రతి ప్రాజెక్టును ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం మంత్రి లోకేష్ అధ్యక్షతన ఉండవల్లిలో జరి గింది. పరిశ్రమలకు భూకేటాయింపులు, అనుమతులు, ప్రోత్సా హకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయా లని, ప్రతినెలా నిర్వహించే సమీక్షలో పురోగతి కనిపించాలని స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలు ఏపీని ఎంచుకోవడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయా లని ఆదేశించారు. నవంబరులో విశాఖపట్నంలో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్‌లో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధనం అవసరం, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని కోరారు. నిర్ణీత సమ యంలో గ్రౌండ్ చేసిన ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు అందిం చేలా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. యువతకు ఎక్కువ ఉద్యో గావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈ యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవాన్ని
- ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలి
- లోకేష్ నేతృత్వంలోని మంత్రుల బృందం ఆదేశం



ఉండవల్లి(చైతన్యరథం): విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభో త్సవానికి ఆగస్టు 1న రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాక నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పా ట్లు చేయాలని మంత్రుల బృందం ఆదేశించింది. ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల సంఘం గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించింది. అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభో త్సవ కార్యక్రమం ఏర్పాట్ల గురించి తీసుకుంటున్న చర్యలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. బహిరంగ సభా ప్రాంగణం, వేదిక, భద్రత, వివిధ గ్యాలరీలు, గ్రీన్ రూమ్స్, జనసమీకరణ, పార్కింగ్, రవాణా, భోజనం, తాగు నీరు, పారిశుద్ధ్యం ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రుల సంఘం పలు సూచనలు చేసింది. ప్రధాని మోదీ రాక నేపథ్యంలో విద్యార్థినులతో పెద్దఎత్తున థింసా నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు. అరకు కాఫీ విశిష్టతను తెలిపేలా స్టాల్ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చిం చారు. అన్ని శాఖల సమన్వయంతో అల్లూరి సీతారామరాజు విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రుల సంఘం ఆదేశించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, సత్యకుమార్ యాద వ్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, ప్రధానమంత్రి పర్యటన నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గొడ్డలిపార్టీ దుష్ప్రచారంపై అప్రమత్తం



- వివాదాలు సృష్టించడమే ఆ పార్టీ నైజం
- జిల్లాల్లో సమన్వయంతోనే సమస్యల పరిష్కారం
- శాఖాపరంగా మంత్రులే బాధ్యత తీసుకోవాలి

అమరావతి (చైతన్యరథం): గొడ్డలి పార్టీ కుట్రలపై అప్ర మత్తంగా ఉండాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచిం చారు. క్యాబినెట్ సమావేశం ముగిశాక తాజా పరిస్థితులపై మం త్రులకు దిశానిర్దేశం చేశారు. మెగా డీఎస్సీని ఢిల్లీ ఆందోళనలతో ముడిపెట్టడానికి వైకాపా ప్రయత్నిస్తోందని సీఎం దృష్టికి మంత్రు లు తీసుకెళ్లారు. వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజమని చంద్రబాబు మండిపడ్డారు. జిల్లాల్లో ఇన్‌చార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారమవుతాయని సూ చించారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాల పంపిణీకి మంత్రి లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని కొనియాడారు. ప్రతి లబ్ధిదారుడికి స్వయంగా ఇళ్ల పట్టా ఇచ్చారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని చోట్లా సమన్వయంతో ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాఖాపరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మం త్రులే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలపై ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విషయంలో వెనుక బడ్డారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పలాసలో రోడ్డు ప్రమాద ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ నిందితులను సీసీ టీవీ ఫుటేజ్ల ద్వారా పట్టించిన తీరును మంత్రులకు సీఎం వివరించారు.

### ఆగస్ట్ మొదటివారంలో భోగాపురం..

త్వరలోనే మదనపల్లెలో ఉద్యాన హబ్‌ను ప్రారంభిస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. ఆగస్ట్ మొదటి వారంలో ఉత్తరాంధ్ర లో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం.. చివరి వారంలో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర ఆశలకు రెక్కలు కల్పించామని.. ఇక ఆ ప్రాంతంలో వెనుకబాటుతనం ఉండరా దన్నారు. రెండో త్రైమాసికంలో అడుగుపెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని మంత్రులకు సీఎం సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టిసారించాలని తెలిపారు.

## ప్రతి కుటుంబంలో తల్లికి వందనం వెలుగులు

- కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం
- లక్ష్యసాధనలో లోకేష్ విజయం సాధించారు
- అంగన్‌వాడీల పిల్లలకు పథకంతో మేలు
- టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి మహమ్మద్ నూర్



అమరావతి(చైతన్యరథం): ప్రతి విద్యార్థికి ఉత్తమ విద్యాబోధన.. ప్రతి తల్లి ముఖంలో చిరునవ్వు.. ప్రతి కుటుంబంలో వెలుగులు తీసుకొచ్చిన పథకం తల్లికి వందనం అని టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి మహమ్మద్ నూర్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాటు ఆయా వర్గాల పిల్లలను నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలన్న తన లక్ష్యసాధనలో లోకేష్ విజయం సాధించారని ప్రశంసించారు. పథకం నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా ఎప్పటికప్పుడు పారదర్శకంగా అన్ని చర్యలు తీసు కు న్నారు. అంగన్‌వాడీ పిల్లలు కూడా పథకానికి అర్హులుగా గుర్తిం చడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టడం నిజంగా అభినందించా ల్సిన విషయం. పథకం అమలుతో ప్రభుత్వం తన లక్ష్యాలను సాధించగలి గింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగి మును పెన్నడూ లేనివిధంగా డ్రాపవుట్స్ తగ్గాయి.. వీటన్నింటిని మించి కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా ప్రభుత్వ విద్యార్థులు సాధిస్తున్న ఉత్తమ ఫలితాలు కూటమి ప్రభుత్వ ప్రతిష్టను పెంచాయి. ప్రతిఒక్కరికీ సమాన విద్యా అవకా శాలు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యాబోధన, ప్రతి తల్లి ముఖం లో చెరగని చిరునవ్వుతో కూటమి సంక్షేమ పాలన ప్రజల జీవితా ల్లో కొత్త వెలుగులు నింపింది. ఈనెల 24 వరకు తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నిధులు జమ అవుతాయని పేర్కొన్నారు. కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలున్నా అందరికీ ప్రభుత్వ సాయం అందుతోంది. ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందనుండగా తల్లుల ఖాతాల్లో రూ.10,120. 78 కోట్లను కూటమి ప్రభుత్వం జమ చేయడం జరిగిందని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం కుటుంబంలో ఉన్న పిల్లల అందరికీ అమ్మఒడి ఇస్తామని చెప్పి మోసం చేసి ఒక్కరికి మాత్రమే ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనా న్ని ఇస్తున్నారు. ఇది కూటమి ప్రభుత్వం కమిట్‌మెంట్‌కు నిదర్శనమని కొనియాడారు. మైనార్టీ వర్గాల పిల్లలు ఎక్కువ శాతం లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు.

చైతన్యరథం





# రాజమండ్రిలో లోకేష్‌కు ఘనస్వాగతం

రాజమండ్రి(చైతన్యరథం): రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొనేందుకు విజయవాడ నుంచి రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. వారిని లోకేష్ ఆప్యాయంగా పలకరించారు. కార్యకర్తలు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రంపచోడవరం మండలం పోలవరం జంక్షన్ వద్ద మంత్రి నారా లోకేష్‌కు పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో సాదరంగా ఆహ్వానం పలికారు. ప్రతిఒక్కరికీ అభివాదం చేస్తూ లోకేష్ ముందుకు సాగారు. రోడ్డుమార్గంలో పోలవరం జిల్లా రంపచోడవరం బయలుదేరారు. రాత్రికి రంపచోడవరం మండలం జగరంపల్లి వద్ద ఏర్పాటు చేసిన వేదికలో బస చేయనున్నారు. శుక్రవారం రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే మెగా పేరెం ట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొననున్నారు

















# అద్భుతంగా అమరావతి నిర్మాణం

- జగన్‌ది అప్పుడు మూడు ముక్కలాట, నేడు మావిగన్ పాట
- మంత్రులు డోలా, గొట్టిపాటి
- రాజధాని నిర్మాణ పనుల పరిశీలన



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి నిర్మాణపనులు అద్భుతంగా జరుగుతున్నాయని మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం మంత్రులు, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి రాజధానిలో పర్యటించి నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. అనంతరం మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ అమరావతి లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించామన్నారు. పురపాలకశాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో పనులన్నీ అద్భుతంగా జరుగుతున్నాయి. భూములు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అమరావతి లో ఎమ్మెల్యేలు, మినిస్టర్ లు, సెక్రటరీల బంగళాలు చాలా బాగున్నాయి. అమరావతి అద్భుతమైన నివాసయోగ్యమైన నగరం అవుతుంది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన క్వాంటం వ్యాలీ నీ ఇక్కడ అభివృద్ధి చేస్తున్నాం. గతంలో మూడుముక్కలాట ఆడిన జగన్.. ఇప్పుడు మావిగన్ అంటు కొత్త పాట మొదలెట్టాడని విమర్శించారు.

మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రైతుల త్యాగాల వల్లనే అమరావతి నిర్మాణం ఇంత పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. జగన్ గతంలో 30 వేల ఎకరాలకు తక్కువ కాకుండా రాజధాని ఉండాలంటూ అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు ఇచ్చారు. ఆ తర్వాత 'మూడు రాజధానుల పేరుతో ప్రజల్లో అయోమయం సృష్టించారు. ఇప్పుడు మరేదో అంటున్నారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని జగన్ వచ్చి చూడాలి. అమరావతి ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందని మంత్రి గొట్టిపాటి అన్నారు.

## ఉత్తరాంధ్ర ప్రగతికి 'భోగాపురం' బాట!

- మణిహారంగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం
- ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం
- సాకారమవుతున్న దశాబ్దాల కల
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణ, ప్రాంతీయ అభివృద్ధికి నూతన బలాన్ని ఇచ్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు)ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వైభవంగా ప్రారంభం కానుండటం ఉత్తరాంధ్ర చరిత్రలోనే ఒక స్వర్ణాక్షర ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిరంతర కృషి ఫలితంగానే ఈ చారిత్రక ప్రాజెక్టు కల రూపుదిద్దుకుందని ఆయన కొనియాడారు.

ఈ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని, భారీగా పెట్టుబడులు తరలిరావడంతో పాటు ఐటీ, పర్యాటక, పారిశ్రామిక, సేవా రంగాలు శరవేగంగా విస్తరించి వేలాదిమంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి స్పష్టం చేశారు. పోర్టులు, జాతీయ రహదారులకు తోడు భోగాపురం ఎయిర్‌పోర్టు జతకూడటంతో ఉత్తరాంధ్ర దేశంలోనే వేగవంతమైన అభివృద్ధి ప్రాంతంగా అవతరిస్తుందన్నారు. ఇది కేవలం ఎయిర్‌పోర్టు ప్రారంభం మాత్రమే కాదని, ప్రజల ఆశయాలు నెరవేరిన మహత్తర విజయమని పేర్కొంటూ.. ఈ పండుగ వాతావరణాన్ని ఉత్తరాంధ్రులందరూ గర్వంగా స్వాగతించాలని ఒక ప్రకటనలో మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు ఇచ్చారు.

## ఏవియేషన్, డ్రోన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు ఆసక్తి

**- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసిన నాట్స్ ఏరో స్పేస్, జీజీఫ్ ఆస్ట్రా ఎనలిటికా సంస్థల ప్రతినిధులు**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం నెలకొందని, దానిని వినియోగించుకుని, ఏవియేషన్, డ్రోన్ రంగాల అభివృద్ధికి ప్రముఖ సంస్థలు ముందుకు వస్తున్నాయని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో గురువారం ఢిల్లీకి చెందిన నాట్స్ ఏరో స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన జీజీఫ్ ఆస్ట్రా ఎనలిటికా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి తమ పెట్టుబడి ప్రతిపాదనలను వివరించారు. ఈ సందర్భంగా నాట్స్ ఏరో స్పేస్ సంస్థ ప్రతినిధి అభిరాజ్ సింగ్ చావ్లా రాష్ట్రంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీవో) ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. నాగార్జున సాగర్ విమానాశ్రయం లేదా కర్నూలు విమానాశ్రయంలో ఎఫ్‌టీవో ఏర్పాటు చేసేందుకు నాట్స్ ఏరో స్పేస్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. పైలట్ శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, దేశీయ, అంతర్జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో తమకు విశేష అనుభవం ఉందని ప్రతినిధులు వివరించారు.

వచ్చే ఐదేళ్లలో సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి, దాదాపు 100 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 6 శిక్షణ విమానాలతో ప్రారంభించి, ఐదేళ్లలో వాటి సంఖ్యను 20కు పెంచే లక్ష్యంతో ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామని ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

అనంతరం జీజీఫ్ ఆస్ట్రా ఎనలిటికా సంస్థ సీఈవో, డైరెక్టర్ సాయి ప్రసాద్, టెక్ డైరెక్టర్ సాయి విజ్ఞాన్ రెడ్డి, ఆపరేషన్స్ డైరెక్టర్ టి.ఎస్. కిరణ్ మంత్రిని కలిసి రాష్ట్రంలో డ్రోన్ రంగంలో చేపట్టనున్న పెట్టుబడి ప్రతిపాదనలను వివరించారు. డ్రోన్ ఆధారిత రీసెర్చ్, అసెంబ్లింగ్, తయారీ, టెస్టింగ్, ట్రైనింగ్, ఇంక్యుబేషన్ వంటి సేవల్లో తమకు విశేష అనుభవం ఉందని, లండన్, సింగపూర్ సంస్థల సాంకేతిక సహకారం కూడా తమకు ఉందని వారు మంత్రికి తెలిపారు. కర్నూలు డ్రోన్ సిటీలో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో డ్రోన్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. ఇందుకోసం సుమారు 100 ఎకరాల భూమి అవసరమని ప్రతినిధులు మంత్రికి వివరించారు.

అలాగే 2027 గోదావరి పుష్కరాల్లో డ్రోన్ ఆధారిత సేవలు అందించేందుకు కూడా జీజీఫ్ ఆస్ట్రా ఎనలిటికా సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సీసీటీవీ సర్వైలెన్స్, భద్రత, క్రౌడ్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఆధునిక డ్రోన్ అప్లికేషన్లను సమర్థవంతంగా వినియోగించగలమని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న సంస్థలను ప్రభుత్వం స్వాగతిస్తోందన్నారు. పూర్తి స్థాయి ప్రాజెక్టు ప్రతిపాదనలతో ముందుకు వస్తే అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఏవియేషన్, డ్రోన్ రంగాల్లో ఇలాంటి పెట్టుబడులు రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు, ఆధునిక నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. జీజీఫ్ ఆస్ట్రా ఎనలిటికా సంస్థ ప్రతిపాదించిన డ్రోన్ సేవలపై సెప్టెంబర్ నెలలో ట్రయల్ రన్స్ నిర్వహించి, వాటి ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## మరిన్ని విజయాలతో స్ఫూర్తిగా నిలవాలి

**- వెన్నం జ్యోతి సురేఖకు మంత్రి మండిపల్లి అభినందనలు**

**- మంత్రిని కలిసిన అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి**

అమరావతి (చైతన్యరథం): అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం గురువారం సచివాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను ఇటీవల వరల్డ్ కప్ లో సాధించిన పతకాల విశేషాలను మంత్రికి వివరించారు. ఆమె వెంట తండ్రి కూడా పాల్గొన్నారు. జ్యోతి సురేఖ వెన్నం సాధించిన విజయాలను మంత్రి అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



# 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

- చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం
- 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి
- ఇప్పటికే ఉచిత విద్యుత్ పథకం అమలు
- 50 ఏళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నాం
- ఏటా చేనేతలకు భారీ ఆర్థిక లబ్ధి కలిగిస్తున్న సీఎం చంద్రబాబు
- చంద్రబాబు పాలన నేతన్నలకు ఎప్పుడూ స్వర్ణయుగమే
- పసలేని ఆరోపణలు జగన్ నైజం
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత



అమరావతి (చైతన్యరథం) : రాష్ట్రంలో చేనేత కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, ఇందులో భాగంగా నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా నేతన్న సేవ పథకానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత వెల్లడించారు. నేతన్న సేవ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి కలిగేలా ఏటా రూ.25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం బడ్జెట్ లో రూ.250 కోట్లు కేటాయించామని, వచ్చే నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా కూటమి ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింద న్నారు. నేతన్న సేవ పథకానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఈ మేరకు కేబినెట్ లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం నాడు నేతన్న సేవ పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఏటా 51,952 మంది నేతన్నలకు రూ.25వేల ఆర్థిక సాయం అందజేయనున్నామన్నారు. చేనేతలకు ఆర్థిక దన్ను కలిగించేలా నేతన్న సేవ పథకాన్ని శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

**నేతన్న కుటుంబానికి భారీ ఆర్థిక లబ్ధి**

50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. 51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, ఏడాదికి రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు నెలకు రూ.1800 చొప్పున ఏడాదికి రూ. 21,600లు లబ్ధి కలుగుతోందన్నారు. మగ్గం నేతన్నలకు నేతన్న సేవ రూ.25 వేలు, పెన్షన్ రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.48 వేలు, ఉచిత్ విద్యుత్‌తో రూ.8,640లు మొత్తం ఏడాదికి రూ. 81,640లు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. మర మగ్గం నేతన్నలకు నేతన్న సేవ పథకం కింద రూ.25 వేలు, పెన్షన్ రూపంలో రూ.48 వేలు, ఉచిత విద్యుత్ కింద రూ.21,600లు కలిపి మొత్తం రూ.94,000 లబ్ధి కలుగుతోందన్నారు.

**చంద్రబాబు పాలన నేతన్నలకు స్వర్ణయుగమే...**

కూటమి ప్రభుత్వం రాగానే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామని మంత్రి సవిత గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టెక్స్ టైల్స్ పార్కులు, క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నలకు గౌరవప్రద జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఏటా త్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామని, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామని తెలిపారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని, ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టీటీడీతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. చంద్రబాబు పాలన నేతన్నలకు ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి సవిత కొనియాడారు.

**26న రాష్ట్ర పండుగగా..**

చేనేత సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామని మంత్రి సవిత తెలిపారు. చీరాలలో ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతిని జరపనున్నట్లు వెల్లడించారు.

**జగన్ కు నిరూపణ చేతకాదు**

జగన్‌కు ఆరోపణలు చేయడమే తప్ప నిరూపించడం చేతకాదని, కూటమి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడమే ఆయన లక్ష్యమని మంత్రి సవిత విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని జగన్ నెరవేర్చలేదన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దు, డీఎస్సీ నిర్వహణ, సంపూర్ణ మద్యపాన నిషేధం, ఇద్దరు బిడ్డలకు అమ్మఒడి అని హామీలిచ్చి... ఏ హామీని కూడా ఆయన నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డికి మాట్లాడే నైతిక హక్కే లేదన్నారు. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తన మొదటి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ సంతకం చేసి, తనమాట నిలబెట్టుకున్నారన్నారు. గతంలోనూ సీఎం చంద్రబాబు ఎంతో పారదర్శకతతో డీఎస్సీలు నిర్వహించారని గుర్తుచేశారు. గతేడాది మెగా డీఎస్సీని కూడా అవకతవకలకు తావులేకుండా పూర్తి చేశారని మంత్రి సవిత కొనియాడారు.

# ఎల్‌నినో ప్రభావం అధిగమించేలా చర్యలు

- సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో మంత్రులు, అధికారుల కసరత్తు
- వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను రైతులు పాటించాలి
- సాగునీటి ఎద్దడిని తట్టుకోవడానికి ప్రత్యామ్నాయ పంటలు
- గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో అద్భుత ఫలితాలు
- తాగు, సాగు నీటి సమస్యలకు చెక్
- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి



అమరావతి (చైతన్యరథం): ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాది అధికంగా ఉంటుంది.. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో మంత్రులు, అధికారులు సమన్వయంతో సమస్య నుండి రైతులు గట్టెక్కే విధానాలపై కసరత్తు చేస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశం లో పలుఅంశాలపై తీసుకున్న నిర్ణయాలను మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి వెల్లడించారు. క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుసమస్యలపై దిశానిర్దేశం చేశారన్నారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో రైతులు సాంప్రదా య పంటలు వేయటం వల్ల సకాలంలో సాగు నీరు అందక పోతే నష్టపోతారన్న అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తం చేశారని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఆగస్టు తరువాత మరింత తీవ్రంగా ఉండనుందని నిపుణులు హెచ్చరి స్తున్నారన్నారు. ఈఏడాది సాధారణం కంటే 51శాతం కంటే ఎక్కువగా వర్షపాతం తగ్గదల ఉంటుందని, దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కోనే పరిస్థితు లు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని తట్టుకునేలా ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గుచూపాలని తద్వారా ఆర్థికంగా నష్ట పోయే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని సూచిం చారు. అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం అదు గంటే ప్రమాదం పొంచిఉందని హెచ్చరించారు. బోర్లు వేసి వ్యవసాయం చేద్దాం అనే ఆలోచనను రైతులు చేయవద్దని కోరారు.దీంతో భూగర్భ జలాలు మరింత అటుగంటే ప్రమాదం పొంచి ఉందని మంత్రి పార్థసారథి అన్నారు.

పోలవరం వద్ద గోదావరి నది ప్రతి ఏడాది ఈ సమయానికి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహించేదని కాని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడటంతో ఈ ఏడాది కేవలం 35 నుండి 38వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రవహిస్తోం దని దీంతో గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఒకవేళ మంచి వర్షాలు పడితే మంచిదే కాని ఎల్‌నినో ప్రభావంపై రైతులు తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదావరి, కృష్ణా జలాలతో సాగు చేసే రైతులు ఇప్ప టికే 70 శాతం మంది రైతులు నాట్లు వేశారని, కాని ఇప్పటి వరకు నాట్లు వేయని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. రైతు లకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖలు అండగా ఉంటా యని, రైతులు కూడా ప్రభుత్వం అందించే సూచన లు, సలహాలు పాటించాలని కోరారు. రైతులను ఆదు కోవడానికి వివిధ రకాల విత్తనాల కిట్లను అందించ డానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని,ఎల్‌నినో ప్రభావం నుండి బయట పడా లని రైతులకు సూచించారు. తాగునీటి సరఫరాకు ట్యాంకర్ల వినియోగంపై కూడా ప్రభుత్వం సమాలోచ న చేస్తుందన్నారు. అలాగే పశుగ్రాసం కొరత రాకుండా మెట్ట పంటల సాగు ఆలోచన చేయాలని కోరారు.మన రాష్ట్రంలో 59శాతం ఆయకట్టు భూమి, 41 శాతం వర్షాధార పంట భూములు ఉన్నాయని, ఈ ఏడాది ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అందుకు అవసరమైన విత్తనాల కిట్లను కూడా వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తుందన్నారు.

నదుల అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అని ముఖ్యమంత్రి చంద్రబాబు మరో సారి ఉద్ఘాటించారని మంత్రి పార్థసారథి తెలిపారు. ఎల్ నినో ప్రభావాలను తగ్గించడానికి జల వనరుల ను సమర్థవంతంగా వినియోగించుకునేలా ముఖ్య మంత్రి ఆలోచిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తన ఆలో చనను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రతిపాదించారన్నారు. గోదావరి నది, కావేరి నదులు వయా బనకచర్ల అను సంధానం వల్ల మూడు రాష్ట్రాలకు అధిక ప్రయోజనం కలుగుతుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయం ఎంతో ఉపయుక్తమైనదన్నారు. కర్ణాటక, తమిళనాడు రీజియన్ లో ఘర్షణ వాతావరణం సైతం తగ్గటమే కాకుండా తమిళనాడు తాగు నీటి సమస్యల కు చెక్ పెట్టవచ్చన్నారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉండటం హర్షనీయమన్నారు. నదుల అనుసంధానం తెలంగాణా, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుందని, అంతే కాకుండా ఈ నాలుగు రాష్ట్రాల్లోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్‌గా నిలవ నుందని, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాధన్ పాల్గొన్నారు.

# సంక్షేమ పాలనలో సరికొత్త ప్రమాణం!

- అమ్మ ఒడికి మించి తల్లికి వందనంలో రెట్టింపు సంక్షేమం
- జగన్ పాలనలో ఇంటికి ఒక్కరికే పరిమితం
- నేడు ఇంట్లో ఎందరు పిల్లలున్నా అందరికీ లబ్ధి
- రెండు రెట్లు ఎక్కువ నిధులు ఖర్చు
- పేద పిల్లల చదువుకు చంద్రన్న ఆసరా

సంక్షేమ పాలనలో సరికొత్త ప్రమాణాన్ని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నెలకొల్పింది. పేద విద్యార్థులకు చదువులు భారం కాకుండా తల్లికి వందనం పథకం అమలు చేస్తోంది. ఎలాంటి హడావుడి లేకుండా, ఆర్భాటపు మైక్ ప్రచారాలు లేకుండా, నిశ్శబ్దంగా ఏకంగా 10,000 కోట్ల రూపాయలకు పైగా తల్లికి వందనం నిధులను నేరుగా లబ్ధిదారులైన తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. ప్రచార ఆర్భాటం కంటే లబ్ధిదారుడికి చేరే ప్రయోజనమే ముఖ్యమని ప్రభుత్వం భావించింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ స్కీమ్ ద్వారా .. చదువుకునే విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు.

ఏ కార్యక్రమమైనా ప్రచారం కోసం కాకుండా, పారదర్శకంగా ప్రజల చేతుల్లోకి వెళ్లినప్పుడే విజయం లభిస్తుంది. బ్యాంకు నుంచి సెల్‌ఫోన్‌కు వచ్చిన నగదు జమ మెసేజ్ చూసి ప్రతి ఇంటా వ్యక్తమైన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా నిలిచింది. ఖాతాల్లో డబ్బులు పడిన తల్లుల ముఖాల్లో కనిపిస్తున్న నిశ్చింత, ఆనందం అంతా ఇంతా కాదు. ఒకే ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా సరే, వారందరికీ మినహాయింపు లేకుండా ప్రతి ఒక్కరికీ పథకాన్ని వర్తింపజేయడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలలో నిశ్శబ్ద విప్లవం వచ్చింది. ప్రభుత్వ విద్యార్థులకు ఇతర అవసరాలు కూడా ప్రభుత్వమే తీరుస్తోంది. సొంత కొడుకులా, అన్నలా తమ పిల్లల చదువులకు ఆసరాగా నిలిచారంటూ తల్లులు ఆప్యాయంగా సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులందరికీ వరుసగా రెండో ఏడాది.. తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారు. 42 లక్షల 70 వేల మంది తల్లుల అకౌంట్లలో.. 67 లక్షల 47 వేల మంది పిల్లలకు ఒక్కొక్కరికీ 15 వేల చొప్పున మొత్తం 10,120 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

తనకు ముందు అసలు సంక్షేమం అనేదే లేదని గొప్పలు చెప్పుకుంటూ ఉత్తర కుమారుడిలా ప్రగల్భాలు పలికే జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అమలైన అమ్మ ఒడి పథకానికి మించి రెట్టింపు నిధులు తల్లికి వందనం పథకంలో కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నవరత్నాల హామీల్లో భాగంగా అమ్మ ఒడి స్కీమ్‌ని అమలు చేశారు. అప్పటి అమ్మ ఒడి పథకాన్ని.. నేటి తల్లికి వదనం పథకాన్ని పోల్చుకొని.. ఏ స్కీమ్ వల్ల తల్లులకు ఎక్కువ లాభం కలుగుతుందని సామాన్య ప్రజల్లో చర్చ జరుగుతోంది.

వైసీపీ హయాంలో ఎంత మందికి.. ఎంత మొత్తం ఇచ్చారు.. కూటమి పాలనలో, ఎంత ఇస్తున్నారో తెలుసుకుంటే.. ఏ స్కీమ్ వల్ల ఎక్కువ లాభమో క్లారిటీ వస్తుంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ 2020 జనవరిలో తొలి విడత అమ్మ ఒడి స్కీమ్ నిధులు విడుదల చేసింది. 42 లక్షల 33 వేల మంది తల్లుల ఖాతాల్లో 6,349 కోట్లు జమ చేశారు. 2021 జనవరిలో రెండోసారి 44 లక్షల 48 వేల మంది తల్లుల ఖాతాల్లో 6,673 కోట్లు డిపాజిట్ చేశారు. మూడో విడత కింద 2022 జూన్‌లో 43 లక్షల 96 వేల మందికి 6,595 కోట్లు అందించారు. 2023 జూన్‌లో చివరి సారి 42.61 లక్షల మంది తల్లులకు.. 6,392 కోట్లు ఇచ్చారు.

మొత్తం ఐదేళ్ల పాలనలో నాలుగు సార్లు మాత్రమే అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా.. ఒక్కరికి మాత్రమే అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశారు. ఒక కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే 15 వేల చొప్పున ఇచ్చారు. ఇందులో టాయిలెట్, స్కూల్ డెవలప్‌మెంట్ ఫండ్ కోసమని 2 వేలు ముందే మినహాయించుకొని.. ఒక్కొక్కరికీ 13 వేల ఇచ్చారు. ఆ విధంగా ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన మొత్తం 26 వేల కోట్లు.

కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే... వారంద రికీ 15 వేల చొప్పున ఆర్థికసాయం చేస్తోంది. 2025లో ఈ స్కీమ్ ద్వారా 42లక్షల 69 వేల మంది తల్లులకు తల్లికి వందనం స్కీమ్ అమలు చేశారు. మొత్తం 67 లక్షల 27 వేల మంది పిల్లలకు 10 వేల 90 కోట్ల రూపాయలు వారి తల్లుల ఖాతాల్లో జమ చేశారు. 2026లో 67 లక్షల 47వేల మంది పిల్లల కు 10 వేల 120కోట్ల రూపాయలు అందించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం చదువుకొనే పిల్లల తల్లులకు రూ.20వేల 200 కోట్లు సాయం చేసింది. అంటే జగన్ సర్కారు నాలుగేళ్లలో 26వేల కోట్లు ఇస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 20 వేల కోట్లు ఇచ్చింది. ఐదేళ్లలో ఈ మొత్తం రూ.50 వేల కోట్లు దాటిపోతుంది.

ఈ లెక్కన వైసీపీ హాయంలో అమ్మ ఒడి పథకం ద్వారా ఇచ్చిన మొత్తం కంటే తల్లికి వందం స్కీమ్ ద్వారా తల్లులకు రెండు రెట్లు ఎక్కువ లాభం చేకూరు తుంది. దాదాపుగా ప్రతి కుటుంబంలోనూ ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటారు కాబట్టి.. జగన్ హయాంలో ఒకరికే ఇవ్వడం వల్ల.. ఇప్పుడు గతం కంటే రెండు మూడు రెట్లు ఎక్కువ లాభం కలుగుతోంది. సూపర్ సిక్స్ హామీల అమలుతో సంక్షేమ పథకాల్లోనూ కూటమి ప్రభుత్వం.. వైసీపీ రికార్డును భారీ తేడాతో బీట్ చేస్తోంది.

ఆర్భాటపు ప్రచారంతో ఊదరగొట్టేకంటే... సాయం పొందిన కుటుంబాలు దాన్ని ఫీల్ అయ్యేలా చేయడమే అత్యంత ప్రభావవంతమైన ప్రక్రియ. కష్టం తీరిన ఇంట్లోని లబ్ధిదారుడే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారతాడు. ఆ పాజిటివ్ ముద్రను ప్రత్యర్థి పార్టీలు ఎంత తప్పుడు ప్రచారం చేసినా, ఎన్ని విమర్శలు చేసినా చెరిపివేయడం సాధ్యం కాదు. పనితీరునే ప్రామాణికంగా మార్చి, లబ్ధిదారుల ముఖాల్లో సంతోషం నిండేలా చేయడమే ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వానికైనా తిరుగులేని ప్రజాదరణను తెచ్చిపెడుతుంది.

# వైద్యరంగంలో జయప్రద ఫౌండేషన్ సేవలు ఎనలేనివి

## - రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ (చైతన్యరథం): ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా జయప్రద ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. గురువారం రాత్రి విజయవాడలోని ఎస్ఎసి కళ్యాణ వేదిక లో జయప్రద ఫౌండేషన్ సేవా సంకల్పం-2026 కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మంత్రి మాట్లాడారు. జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ రావు ఈ ఫౌండేషన్‌ను అనతి కాలంలోనే ప్రజలకు చేరువ చేశారన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే వేల సంఖ్యలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందాయన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా వైద్యరంగంలో జయప్రద ఫౌండేషన్ ద్వారా టీడీ జనార్ధన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. తనకు విద్యార్థి దశ నుండే జనార్ధన్ తెలుసునని, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం దగ్గర నుండి ఎన్టీ రామారావు కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అత్యంత సమీపంగా పనిచేస్తూ తాను చేపట్టిన ప్రతి రంగంలోనూ ఒక క్రమశిక్షణతో ఒక లక్ష్యంతో పనిచేసి పేరు గడించారన్నారు. తాను దత్తత తీసుకున్న మూడు గ్రామాలతో పాటు ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా జయప్రద ఫౌండేషన్ విస్తృతంగా తమ వైద్య సేవలను అందిస్తున్నందుకు అభినందించుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దీనిలో భాగంగా ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలల్లో 28% ఓపి పెరిగినట్లు పేర్కొన్నారు. ఇదే విధంగా ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రభుత్వ వైద్యశాల పట్ల అప్పటివరకు ఉన్న 60 శాతం నమ్మకం 76% వరకు పెరిగిందని తెలిపారు. త్వరలో 104 సర్వీస్ ద్వారా 3500 రూపాయలు విలువ చేసే 41 రకాల వైద్య పరీక్షలు గ్రామాల్లో ప్రజలకు చేరువ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 18 బోధన ఆసుపత్రులలో క్యాన్సర్ వైద్యశాలలను నెలకొల్పుతున్నట్టు తెలిపారు.



దేశవ్యాప్తంగా ఏడాదికి 15 లక్షలు క్యాన్సర్ కేసులు నమోదు అవుతుండగా వీరిలో 7,80,000 మంది మృతి చెందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలో గుర్తిస్తే తగు చికిత్స లభిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆగస్టు 15 నుండి సంజీవిని ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించుకొని యోగాని మానవ జీవితంలో ఒక ఆరోగ్యవంతమైన భాగంగా రూపొందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలతో పాటు, ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కార్యక్రమాలు కూడా తోడవడంతో త్వరగా లక్ష్యాన్ని చేరుకోవచ్చు అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

### గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం

జయప్రద ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్దన్ మాట్లాడుతూ 2018వ సంవత్సరంలో తమ కుమారుడు, కుమార్తె స్థాపించిన ఈ ఫౌండేషన్ అనతి కాలంలోనే అందరి సహకారంతో విశేషంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు పట్టణాల్లో ఉన్న కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉండే విధంగా ఫౌండేషన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు, క్యాన్సర్ స్క్రీనింగ్లు, గుండెకు సంబంధించిన, ఇతర వ్యాధులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు, అవసరమైన మందులను ఉచితంగానే అందిస్తున్నట్లు తెలిపారు.

విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ టీడీ జనార్ధన్ తాను చేపట్టిన ప్రతి పనిని క్రమశిక్షణతో అంకితభావంతో చేయడం ద్వారా మంచి గుర్తింపు పొందారన్నారు. ఫౌండేషన్ కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలు, ఎన్టీఆర్ లిటరేచర్ కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తలకు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ ఎల్లవేళల వారి సమస్యలు పరిష్కరించడం చేస్తున్నట్లు తెలిపారు. జయప్రద ఫౌండేషన్ ద్వారా వేలాది రూపాయలు విలువచేసే ఆపరేషన్లను ఉచితంగానే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి పులాల చంద్రశేఖర్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీరామ్, విజయవాడ లేడీస్ సర్కిల్ చైర్ పర్సన్ ఐశ్వర్య, విజయవాడ రౌండ్ టేబుల్ చైర్మన్ కల్లూరి శ్రీకర్, రోటరీ క్లబ్ అమరావతి కార్యదర్శి డాక్టర్ సంధ్య, విద్యా భారతి ఉపాధ్యక్షులు వెలగపూడి రామకృష్ణ, శాసనమండలి మాజీ సభ్యులు చిగురుపాటి వరప్రసాద్, జయప్రద ఫౌండేషన్ మెంటార్ చాముండేశ్వరి, కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



# స్మగ్లర్లతోపాటు మూలవిరాట్‌లపైనా ఉక్కుపాదం

- ఎర్రచందనం మాఫియా మూలాలను పూర్తిగా తుడిచేయాలి
- డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికతతో నిఘా పటిష్టం
- స్మగ్లింగ్‌పై జీరో టాలరెన్స్ విధానం కఠినంగా అమలు
- మన ఎర్రచందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలవద్దు
- అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతో అటవీ శాఖ ప్రణాళికలకు మరింత పదును పెట్టాలి. ఇందుకోసం స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెంచాలి. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకొంటూ నిఘా పటిష్టం చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. స్మగ్లింగ్ ముఠాల నెట్ వర్క్ ను మూలాలతో సహా నిర్మూలించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏ మేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో గురువారం పవన్ కళ్యాణ్ సమీక్షించారు. ఈ సందర్భంగా గడచిన రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అటవీ శాఖ తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతి, నమోదైన కేసుల వివరాలను అధికారులు వివరించారు.

### 506 కేసులు... 1239మంది అరెస్టు

గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టినట్టు అధికారులు వివరించారు. 506 కేసులు నమోదు చేసి, 1,239 మందిని అరెస్ట్ చేయగా, 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి, ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో



ఇటువంటి అంతర్రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించలేదని పేర్కొన్నారు. అలాగే, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో కన్విక్షన్ రేటు 3 శాతం కంటే తక్కువగా ఉండేదని, నేడు 95 శాతం కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధించే స్థాయికి కన్విక్షన్ రేటు పెరిగిందని వివరించారు.

గతంలో స్మగ్లర్లపై పీడీ చట్టం అమలు చేయని పరిస్థితి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 12 మంది స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

### సమన్వయం తక్షణ అవసరం

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకించిన అటవీ సంపద... ఎర్ర చందనం. కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ పై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలి. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలి. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో సమన్వయం తక్షణ అవసరం. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్ పిన్స్, ఫైనాన్షియర్స్ పైనా దృష్టి సారించాలి. బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రానికి చెందిన విలువైన ఎర్రచందనం సంపదను రక్షించేందుకు అత్యాధునిక సాంకేతికత, డ్రోన్ల పరిజ్ఞానాన్ని వినియోగించుకొంటూ నిఘాను మరింత విస్తృతంగా వినియోగించాలి. అంతర్రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలన్నారు.

---

### జూలై 30న ఆరు జిల్లాలో

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

- 1న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం
- ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ
- ఆరు జిల్లాల్లో 11,98,044 మంది లబ్ధిదారులకు రూ. 514.42 కోట్లు పంపిణీ
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి (చైతన్యరథం) : భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ఆగస్టు 1న ప్రారంభిస్తోన్న నేపథ్యంలో ఏపీలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 30న చేపట్టనున్నారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేసిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1వ తేదీన ప్రారంభిస్తున్నారని.. ఈ క్రమంలోనే లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండానే ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా



పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఈ ఆరుజిల్లాల్లో మొత్తం 11,98,044 మంది లబ్ధిదారులకు రూ.514.42కోట్లను పంపిణీ చేస్తారని...పెన్షన్ల పంపిణీ కోసం అవసరమైన నగదు ఉపసంహరణ కార్యక్రమాన్ని ఈ నెల 29నే పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ నెల ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

---

### ప్రతి తెలుగు హృదయాన్ని కలిపే

# సాంస్కృతిక ఉత్సవం "తెలుగు మహోత్సవం"

- 25, 26 తేదీల్లో ఉండవల్లి గుహల వద్ద ఘనంగా వేడుకలు
- తెలుగు భాషా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా నిర్వహణ
- మాతృభాషా పరిరక్షణకు యువత ముందుకు రావాలి
- మంత్రి కందుల దుర్గేష్ పిలుపు
- సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వినితో కలిసి పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి




అమరావతి (చైతన్యరథం): మాతృభాష వైభవాన్ని, సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలనే ఉన్నతాశయంతో రాష్ట్రస్థాయిలో తెలుగు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం మంత్రి దుర్గేష్‌ను రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జులై 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహల ప్రాంగణంలో జరగనున్న తెలుగు మహోత్సవం అధికారిక పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ .. తెలుగు భాషా వైభవం, సాహిత్య సంపద, సాంస్కృతిక సౌందర్యం, కళా సంప్రదాయాలు, జానపద వారసత్వం, సృజనాత్మకతలను ఒకే వేదికపైకి తెచ్చే అద్భుతమైన వేడుక ఈ తెలుగు మహోత్సవం అన్నారు. మాతృభాషలోని మాధుర్యాన్ని విద్యార్థులు, యువతీ యువకులు ఆస్వాదించేలా, నిత్య జీవితంలో వాడుకలోకి తెచ్చేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ఆధునిక పోకడల్లో తెలుగు భాషా స్వరూపం తగ్గుతోందనే ఆందోళనను అధిగమించి మాతృభాష గొప్పతనాన్ని విశ్వవిఖ్యాతం చేసేందుకు ఈ ఉత్సవం దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. మాతృభాష గొప్పతనాన్ని చాటి చెప్పే ఈ మహాకార్యంలో విద్యార్థులు, యువత, తెలుగు భాషాభిమానులు, ప్రతిఒక్కరూ విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి దుర్గేష్ పిలుపు ఇచ్చారు.

---

### రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌తో

# టీడీపీ నూతన ఎంపీల సమావేశం

న్యూఢిల్లీ (చైతన్యరథం): పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన నూతన ఎంపీలు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ గురువారం సెషన్ విరామ సమయంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌ని సెషన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల నిర్వహణ, రాజ్యసభ సెషన్స్ వేళ చర్చకు రానున్న వివిధ ప్రధాన అంశాలు, పార్లమెంటరీ విధానాలపై వారు సమగ్రంగా చర్చించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలుగా సభలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటించాల్సిన సభా నియమావళిపై రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌తో వారు ప్రత్యేకంగా మాట్లాడారు. దీనితో పాటు రాష్ట్ర ప్రయోజనాలు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక విషయాలపై కూడా ఈ సమావేశంలో ఫలప్రదమైన చర్చలు జరిగాయి.



# నేరం చేసిన సీదిరి అప్పలరాజు అమాయకుడా..!

- అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్న జగన్
- అప్పలరాజు అరెస్ట్ ముమ్మాటికి చట్టబద్ధమే, సమంజసమే
- నేరస్థులకు మద్దతు బాధితులకు ద్రోహం చేయటం కాదా?
- అసాంఘిక శక్తులవైపు నిలబడి నీచ రాజకీయాలు
- జగన్‌కు మళ్లీ అధికారం కలే
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

అమరావతి (చైతన్యరథం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రాజకీయాలపై, చట్టంపై కనీస అవగాహన లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ.. సందర్భోచితంగా ఎలా మాట్లాడాలో కూడా ఆయనకు తెలియకపోవడం విచారకరమన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ నాయకుడిగా కానీ, ఒక పార్టీ అధ్యక్షుడిగా కానీ ఉండటానికి జగన్ మోహన్ రెడ్డికి ఏమాత్రం అర్హత లేదన్నారు. కేవలం అదృష్టం బాగుండి ఐదేళ్లు ముఖ్యమంత్రి కాగలిగారు తప్ప, ప్రజా సమస్యలపై కానీ, చట్టం పనిచేసే తీరుపై కానీ ఆయనకు ఎలాంటి అవగాహన లేదు.. నోటికి ఏది వస్తే అది మాట్లాడటం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుని పోలీసులు అరెస్టు చేస్తే, అసలు ఆయనపై ఏ కేసు ఉందో తెలుసుకోకుండా "ప్రశ్నించే గొంతును నొక్కేస్తున్నారు, ప్రతిపక్షాలను బతకనివ్వరా" అంటూ ప్రభుత్వంపై నిందలు వేయడం హాస్యాస్పదం. అమాయకుడైన అప్పలరాజుని చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేయించారని జగన్ అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం. సీదిరి అప్పలరాజు కొడుకు బైక్‌ను వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఒక అమాయక గొర్రెల కాపరి (దానయ్య) చావుకు కారణమయ్యాడు. ఆ కేసు నుంచి తన కొడుకుని రక్షించుకోవడం కోసం అప్పలరాజు ఒక పెద్ద కుట్ర పన్నారని వర్ల రామయ్య వివరించారు.

### కొడుకు చేసిన నేరాన్ని కప్పిపుచ్చేందుకు...

నేరం చేసినవాడిని అమాయకుడిగా చిత్రీకరిస్తూ జగన్ మాట్లాడటం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని వర్ల అన్నారు. సీదిరి అప్పలరాజు కొడుకు బైక్‌ను నిర్లక్ష్యంగా నడిపి దానయ్య అనే ఒక అమాయక గొర్రెల కాపరి మరణానికి కారణమయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ రిజిస్టర్ చేసి దర్యాప్తు చేపట్టడం చట్టబద్ధమైన ప్రక్రియ. తన కొడుకు జైలుకు వెళ్తే అతడి భవిష్యత్తు నాశనమవుతుందని భయపడిన అప్పలరాజు, తన కొడుకు స్నేహితుడైన ఒక అమాయక బ్రాహ్మణ కుర్రాడిని (బైక్ ఓనర్) రంగంలోకి దించారు. డబ్బు ఆశ చూపి, పెద్ద మనుషులతో ఒత్తిడి తెచ్చి.. "నేనే ఆ బైక్ తోలాను, నా వల్లే ప్రమాదం జరిగింది" అని ఆ కుర్రాడి చేత పోలీస్ స్టేషన్‌లో దొంగ రిపోర్ట్ ఇప్పించారు. అసలు ప్రమాదంతో సంబంధం లేని ఒక అమాయక కుర్రాడిని బలిచేసి, సాక్ష్యాలను తుడిచిపెట్టి నకిలీ ముద్దాయిని పోలీసుల ముందు నిలబెట్టిన ఘనాపాటీ సీదిరి అప్పలరాజు. తన కొడుకుని రక్షించుకోవడం కోసం ఇంకొకరి జీవితాన్ని నాశనం చేయడానికి సిద్ధపడ్డ వ్యక్తి అమాయకుడు ఎలా అవుతాడు? పోలీసులు చాకచక్యంగా, సమయస్ఫూర్తితో దర్యాప్తు చేయడంతోనే అప్పలరాజు పన్నిన కుట్ర, దొంగతనం బయటపడ్డాయి. చట్టాన్ని మోసం చేసి నకిలీ ముద్దాయిని సృష్టించినందుకే పోలీసులు అప్పలరాజును అరెస్ట్ చేశారు. నేరం చేసిన కొడుకుని, ఆ నేరాన్ని కప్పిపుచ్చిన అప్పలరాజును వెనకేసుకొస్తూ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని, ఇందులో సీఎం చంద్రబాబు నాయుడుకి ఏం సంబంధమని వర్ల రామయ్య ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ తన వైఖరి మార్చుకుని వాస్తవాలను గ్రహించాలని కోరారు.

### క్రిమినల్ మనస్తత్వానికి తార్కాణం

జగన్ మోహన్ రెడ్డికి నేరస్తుల పట్ల ఉన్న ప్రేమ, అమాయక బాధితుల పట్ల లేకపోవడం ఆయన నేరపూరిత మనస్తత్వానికి నిదర్శనమని వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేరం చేసిన సీదిరి అప్పలరాజును పోలీసులు అరెస్ట్ చేస్తే, ఆ నేరాన్ని కప్పిపుచ్చేందుకు "చంద్రబాబు నాయుడుని ప్రశ్నించినందుకే అరెస్ట్ చేశారు, ప్రశ్నించే గొంతు నొక్కేశారు" అని జగన్ మోహన్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. అసలు ఈ కేసులో చంద్రబాబుకి ఏం సంబంధం? మాట్లాడేముందు ఏం మాట్లాడుతున్నారో ఆలోచించుకోవడానికి జగన్ ఒక తెలివైన పీఏని పెట్టుకుంటే మంచిది. తప్పు చేసినవాళ్ల పట్ల జగన్‌కు ఎందుకంత ప్రేమ? నేరస్తులను అక్కున చేర్చుకోవడానికి ఎందుకు అంత తాపత్రయం? వైకాపా నాయకులు ఏ నేరం చేసినా, ఎవరిని చంపేసినా పర్లేదా? సొంత పార్టీ వాడైతే చట్టం నుండి మినహాయింపు ఉండాలా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి కొడుకు చేసిన దురుసు డ్రైవింగ్ వల్ల చనిపోయిన వ్యక్తి ఒక అమాయక బీసీ యాదవ కుటుంబానికి చెందినవాడు. ఆ కుటుంబానికి ఆయనే జీవనాధారం. చనిపోయిన అమాయకుడి ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే ఆలోచన జగన్‌కు రాదు. కానీ, నేరాన్ని కప్పిపుచ్చి



తప్పుడు ముద్దాయిని సృష్టించిన అప్పలరాజు కుటుంబానికి సానుభూతి తెలుపుతారు. తన కొడుకుని కాపాడుకోవడం కోసం సాక్ష్యాలను మాయం చేసి, వేరే అమాయక కుర్రాడిపై నేరం తోసి బలి చేయడానికి చూసిన అప్పలరాజును జగన్ సమర్థించడం హేయమైన చర్యగా వర్ల అభివర్ణించారు.

### జగన్ అజ్ఞానానికి నిదర్శనం

జగన్ మోహన్ రెడ్డికి చట్టాలపై, పరిపాలనపై కనీస అవగాహన లేకపోవడం విచారకరమని వర్ల రామయ్య ఎద్దేవా చేశారు. గతంలో వైకాపాను 11 సీట్లకే పరిమితం చేసిన పాత బ్యాచ్ మాటలే వింటూ, అదే తరహా అవగాహన రాహిత్యంతో జగన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏ విషయంపైనా కనీస ఆలోచన, అవగాహన లేకుండా జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూసి ప్రెస్ మీట్‌లో ఉన్నవాళ్లంతా "ఇంత అమాయకుడా, ఇంత ఆలోచన లేనివాడా" అని అనుకుంటున్నారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి ఏ మాత్రం అవగాహన లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన నేరాలు ఒక్కటా రెండా? తన కొడుకు చేసిన ప్రమాదాన్ని, నేరాన్ని దాచాడు. అసలు నేరస్తుడిని (కొడుకుని) రక్షించి పక్కన పెట్టాడు, సాక్ష్యాలు లేకుండా చేశాడు, ఒక అమాయక బ్రాహ్మణ కుర్రాడిని లొంగదీసుకుని, నకిలీ ముద్దాయిగా సృష్టించాడు, పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చి మోసం చేయాలని చూశాడు, కోర్టును కూడా మాయ చేయడానికి సిద్ధపడ్డాడు. ఇంతటి కుట్రలకు, అక్రమాలకు పాల్పడ్డ అప్పలరాజుపై పోలీసులు చట్టబద్ధంగా చర్యలు తీసుకుని, కోర్టు ముందు నిలబెట్టడం సరైన చర్య. పోలీసులు తమ విధిని నిర్వర్తిస్తే, ఇందులో చంద్రబాబు నాయుడుకి ఏం సంబంధం? ప్రతిదానికీ చంద్రబాబుని నిందించడం జగన్‌కు అలవాటుగా మారింది. నేరం చేసిన కొడుకుని, ఆ నేరాన్ని కప్పిపుచ్చేందుకు అమాయకుడిని బలి చేయాలని చూసిన అప్పలరాజు జగన్‌కు అమాయకుడిగా కనిపిస్తున్నాడా? ఇది తీవ్రంగా ఖండించదగిన విషయం. ఇప్పటికైనా జగన్ మోహన్ రెడ్డికి జ్ఞానోదయం కలిగి, చట్టాలను, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలి. అక్రమాలకు పాల్పడిన ముద్దాయిని అరెస్ట్ చేయడం చట్ట ప్రకారం సరైనదేనని, ఈ విషయంలో ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికారు.

### జగన్ వైఖరి సిగ్గుచేటు

నేరాలు చేసేవారికి, విద్రోహ శక్తులకు మద్దతివ్వడమే జగన్ నైజమని వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రమైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వైకాపా అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అత్యంత అసభ్యకరమైన రీతిలో, నోటికొచ్చినట్లు బూతులు తిడితే అక్కడి పోలీసులు చట్టప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. బెయిల్ మీద వచ్చిన ఆ వ్యక్తిని పిలిపించి జగన్ మోహన్ రెడ్డి... "ధైర్యంగా ఉండు, మంచి రోజులు వస్తాయి" అని భుజం తట్టడం ఏ రకమైన సంస్కృతి? ఒక పార్టీ అధ్యక్షుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి "ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని అంత మాటలంటావా?" అని మందలించాల్సింది పోయి, మరింత రెచ్చగొట్టేలా మాట్లాడటం ఆయన నేరపూరిత మనస్తత్వానికి అద్దం పడుతోంది. ఇదే తిట్లు మిమ్మల్ని తిడితే మీరు ఊరుకుంటారా జగన్? గతంలో తెనాలిలో గంజాయి తాగి, రోడ్డున వెళ్లే మహిళలను వేధిస్తూ భయాందోళనలు సృష్టించిన రౌడీలపై పోలీసులు చర్యలు తీసుకుంటే... జగన్ వెళ్లి ఆ రౌడీలకు అండగా నిలబడ్డారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా మీరు ఎవరికి మద్దతు ఇస్తున్నారు? సామాన్య పౌరులకా? లేక సంఘవిద్రోహ శక్తులకా.. రక్షణ కోరే మహిళలకా? లేక గంజాయి రౌడీలకా.. మీ చర్యలను బట్టి చూస్తే మీరు నిరంతరం నేరస్థుల వైపే మొగ్గు చూపుతున్నారని స్పష్టమవుతోంది. మరొక నాయకుడు సీదిరి అప్పలరాజుకు ధైర్యం చెప్తూ "మళ్లీ మనమే వస్తాం" అని కలలు కంటున్నారు. ఏ కోణంలో చూసినా మీకు మళ్లీ అధికారం వచ్చే ప్రసక్తే లేదు. 'ఒక్క ఛాన్స్' అని ప్రజలను మోసం చేసిన మీ ఐదేళ్ల పాలనను మర్చిపోని ప్రజలు.. ప్రతిపక్షంలో మీ ప్రవర్తనను నిత్యం గమనిస్తూనే ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో ఒకరి ప్రాణం పోవడానికి కారణమైన ఘటనలో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, "అది తప్పుడు కేసు, అరెస్ట్ తప్పు" అని మాట్లాడటం జగన్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు సమానులే. నేరస్థులను వెనుకేసుకొచ్చే మీ విధానాలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ అంగీకరించబోరని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

# పేద పిల్లల చదువుకు ప్రభుత్వం అండ

- విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే 'తల్లికి వందనం'
- శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి (చైతన్యరథం): పేదపిల్లల చదువుపై కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమే 'తల్లికి వందనం' కార్యక్రమం అని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. తల్లికి వందనం పథకం నిధులు తల్లుల ఖాతాలో జమైన సందర్భంగా, తిరుపతి జిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ ఆహ్వానం మేరకు ఎంఆర్ పల్లిలోని ఎంపీపీ స్కూల్లో నిర్వహించిన గురువారం నిర్వహించిన కార్యక్రమానికి రవి నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పుష్పగుచ్ఛాలు సమర్పించి




ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి రవినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి చదువు మధ్యలో ఆగిపోకుండా, ప్రతి తల్లి తన బిడ్డను ఆత్మవిశ్వాసంతో పాఠశాలకు పంపేలా చేయడమే 'తల్లికి వందనం' పథకం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పేదరికం ఏ విద్యార్థి కలలకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు.

అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువత సాధికారతకు ప్రాధాన్యత ఇస్తుండగా, విద్యా శాఖ మంత్రి లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అని రవి నాయుడు పేర్కొన్నారు.

తల్లికి వందనం పథకం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, ప్రతి విద్యార్థి భవిష్యత్తుపై ప్రభుత్వం చేస్తున్న విలువైన పెట్టుబడి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులకు, సమాజానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి. నేటి విద్యార్థులే రేపటి రాష్ట్ర నిర్మాతలని రవినాయుడు అన్నారు.

అలాగే, తిరుపతి జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కొట్టే హేమంత్ సహకారంతో పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను రవి నాయుడు అందజేసి, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, తెలుగు యువత పాల్గొన్నారు.

# 'తల్లికి వందనం'తో...
# మైనారిటీ తల్లుల జీవితాల్లో వెలుగులు

- ఇంట్లో ఎందరు పిల్లలు చదువుకుంటున్నా అందరికీ లబ్ధి
- జగన్ హయాంలో స్వల్ప కారణాలతో లబ్ధిదారుల్లో భారీ కోతలు
- నేడు అత్యంత పారదర్శకంగా అమలు
- పేదల విద్యపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చిత్తశుద్ధికి నిదర్శనం
- గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్

అమరావతి (చైతన్యరథం): "తల్లికి వందనం" ద్వారా మైనారిటీ తల్లుల జీవితాలలో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతోందని గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్య అనేది ప్రతి పేద బిడ్డ ప్రాథమిక హక్కు అని విశ్వసించే కూటమి ప్రభుత్వం, పరిపాలనలో ప్రతి క్షణం పేద విద్యార్థుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాష్ట్రంలో ఏ ఒక్క బిడ్డ కూడా విద్యకు దూరం కాకూడదనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ "తల్లికి వందనం" పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలా కాకుండా, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా వారందరికీ లబ్ధి చేకూరుస్తూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చడమే కాకుండా, 73 వేల మంది ముస్లిం మైనారిటీ విద్యార్థుల ఇళ్లల్లో విద్యా వెలుగులు నింపిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం 'అమ్మఒడి' పేరుతో పేదలను, మైనారిటీలను దారుణంగా వంచించిందని నసీర్ అహ్మద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాటి పాలకులు కరెంట్ బిల్లులు, చాలీచాలని జీతాలు, చిన్నపాటి కారణాలు చూపుతూ పథకాన్ని ఎగ్గొట్టే కుట్రలు చేశారని మండిపడ్డారు. రూ.10 వేల వేతనం పొందే అంగన్వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా లబ్ధి దక్కకుండా చేసిన ఘోరమైన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిదే అని విమర్శించారు. పాఠశాలల్లో టాయిలెట్లు, మెయింటెనెన్స్ పేరుతో రూ. 2,178 కోట్ల నిధులను గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం ఇస్తామని చెప్పి, ఐదేళ్ల పాలనలో లబ్ధిదారుల సంఖ్యను దారుణంగా కుదించి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నారని



ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది, నేడు కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల పిల్లలతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు సైతం "తల్లికి వందనం" అందిస్తూ కొండంత అండగా నిలిచిందన్నారు.

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల పట్ల కూటమి ప్రభుత్వం గొప్ప మానవత్వాన్ని చాటుకుంటోందని ఎమ్మెల్యే వెల్లడించారు. అనాథ పిల్లలకు ప్రభుత్వమే తల్లిదండ్రిగా మారి, జిల్లా కలెక్టర్ల ద్వారా నేరుగా వారి నివాసాలకే "తల్లికి వందనం" నిధులను అందిస్తోందని తెలిపారు. అనంతపురం జిల్లా కొండరితి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వడ్డెర రాము, పద్మావతి దంపతుల ఆరుగురు పిల్లలకు ఏకంగా రూ. 78,000 లబ్ధి చేకూర్చడమే ఈ ప్రభుత్వ నిజాయితీకి, పారదర్శకతకు తార్కాణమని ఉదాహరించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి నెలలోనే ప్రతి ఒక్క తల్లి ఖాతాలో నగదు జమ చేస్తున్నామని, సాంకేతిక సమస్యలు ఉంటే ఎస్ఎమ్ఎస్ ద్వారా ముందస్తు సమాచారం అందిస్తూ పక్కాగా వ్యవస్థను నడుపుతున్నామని వివరించారు.

రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి 'నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. మెగా డీఎస్సీ నిర్వహణ, ఉపాధ్యాయుల బదిలీలు, విద్యార్థులకు విద్యా కానుక కిట్లు, మధ్యాహ్న భోజన నాణ్యత వరకు ప్రతి అంశాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కేవలం పథకాల నిధులే కాకుండా 'మెగా పీటీఎం' వంటి వినూత్న వేదికల ద్వారా ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ విద్యా ప్రమాణాలను పెంచుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో విద్యా విప్లవానికి నాంది పలికిన కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకి, మంత్రి లోకేష్‌కి రాష్ట్ర ప్రజలు, మైనారిటీ సోదరులు సంపూర్ణ మద్దతుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు.

# తప్పుడు ప్రచారాలతో తప్పుదోవ పట్టించడం వైసీపీ నైజం

- ఒక్కొక్కటిగా బయటకొస్తున్న భూమన భూ దందాలు
- ప్రజల దృష్టి మళ్లించేందుకు కుటిల యత్నాలు
- జగన్ హయాంలో దేవాలయాల్లో ఎన్నో అపచారాలు
- దేనిపైనా స్పందించని నాటి పాలకులు
- కూటమి ప్రభుత్వంలో ఆలయాల పవిత్రత, భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు
- ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

అమరావతి (చైతన్యరథం): తాము చేసిన తప్పులు ప్రజలకు కనిపించకుండా ఉండేందుకు మరో కొత్త వివాదాన్నిసృష్టించి ప్రజల దృష్టిమళ్లించాలనే ధోరణితో వైసీపీ నేతలు వ్యవహరిస్తారని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ విమర్శించారు.మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కరుణాకర్‌రెడ్డికి సంబంధించిన భూదందాలు, అక్రమాల అంశాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు.

## భూమన దందాలు

వైసీపీ నాయకుడు భూమన కరుణాకరరెడ్డి భూదందాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. స్వర్ణముఖి పరిసరాల్లో భూముల వ్యవహారం, కపిల తీర్థం సెంటర్‌లోని ధ్యాన మందిరం ఆక్రమించి మెరిడియన్‌హోటల్‌గా మార్చారనే ఆరోపణలు,అన్నమయ్య సెంటర్‌తోపాటు పీఏ పేర్లపై జరిగిన భూముల వ్యవహారాలు, తిరుపతిలో ఎండోమెంట్స్ శాఖకు చెందిన ఆస్తులపై వచ్చిన ఆరోపణలు అన్నీ ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయని తెలిపారు.అంతేకాదు, గంజాయి వ్యవహారాల నుంచి కుళ్లిన మాంసంతో బిర్యానీలు విక్రయించారనే ఆరోపణల వరకు అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయని,వీటిపై సమాధానం చెప్పాల్సింది పోయి ప్రజలదృష్టిని మళ్లించేందుకు కొత్త కొత్త అంశాలను తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు.



## 14 గంటల్లోనే నిందితులకి శిక్ష

తిరుమల ఘాట్‌రోడ్డులో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ ఘటన జరిగిన వెంటనే కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందని బుచ్చి రాంప్రసాద్ తెలిపారు. కేవలం 14 గంటల్లోనే నిందితుడిని గుర్తించి, విశాఖకు చెందిన వ్యక్తిని ఒంగోలులో అదుపులోకి తీసుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు.

ఎక్కడైనా తప్పు జరిగితే దానిని వెంటనే గుర్తించి, బాధ్యులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు. తప్పులు జరగకుండా చూసే బాధ్యత ఎంత ఉంటుందో, జరిగితే వెంటనే సరిదిద్దే బాధ్యత కూడా అంతే ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పుడు చిన్న ఘటనను పెద్దది చేసి మాట్లాడుతున్న వైసీపీ నాయకులు, వారి ప్రభుత్వంలో జరిగిన ఘటనలకు సమాధానం చెప్పాలని బుచ్చి రాంప్రసాద్ డిమాండ్ చేశారు.

## వైసీపీ ప్రభుత్వంలో

రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం ధ్వంసమైన ఘటనలో ఏం చేశారు? అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి చెందిన వందేళ్ల నాటి రథం దగ్ధమైన ఘటనలో ఎవరిని శిక్షించారు? దుర్గమ్మవారి ఆలయంలో వెండి సింహాల దొంగతనం విషయంలో అసలు బాధ్యులను పట్టుకున్నారా? తిరుపతిలో జరిగిన వివిధ ఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరిగిందా? అని ప్రశ్నించారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో దేవాలయాలపై జరిగిన దాడులు, బ్రాహ్మణులు, అర్చకులపై జరిగిన దాడి ఘటనలు, ఎండోమెంట్స్ శాఖలో చోటు చేసుకున్న అవకతవకలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరోజైనా సమీక్ష నిర్వహించారా? ఏదైనా ప్రత్యేక కమిటీ వేశారా? బాధ్యులను శిక్షించారా? అధికారంలో ఉన్నప్పుడు దేవాలయాలపైజరిగిన ఘటనలను పట్టించుకోని వైసీపీ, ఇప్పుడు మాత్రం దేవుడిపై ప్రేమ ఉన్నట్టు మాట్లాడటం ప్రజలను మోసం చేయడమేనన్నారు. జరగని ఘటనలు జరిగినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసి భక్తుల మనోభావాలను రెచ్చగొట్టడం సరికాదన్నారు.

శ్రీశైలం లడ్డూలో బొద్దింక ఉందంటూ ప్రచారం చేసిన ఘటనలో చివరకు సంబంధిత వ్యక్తి తానే చేశానని ఒప్పుకున్నాడు.తిరుమలలో కంపార్ట్‌మెంట్‌లో జరిగిన గొడవను కూడా రాజకీయ రంగు పులమాలని ప్రయత్నించారని, కనకదుర్గమ్మ ఆలయంలో లడ్డూలో మేకు ఉందంటూ ప్రచారం చేసిన ఘటనలో కూడా వాస్తవాలు బయటకు వచ్చాయి.దేవాలయాలు, ప్రసాదాలు, భక్తుల విశ్వాసాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునేందుకు వైసీపీ ఎలాంటి హద్దులైనా దాటుతుందని బుచ్చి రాంప్రసాద్ అన్నారు.

## కూటమి ప్రభుత్వంలో భద్రత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ, దేవాలయాల పవిత్రతను కాపాడేందుకు ప్రభుత్వం పనిచేస్తోంది. కరుణాకర్‌రెడ్డి సహా వైసీపీ నాయకులు తమపైవస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా, తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలి. భక్తుల మనోభావాలతో రాజకీయాలు చేయడం ఆపాలని, తప్పు జరిగితే ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు.

కూటమి ప్రభుత్వం దేవాలయాల రక్షణ, భక్తుల విశ్వాసాల పరిరక్షణ విషయంలో రాజీపడదని,చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినచర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలను విశ్వసించే పరిస్థితి ఇక లేదని బుచ్చి రాంప్రసాద్ స్పష్టం చేశారు.



## పాలకొల్లులో క్రోచెట్ లేస్ కళాకారులకు కంటి పరీక్షలు

**- పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశంతో కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరాలు**

ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట మేరకు రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. గురువారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని యలమంచిలిలో క్రోచెట్ లేస్ కళాకారుల కోసం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 217 మంది కళాకారులకు కంటి పరీక్షలు చేశారు. అందులో ఐదుగురికి శుక్లాల సమస్య ఉన్నట్టు గుర్తించారు. 187 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. వారికి కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. గతవారం నరసాపురంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కంటి చూపు సమస్యలు ఉన్న 142 మంది కళాకారులకి ఉపముఖ్యమంత్రి కళ్లద్దాలు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు.



# ఉప రాష్ట్రపతితో టీడీపీ ఎంపీల భేటీ

న్యూఢిల్లీ (చైతన్యరథం): పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన నూతన ఎంపీలు సానా సతీష్, భాష్యం రామకృష్ణ గారు, చింతకాయల విజయ్ సెషన్ విరామ సమయంలో గురువారం భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఎంపీలకు ఉప రాష్ట్రపతి పలు సూచనలు చేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



# కేంద్రమంత్రి మురుగన్‌ను కలిసిన టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ (చైతన్యరథం): పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో గురువారం సెషన్ విరామ సమయంలో రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎంపీలు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ కలిసి కేంద్ర సమాచార ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత వర్షాకాల సమావేశాల నిర్వహణ తీరుతెన్నులు, రాజ్యసభ సెషన్స్‌లో చర్చకు రానున్న పలు కీలక ప్రజా సమస్యలు, బిల్లులు, పార్లమెంటరీ సాంప్రదాయాలు, నిబంధనలపై ఈ సందర్భంగా వారు కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. పార్లమెంటరీ విధానాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు రాష్ట్ర ప్రయోజనాల సాధనకు సంబంధించిన పలు అంశాలు ఈ భేటీలో చర్చించారు.



## భూమన కుటుంబంపై

# క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

### - ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్

అమరావతి (చైతన్యరథం):ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షులు అట్లూరి నారాయణ రావు, శ్రీ శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ, తుమ్మ ఓంకార్ తదితరులు కలిసి తిరుపతి సమీపంలోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో భూమన కుటుంబం ఆక్రమించిందని ఆరోపిస్తున్న స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.


ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుమారు 9 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ప్రభుత్వ భూములపై ఎటువంటి అక్రమ ఆక్రమణలు జరిగినా వాటిని ఉపేక్షించకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా, ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు తేలితే సంబంధిత బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆక్రమణలను వెంటనే తొలగించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటిని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, ఈ అంశంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ విజ్ఞప్తి చేసింది.

# దేశంలో విశాఖ టాప్!

- ఉద్యోగాల కల్పన, అభివృద్ధిలో సూపర్‌ఫాస్ట్ వేగం
- అగ్రస్థానంలో రాష్ట్ర ఆర్థిక రాజధాని నగరం



ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద నగరం విశాఖపట్నం.. అభివృద్ధిలోనూ సూపర్ ఫాస్ట్‌గా దూసుకుపోతోంది. అటు అభివృద్ధిలోనూ, ఇటు ఉద్యోగాల కల్పనలోనూ వెలుగులు విరజిమ్ముతోంది. మన దేశంలో వేగంగా డెవలప్ అవుతున్న నాన్ మెట్రో సిటీస్‌లో వైజాగ్ టాప్ ప్లేస్ నిలబెట్టుకొంది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ లింక్డ్‌ఇన్ రిపోర్టులో.. మన స్టీల్ సిటీకి తిరుగులేదని తేలింది. ఈ జాబితాలో రాష్ట్ర ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖపట్నం అగ్రస్థానంలో నిలిచింది. ఐటీ, ఐటీఈఎస్, ఫార్మా, స్టార్టప్ రంగాల విస్తరణతో పాటు గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు విశాఖను తమ ప్రాధాన్య డెస్టినేషన్‌గా ఎంచుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. ఇటీవల సముద్ర తీరప్రాంత మౌలిక వసతుల అభివృద్ధి, స్టార్టప్ ఎకో సిస్టమ్‌కు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం.. ఐటీ నిపుణులను, మేధో సంపత్తిని వైజాగ్ వైపు అడుగులు వేసేలా చేస్తోందని పారిశ్రామిక రంగానికి చెందిన నిపుణులు విశ్లేషిస్తున్నారు. విశాఖ తర్వాత స్థానాల్లో లుధియానా, సూరత్, వడోదరా, ప్రయాగ్‌రాజ్ వంటి నగరాలు ఉన్నాయి.

ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లతో టెక్నాలజీ రంగంలో వస్తున్న లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు.. ఫైనాన్షియల్ సర్వీసెస్, మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎడ్యుకేషన్ రంగాల్లోనూ వైజాగ్ దూసుకుపోతోంది. ఈ సెక్టార్లలో వేల సంఖ్యలో కొత్త ఉద్యోగ అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. ఈ కారణాలతో జాబ్ క్రియేషన్‌లో విశాఖపట్నం.. దేశంలో ఫస్ట్ ప్లేస్‌లో నిలిచింది. ఏఐ ప్రభావంతో ఐటీ ఉద్యోగాలు దొరకడం కష్టమవుతున్న సమయంలో.. కొత్త జాబ్స్‌కి విపరీతమైన డిమాండ్ ఉంది.

ఎక్కడ అవకాశాలు దొరికితే యువత అక్కడ వాలిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న వైజాగ్ వంటి నగరాలు యువతకు కెరీర్ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఒకప్పుడు విశాఖలో స్టీల్‌ప్లాంట్,పోర్టు, హెచ్‌పీసీఎల్ రిఫైనరీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలే ఎక్కువ ఉద్యోగాలు కల్పించేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ ప్లాన్ ప్రకారమే ఐటీ, ఏఐ, టూరిజం, ఏరో స్పేస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

గూగుల్ డేటా సెంటర్, మిట్టల్ స్టీల్ ప్లాంట్, భోగాపురం ఎయిర్‌పోర్ట్ వంటి ఐటీ, ఇన్‌ఫ్రా, తయారీ రంగ ప్రాజెక్టులతో వైజాగ్ కొత్త అవకాశాలకు కేంద్రంగా మారింది. ఇప్పటి వరకు స్థానిక యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. కానీ రానున్న కాలంలో.. ఉత్తరాంధ్రతో పాటు, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల యువత ఉద్యోగాల వేటలో.. విశాఖ ఫస్ట్ ఆప్షన్‌గా మారుతుంది. అందుకే విశాఖకి దేశంలోనే ఫాస్టెట్ గ్రోయింగ్ సిటీ ట్యాగ్ దక్కింది. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం అధికారంలో ఉంటే.. యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఆ తర్వాత ర్యాంకులు, రివార్డులు వాటంతట అవే వస్తాయి. రాష్ట్ర అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం రాసిన పరీక్షలో.. ఆల్ ఇండియా నెంబర్ వన్ ర్యాంకు సాధించిందని చెప్పొచ్చు.

# లూనార్ మిషన్‌కు ఏపీ విద్యార్థిని ఎంపిక

### మంత్రి లోకేష్ అభినందనలు

రాజమండ్రి(చైతన్యరథం): పేదరికం ప్రతిభకు అడ్డుకాదని తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కందుల జెస్సీ నిరూపించింది. ప్రపంచంలోనే తొలి ఆల్-గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ 'మిషన్ శక్తి శాట్'కు ఎంపికై రికార్డు సృష్టించింది. భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో జెస్సీ చోటు దక్కించుకుని ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా నిలిచింది. 108 దేశాల నుంచి సుమారు 12 వేల మంది బాలికలు ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోగా పలు దశల ఎంపిక ప్రక్రియ అనంతరం జెస్సీ తుది జాబితాలో స్థానం సంపాదించింది. ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం జిల్లాకే కాకుండా రాష్ట్రానికి గర్వకారణంగా మారింది.

#### ఢిల్లీలో శిక్షణ.. అక్టోబరులో ప్రయోగం

ఆగస్టు 23 నుంచి న్యూఢిల్లీలో జరిగే తదుపరి దశ శిక్షణలో జెస్సీ పాల్గొననుంది. జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాలతో పాటు శాస్త్రవేత్తలతో కలిసి శాటిలైట్ డిజైన్, పేలోడ్ అభివృద్ధి, మిషన్ ఆపరేషన్స్‌పై ప్రాక్టికల్ శిక్షణ పొందనుంది. మరోవైపు విద్యార్థినులు రూపొందించే లూనార్ క్యూబ్‌శాట్‌ను అక్టోబర్ 11న శ్రీహరికోట నుంచి ప్రయోగించేందుకు ప్రణాళిక సిద్ధమైంది.

#### ఇస్రోలో చేరడమే లక్ష్యం..లోకేష్ అభినందనలు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిగా తాను ఎంపికవుతానని అసలు ఊహించలేదని జెస్సీ తెలిపింది. అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో మాట్లాడేటప్పుడు చాలా ఉత్కంఠగా అనిపించిందని పేర్కొంది. ఈ విజయం తనలో మరింతఆత్మవిశ్వాసాన్ని నింపిందని, భవిష్యత్తులో ఇస్రోలో చేరి దేశానికి సేవ చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపింది. జెస్సీ విజయంపై లోకేష్ ఎక్స్



వేదికగా స్పందించారు. 'మిషన్ శక్తిశాట్'కు ఎంపికైన సందర్భంగా అభినందనలు తెలిపారు.

# పల్లె సీమల్లో ప్రగతి రథం

## కూటమి పాలనలో గ్రామ పంచాయతీలకు పునరుజ్జీవం



పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. అక్షరాస్యత, పరిశుభ్రత, స్వచ్ఛత, మౌలిక వసతుల కల్పన ద్వారా గ్రామాలు త్వరగా అభివృద్ధి సాధిస్తాయి. ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే 2024 ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి వరల్డ్ రికార్డు సాధించారు. అదే విధంగా పల్లె పండుగ 1.0, 2.0 ద్వారా గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చడానికి, మౌలిక వసతులను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయితీ నిధులు రూ.8,640 కోట్లను దారి మళ్లించి, పల్లెలను, గ్రామ పరిపాలనను నిర్వీర్యం చేశారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చి గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికి కూడా నిధుల్లేకుండా చేశారు. గాడి తప్పిన పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది.

### పల్లె పండుగ , పల్లె పండుగ 2.0

కూటమి ప్రభుత్వ వచ్చాక గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ, పల్లె పండుగ 2.0 కార్యక్రమాల ద్వారా రూ.16,960 కోట్లతో 7,580 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 2,500 కిలో మీటర్ల బీటి రోడ్లు, 37,817వేల మినీ గోకులాలు, పశువుల తాగునీటి అవసరాల కోసం 15,188 నీటి తొట్టెలు నిర్మించారు. 1.7లక్షల నీటి కుంటలు (ఫార్మ్ పాండ్లు) తవ్వించారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,200 కోట్లు విడుదల చేసి గ్రామాలాభివృద్ధికి బాటలు వేసింది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం చిన్న పంచాయితీలకు 100 రూపాయల నుండి 10 వేల రూపాయలకు, పెద్ద పంచాయితీలకు 250 రూపాయల నుండి 25 వేల రూపాయలకు పెంచి సర్పంచుల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించింది. 1994లో జరిగిన చట్ట సవరణ ప్రకారం ఇద్దరికంటే ఎక్కువ మంది సంతానం కలిగి ఉన్న వారు పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. కూటమి ప్రభుత్వంలో ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లలున్నా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేలా ఏపీ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు 2024 కు అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

### గ్రామీణాభివృద్ధిలో జాతీయ గుర్తింపు

గ్రామ స్వరాజ్యం, పారదర్శక పాలన, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐదు ప్రతిష్టాత్మక అవార్డులు సాధించి దేశవ్యాప్తంగా తన సుపరిపాలనా దక్షతను నిరూపించుకుంది. ఈ అవార్డులు కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అందిస్తున్న సమర్థవంతమైన పాలనకు అద్దం పడుతున్నాయి. గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామ పంచాయతీలకు కొత్త ఊపిరి పోసి, వాటిని స్వావలంబన, అభివృద్ధి కేంద్రాలుగా మార్చడంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయం ఈ అవార్డుల ద్వారా మరోసారి నిరూపణ అయింది.

**కరెంట్ అనాలిసిస్**

తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

మంగినపల్లి ఎలీషా, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

### వీబీ-జీ-రామ్ జీ గ్రామీణ శ్రామికులకు వరం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA) స్థానంలో కేంద్ర ప్రభుత్వం 2025లో తీసుకొచ్చిన కొత్త చట్టం వీబీ-జీ-రామ్ జీ (వికసిత్ భారత్ - రోజ్‌గార్, అజీవిక మిషన్ - గ్రామీణ్) గ్రామీణ శ్రామికులకు వరంగా మారుతోంది. గతంలో అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేస్తూ, గ్రామీణ ప్రజలకు మరింత బలమైన ఉపాధి హామీ, త్వరిత వేతన చెల్లింపులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే దీని ముఖ్య లక్ష్యం. వీబీ-జీ-రామ్ జీ పథకం కింద కేంద్రం ప్రభుత్వం 60శాతం నిధులు రూ. రూ.2,226 కోట్లు రాష్ట్ర వాటా రూ.1484 కోట్లు ఖర్చు చేస్తాయి. గతంలో ఉపాధి హామీ పథకం కింద ఒక్కో గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజులు పనులు మాత్రమే ఉండేవి. వీబీ-జీ-రామ్ జీ పథకం ద్వారా వాటిని 125 రోజులకు పెంచారు. అంటే ప్రతి కుటుంబానికి అదనంగా 25 రోజుల పని దినాలు లభిస్తాయి. సగటు రోజువారీ వేతనం రూ.307కు పెంచారు. వేతన చెల్లింపు పని పూర్తయిన తర్వాత 7 రోజుల్లో వేతనం చెల్లించాలి. 15 రోజులు మించి ఆలస్యమైతే ప్రతి రోజుకు 0.05% వడ్డీతో సహా చెల్లించేలా నిబంధన అమలు చేస్తున్నారు. వీబీ-జీ-రామ్ జీ పథకం గ్రామీణ పేదలు, రోజువారీ కూలీల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో మైలురాయిగా నిలుస్తుందని, ఇది వారికి మరింత బలమైన ఆర్థిక భద్రతను అందించే వరంగా మారుతుందని అధికారులు తెలిపారు.



### "ప్రజల దాహార్తి" తీర్చే 'జల్ జీవన్' మిషన్

ఇంటింటికీ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ (జేజేఎం)ను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. రాష్ట్రంలో 95.44 లక్షల కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, 2024 జూన్ నాటికి కేవలం 39 లక్షల కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. కేంద్రం విడుదల చేసిన రూ.10,173 కోట్లలో కేవలం రూ.2,255 కోట్లు మాత్రమే వినియోగించుకుని, మిగిలిన నిధులు వినియోగం చేయకపోవడంతో కేంద్రం కూడా అదనపు నిధులు విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి మేరకు 95.44 లక్షల కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి గడువును 2028 జూలై 31 వరకు పొడిగించింది. కూటమి ప్రభుత్వం సమూల మార్పులతో గ్రామాల్లోని ప్రతి ఇంటికీ 365 రోజులు నిరంతరం తాగునీరు అందించేందుకు రూ.70,000 కోట్లతో విస్తృత ప్రణాళిక రూపొందించింది. సమీప జలాశయాలు, నదుల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తరలించే వ్యవస్థను ఏర్పాటు చేసింది. భవిష్యత్తు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూ.9,355 కోట్ల అంచనాలతో జలజీవన్ మిషన్ (జేజేఎం), ఈ ప్రాజెక్టుల ద్వారా 13 నియోజకవర్గాల్లో ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

### 'స్వచ్ఛ' రథాలు

గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లలో పోగయ్యే వ్యర్థాలను సంపదగా మార్చే ఉద్దేశంతో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టిన వినూత్న ప్రాజెక్టు సూపర్ హిట్ అయింది! 'స్వచ్ఛ రథం' పేరుతో 434 వాహనాల ద్వారా ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్, ఇతర రకాల వస్తువుల ఘన వ్యర్థాలను సేకరిస్తున్నారు. పాత ఇనుము, పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్ బాటిళ్లు, స్టీల్ వస్తువులను సేకరించి.. బదులుగా గ్రామీణులకు పప్పు, ఉప్పు, చింతపండు, సబ్బులు వంటి ఇతర నిత్యావసర వస్తువుల అందజేత విజయవంతంగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 10 వేలకు పైగా షెడ్లను నిర్మించారు. చెత్తను వేరు చేసి, వర్మీ కంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తడి, పొడి చెత్తలు కాకుండా ప్లాస్టిక్, పాత ఇనుము, ఇతర వ్యర్థాలకు సంబంధించి ఎలాంటి ప్రక్రియ ఇప్పటి వరకు జరగలేదు. ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను ప్రత్యేక వాహనాలతో సేకరించడం ద్వారా దాదాపు 995 టన్నుల వేస్ట్‌ను సేకరించి, గ్రామీణులకు రూ.1.40 కోట్ల మేర విలువైన వస్తువులను అందించారు.

### మ్యాజిక్ డ్రెయిన్లు

గ్రామాల్లో మురుగునీటి సమస్య శాశ్వత నివారణకు పల్లె పండుగ 2.0 కింద సరికొత్తగా 59 కి.మీ మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే క్షేత్రస్థాయిలో 32.30 కి.మీ మేర పనులు పూర్తి చేశారు.

గత వైసీపీ పాలనలో రాష్ట్రంలోని పల్లెలన్నీ సమస్యల ఊబిలో కొట్టుమిట్టాడాయి. పంచాయితీ నిధులు రూ.8,640 కోట్లను దారి మళ్లించి, పల్లెలను, గ్రామ పరిపాలనను నిర్వీర్యం చేశారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చి గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికి కూడా నిధుల్లేకుండా చేశారు. కేంద్ర నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధుల్ని గత పాలకులు దారి మళ్లించి పంచాయతీల ఖాతాలన్నీ ఖాళీ చేశారు.. దీంతో ఏ పనులూ చేయలేక గ్రామస్తులకు సమాధానం చెప్పలేక సర్పంచ్‌లు తెల్లముఖం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్త సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చారు. వీధి దీపాల నిర్వహణ లేక రాష్ట్రంలో అంధకారంలో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పాడింది. 5లక్షల జాబ్ కార్డులు తొలగించి పేదల పొట్టగొట్టారు. దొంగ మస్టర్లతో రూ.1300 కోట్లు దోచుకున్నారు. జల్ జీవన్ మిషన్ కింద రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా ఆ పథకాన్ని నిర్వీర్యం చేసింది. 94లక్షల కుటుంబాలకు గాను కేవలం 39లక్షల కుటుంబాలకు మాత్రమే కుళాయి కలెక్షన్లు మాత్రమే ఇచ్చి రూ.4,235 కోట్లు దోపిడికి పాల్పడ్డారు. ఈ పథకం అమల్లో దేశంలో 30 స్థానానికి రాష్ట్రం దిగజారింది. గత పాలకుల నిర్వాకం వల్ల పంచాయతీల ప్రగతి కుంటుపడింది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతంచేసి, గ్రామీణాభివృద్ధికి అసాధారణ కృషితో ప్రతిగ్రామీణ కుటుంబాన్ని పేదరికం నుండి బయటకు తీసుకొచ్చేందుకు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోంది.



# శ్రీకాకుళాన్ని దోచుకున్న 'గొడ్డలి' ముఠా

- రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి అరాచకాలు
- నేరం చేసినందునే తమ్మినేని, సీదిరిపై కేసులు
- యాక్సిడెంట్ కేసులో కొడుకుని కాపాడేందుకు సీదిరి తప్పుడు పనులు
- బతికున్నోడిని చంపేసి భూములు కాజేస్తారా?
- జిల్లాలో రౌడీయిజం, దౌర్జన్యాలు చేసిన వారి భరతం పడతాం
- సంక్షేమం, అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం జైత్రయాత్ర
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని శ్రీకాకుళం జిల్లాను నిలువునా దోచుకున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మండిపడ్డారు. శ్రీకాకుళంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీనియర్ నాయకులుగా చెలామణి అవుతూ, చట్టసభల్లో అత్యున్నతమైన స్పీకర్ స్థాయిలో పదవి చేపట్టిన వారు, అలాగే సుదీర్ఘ కాలం పాటు రాజకీయాల్లో ఉండి మంత్రి పదవులు అనుభవించిన కొంతమంది నాయకుల భూదాహానికి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఎక్కడికక్కడ వాళ్ల సొంత పేర్లు పెట్టుకుని ఎస్టేట్లు స్థాపించడం, పత్రాల్లో మార్పులు చేర్పులు చేయడం, చివరికి బతికున్న వారిని చనిపోయినట్టుగా సృష్టించి దొంగ పత్రాలు తయారు చేయడం వంటి అకృత్యాలకు పాల్పడ్డారు. ఈ నాయకులు ప్రజలను, ప్రభుత్వాన్ని ఎలా దోచుకున్నారో ఒక్కొక్కటిగా బయటపడుతుంటే ప్రజలు విస్తుపోతున్నారు. ఒక పక్క మైన్స్‌లో, ఇంకో పక్క మద్యంలో, మరో పక్క భూదందాల్లో ఇష్టానుసారంగా దోచుకున్నారని ఎమ్మెల్యే శంకర్ దుయ్యబట్టారు.



సాక్షాత్తూ వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి గతంలో వీరిని తండ్రులుగా, అన్నలుగా, పెద్దాయనలుగా సంబోధించారు. నాటి స్పీకర్ తమ్మినేని సీతారాంని కూడా తండ్రి లాగా సంబోధించిన విషయం అందరికీ గుర్తే ఉంది. అలాంటి వ్యక్తులు ఇప్పుడు తప్పుడు పనులు చేస్తే దానికి ఏం సమాధానం చెప్తారు? ఒకరేమో మాకు సంబంధం లేదంటారు, ఇది పార్టీకి సంబంధం లేని వ్యక్తిగత విషయం అని దాటవేసే ప్రయత్నం చేస్తారు. కానీ ఏ పార్టీ అధికారం ఉన్నప్పుడు ఏ పదవిలో ఉండి ఇవన్నీ చలాయించారో, ఎలా ఆస్తులు కూడబెట్టారో దానికి సమాధానం ఎవరు చెప్తారు? జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం వంటి ప్రశాంతమైన నియోజకవర్గంలో పక్క నియోజకవర్గాల నుండి వచ్చేసి ఇక్కడ రౌడీయిజంతో దందాలు చేశారు. పూర్వం బ్రిటిష్ వారు వేరే దేశం నుండి వచ్చి ఇక్కడి సంపదను కొల్లగొట్టుకుని వాళ్ల దేశానికి ఎత్తుకెళ్లిపోయినట్టు, ఈ గొడ్డలి పార్టీ నాయకులు వేరే నియోజకవర్గాల నుండి వచ్చి శ్రీకాకుళం సంపదను కొల్లగొట్టుకుని వెళ్లడానికి ప్రణాళికలు వేశారని ఎమ్మెల్యే శంకర్ విమర్శించారు.

అలాగే సీదిరి అప్పలరాజు గురించి మాట్లాడితే, ఆయన ఒక డాక్టర్ అయి ఉండి, ఇలాంటి తప్పుడు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడటం విచారకరం అన్నారు. ఆనాడు నిండు కౌరవ సభలో చంద్రబాబు నాయుడుపై అప్పలరాజు మాట్లాడిన నీచమైన మాటలు అందరికీ గుర్తే ఉన్నాయి. ఇటీవల సీదిరి అప్పలరాజు కొడుకు చేసిన యాక్సిడెంట్ విషయంలో, చట్టాన్ని గౌరవించి బాధితుడికి అండగా నిలవాల్సింది పోయి, సీసీ కెమెరా ఆధారాలు దొరక్కుండా ముద్దాయిని దాచిపెట్టే ప్రయత్నం చేశారు. బాధితుడికి అండగా ఉండకుండా ముద్దాయికి అండగా నిలబడటమే ఈ గొడ్డలి పార్టీ సంస్కృతిగా మారింది. వీళ్ల జగనన్న కాలనీల పేరుతో భూదందాలన్నింటినీ సమయం వచ్చినప్పుడు ఆధారాలతో సహా బయటపెడతాను. పనికిమాలిన పెయిడ్ ఆర్టిస్ట్‌లతో మాట్లాడించేసి, నిజాయితీగా ఉన్న మాలాంటి వాళ్ల పైన బురద చల్లితే ఈ రోజుల్లో నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని ఎమ్మెల్యే శంకర్ అన్నారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం చట్టం విషయంలో చాలా దృఢనిశ్చయంతో ఉంది. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులను కూడా నోటీసులు ఇచ్చి అరెస్టులు చేసిన పరిస్థితి, మద్యం షాపుల దగ్గర టీచర్లను కాపలాగా పెట్టిన పరిస్థితి ఉండేది. కానీ ఈ రోజు శాంతిభద్రతలను కాపాడుతూ, పోలీసులకు అత్యున్నతమైన సేవలు అందించడానికి ట్రైనింగ్‌లు ఇస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా ముందుకు తీసుకెళ్తున్నాం. సీతారాంపై గానీ, అప్పలరాజుపై గానీ నమోదైన కేసులు వారు చేసిన తప్పులు, బాధితుల ఫిర్యాదుల ఆధారంగానే చట్టప్రకారం జరుగుతున్నాయి. గతంలో మా నాయకుడిని అక్రమంగా అరెస్ట్ చేసి, ఎలాంటి ఆధారాలు లేని కేసులో 54 రోజులు నిర్బంధించినట్లుగా.. మా ప్రభుత్వం ఎవరిపై కక్షసాధింపు చర్యలు దిగదు, ఆధారాలతోనే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. మైన్స్, మద్యం, భూదందాల ద్వారా దోచుకుతిన్న ప్రతీ ఒక్కరి అవినీతిని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం బయటకు తీస్తుంది, ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఒకసారి ఛాన్స్ అని నమ్మి 151 సీట్లు కట్టబెడితే అధికారాన్ని దుర్వినియోగం చేసినందుకే ప్రజలు ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేశారు. నిజాలు నిలకడగా బయటకు వస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు నారా చంద్రబాబు నాయుడుని అనరాని మాటలని ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరూ నేడు ప్రత్యక్షంగా అనుభవిస్తున్నారు, రాబోయే రోజుల్లో కూడా అనుభవిస్తారు. కూటమి ప్రభుత్వం ఒక పక్క సంక్షేమం, ఇంకో పక్క అభివృద్ధి, మరో పక్క పెట్టుబడులతో వేగంగా ముందుకు దూసుకెళ్తోంది. ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో ఉత్తరాంధ్ర తలరాత మారబోతోంది. అక్రమార్కుల భరతం పడతాం, ప్రజలకు మంచి పాలన అందిస్తామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు.

## యాక్సిడెంట్ కేసులో.. సాక్ష్యాలు తారుమారు, సీదిరి అరెస్ట్!

- నిందితుడిగా వేరొకరిని చూపించి కొడుకుని కాపాడుకునే యత్నం
- పోలీసుల దర్యాప్తు, సీసీ టీవీ దృశ్యాలతో వెలుగులోకి వాస్తవం
- పకడ్బందీ ఆధారాలతో అరెస్ట్ చేసిన పోలీసులు
- ఇది అక్రమమంటూ వక్రదృష్టి జగన్ రాద్ధాంతం

అమరావతి (చైతన్యరథం): జగన్ భాషలో చెప్పుకుంటే.. పాపం పద్దేనిదేళ్ల పిల్లాడు తెలిసో తెలియకో ప్రమాదం చేశాడు..ఒక బడుగు జీవి ప్రాణాలు కోల్పోయాడు.. ఆ మంచి పిల్లాడి తండ్రి సీదిరి అప్పలరాజుని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. ఈ కేసులో సాక్ష్యాలు తారుమారు చేసి.. నిందితుడిని అప్పలరాజు మార్చేశారు. అన్నిటినీ వక్రదృష్టితో చూసే జగన్ దృష్టిలో ఇది సక్రమమే అయినా.. చట్టం దృష్టిలో మాత్రం ముమ్మాటికీ అక్రమమే.

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ అతివేగంగా బైక్ నడుపుతూ ఒక నిరుపేద వ్యక్తిని ఢీకొట్టగా, తీవ్ర గాయాల పాలైన బాధితుడిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం కూడా చేయకుండా వదిలేయడంతో ఆ పేద కుటుంబ పెద్ద ప్రాణాలు కోల్పోయాడు. అయితే, ఘటన స్థలంలో ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించాల్సింది పోయి.. పలుకుబడిని అడ్డం పెట్టుకుని కేసును పక్కదారి ప్రయత్నించి దొరికిపోయాడు.

ప్రమాదం జరిగిన వెంటనే నిజాయితీగా తప్పును ఒప్పుకోవాల్సింది పోయి.. సీదిరి అప్పలరాజు స్వయంగా రంగంలోకి దిగి తన కుమారుడి స్థానంలో వేరొక యువకుడిని నిందితుడిగా ఇరికించేందుకు కుట్ర పన్నారు. అన్యాయంగా ప్రాణాలు కోల్పోయిన ఆ పేద కుటుంబం ఓ వైపు దిక్కుతోచని స్థితిలో ఏడుస్తుంటే.. సదరు కుటుంబాన్ని పరామర్శించడం, వారికి న్యాయం జరిగేలా చూడటం పక్కనబెట్టి, కేసును రాజీ చేసుకోవాలంటూ ఒత్తిళ్లు తెచ్చిన తీరు వారి అహంకారానికి అద్దం పడుతోంది. ఆరవ్‌కు బదులుగా సిద్ధార్థ త్యాడి అనే వేరొక వ్యక్తిని పోలీసులు ముందుకు తెచ్చి, ప్రమాదం చేసింది అతడేనని నమ్మించే ప్రయత్నం చేశారు.

అయితే, స్థానికుల నిరసనలు, పోలీసుల లోతైన విచారణలో సీసీ టీవీ దృశ్యాల ఆధారంగా అసలు నిందితుడు మాజీ మంత్రి కుమారుడేనని స్పష్టమైంది. దీనితో తప్పించుకునే మార్గం లేక ఆరవ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కేసును తప్పుదోవ పట్టించేందుకు వేరొకరిని బలిపశువును చేసే ప్రయత్నం చేయడం, సాక్ష్యాలను తారుమారు చేసే యత్నాలు చేసినందుకు గానూ సీదిరి అప్పలరాజుపై బీఎన్ఎస్ చట్టంలోని కీలక సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

ముందస్తు బెయిల్ కోసం అప్పలరాజు కోర్టును ఆశ్రయించినప్పటికీ ఆయనకు అనుకూల తీర్పు రాలేదు. దాంతో పాటు నిందితుడిని ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రజా సంఘాల నుంచి, ప్రతిపక్షాల నుంచి తీవ్రస్థాయిలో ప్రశ్నలు రావడంతో పోలీసులపై ఒత్తిడి పెరిగింది. చివరికి లీగల్ గా మార్గాలు మూసుకుపోవడంతో పోలీసులు నిన్న రాత్రి సీదిరి అప్పలరాజును అదుపులోకి తీసుకున్నారు.

అన్నింటికంటే దారుణమైన విషయమేమిటంటే.. దర్యాప్తును అడ్డుకుని, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిన అప్పలరాజు అరెస్ట్‌ను వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డితో సహా ఆ పార్టీ నేతలంతా రాజకీయ కక్షసాధింపు గా చిత్రీకరించేందుకు ప్రయత్నించడం. చట్టపరంగా తప్పు చేసిన వ్యక్తి కొద్ది రోజులు జైలు శిక్ష అనుభవించి బయటకు రావచ్చు. కానీ, ఒక్క రాత్రిలో ఇంటి పెద్దను కోల్పోయి, అనాథగా మారిన ఆ నిరుపేద కుటుంబానికి జరిగిన తీరని లోటును ఎవరు భర్తీ చేస్తారు? రాజకీయ నాయకుల్లో కనీస సానుభూతి అనేది మిగిలి ఉంటే.. బాధితుడి కుటుంబానికి మద్దతుగా నిలవాలి తప్ప, అక్రమాలకు పాల్పడిన నాయకుడికి రక్షణగా నిలబడతారా? అనే ప్రశ్నలు సామాన్యుల నుంచి వస్తున్నాయి.

బాధితుల కన్నీళ్లను పట్టించుకోకుండా, తప్పు చేసిన నాయకులకు రాజకీయ రక్షణ కల్పించడం ఏ రకమైన రాజకీయ సంస్కృతి.. అనే ఆవేదన ఎక్కువగా కనిపిస్తోంది. ప్రజలకు సేవ చేయాల్సిన స్థానంలో ఉండి, అధికారాన్ని స్వార్థానికి, ఆక్రమాలకు వాడుకున్న వారి తరఫున వకాల్తా పుచ్చుకునే నాయకులు అటు ప్రజాస్వామ్యానికి, ఇటు రాజకీయం చేయడానికి అసలు అర్హులేనా అన్నది అసలైన ప్రశ్న.

## నేరాలు చేసినవారికి జగన్ వత్తాసు

- యాక్సిడెంట్ కేసు తారుమారుకు సీదిరి పన్నాగం
- స్పీకర్‌గా పనిచేసిన తమ్మినేని భూ కబ్జాలు దుర్మార్గం
- వారికి జగన్ సంఘీభావం దేనికి సంకేతం
- జనం బుద్ధి చెప్పినా మారని వైసీపీ నేతల తీరు
- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



శ్రీకాకుళం (చైతన్యరథం): ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు, భూ కుంభ కోణాలు,దౌర్జన్యాలతో విసిగిపోయిన జనం గత ఎన్నికల్లో ఓటుతో గట్టిగా బుద్ధిచెప్పిన ప్పటికీ జగన్మోహన్‌రెడ్డి సహావైసీపీ నాయ కుల్లో కనీస మార్పు కనిపించకపోవడం బాధా కరమని శ్రీకాకుళంజిల్లా నరసన్న పేట ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి అన్నారు. శ్రీకాకుళంలో గురవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ నేరాలు చేసిన వాళ్లకు జగన్మోహన్ రెడ్డి వత్తాసు పలకడం దేనికి సంకేతమని నిలదీశారు. రోడ్డు ప్రమాదంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో ఉంటే మానవత్వంతో వ్యవ హరించాల్సిన సీదిరి అప్పలరాజు.. ఒక డాక్టరై ఉండి కూడా బాధితుడిని ఆసుపత్రి కి తరలించేందుకు బదులు,ప్రమాదానికి కారణమైన తన కుమారుడ్ని తప్పించడా నికి విశ్వప్రయత్నాలు చేశారని ధ్వజ మెత్తారు. ప్రమాదాన్ని ఎవరూ తప్పు పట్ట లేమని..కానీ ప్రమాద సమయంలో మాజీ మంత్రిగా ఆయన వ్యవహరించిన తీరు హర్షించదగినది కాదన్నారు. ప్రమాదంలో గాయపడ్డ దానయ్యను వెంటనేఆసుపత్రికి తీసుకెళ్లి సరైన వైద్యంఅందితే బతికి ఉండేవారని.. కానీ అలా సీదిరి అప్పలరాజు చేయక పోవడం బాధాకరమని తెలిపారు. సీదిరి చేసిందే పెద్ద ఘోరమైన తప్పు అని.. ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి కులంకార్డు వాడుకోవాలని చూడటం దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. ఏం మొఖం చూపిస్తూ మత్సకారుల దగ్గరకు సీదిరి అప్పలరాజు వెళ్తారోచెప్పాలని నిలదీశారు.

### తమ్మినేని భూ కబ్జాలకు పాల్పడటం దుర్మార్గం

స్పీకర్‌గాపనిచేసిన తమ్మినేని సీతారాం నలుగురికి ఆదర్శంగాఉండాల్సింది పోయి బతికి ఉన్న వాళ్లను చనిపోయినట్లుగా డెత్ సర్టిఫికేట్ సృష్టించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అధికారం అడ్డం పెట్టు కుని వారసులు కాని వాళ్లని వారసులుగా చూపిస్తూ, రూ.4కోట్లు విలువచేసే భూమి ని కబ్జాచేసి స్వాధీన పరచుకున్నారు.ఇప్పు డు చట్టాలు,పోలీసులకు దొరకకుండా కుటుంబం మొత్తం తిరుగుతున్నారు. స్పీకర్‌గా చేసిన వ్యక్తి, మైకు దొరికితే నీతులు వల్లించే వ్యక్తి ఇటువంటి తప్పులు చేయడం ఎంతవరకు సమంజసం? ఈ సమాజం ఏమైనా హర్షిస్తుందా? ప్రజలు గుణపాఠం చెప్పినప్పటికీ వైసీపీ అధినేత జగన్ రెడ్డి సహా ఆ పార్టీ నాయకుల బుద్ధి మాత్రం మారడం లేదని ఎమ్మెల్యే రమణమూర్తి అన్నారు.

# వైసీపీ నేతల భూకబ్జాలు, మోసాలు

అమరావతి (చైతన్యరథం): వివిధ సమస్యల పరిష్కారం కోసం గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమానికి తరలి వచ్చిన ప్రజల నుంచి ఏపీ కొప్పుల వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్ వినతులు స్వీకరించి, పరిష్కారానికి కృషి చేశారు.

తరతరాలుగా వారసత్వంగా వస్తున్న తన భూమిలో కొంత భాగంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు అక్రమంగా డంపింగ్ యార్డ్ నిర్మించారని, తనకు న్యాయం చేయాలని గుంటూరు జిల్లా తాడికొండ మండలం బేజత్‌పురం గ్రామానికి చెందిన పగడాల లక్ష్మీనారాయణ అర్జీ ఇచ్చారు. సర్వే నంబర్ 33-2లో తమ కుటుంబానికి 1 ఎకరం మెట్ట పొలం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనారోగ్యం కారణంగా దాదాపు 4 నెలలు హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో వైసీపీ నాయకులు తమ భూమిలో 15 సెంట్లు ఆక్రమించి డంపింగ్ యార్డ్ నిర్మించారు. ఆసుపత్రి నుంచి తిరిగొచ్చాక దీనిపై అప్పటి తహసీల్దార్‌కు విన్నవించగా, తనని తన భార్యను పిలిపించి అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరించిన వైసీపీ నాయకులు బలవంతంగా హామీపత్రం రాయించుకున్నారు. ఇటీవల గ్రామంలో అధికారులు రీ-సర్వే పూర్తి చేసి, ఊరిలోని రైతులందరికీ రీ-సర్వే రిపోర్టులు అందజేశారు. కానీ, తన పొలానికి సంబంధించి మాత్రం రిపోర్టు ఇవ్వకుండా నిలిపివేశారు. ఇప్పుడు రీ-సర్వే రికార్డులను కూడా మార్చే కుట్ర జరుగుతోంది. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్ధించారు.

రైల్వేలో ఉద్యోగం పేరిట నగదు వసూలు చేసి మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మార్కాపురం జిల్లా కంభం మండలం కందులపురం గ్రామానికి చెందిన సురేష్ విజ్ఞప్తి చేశారు. రావిపాడు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కలిసి తనకు చెన్నై జోన్‌లో రైల్వే టీసీ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారన్నారు. వారి మాటలు నమ్మి, తన ఖాతాతో పాటు తన చెల్లెలు, తల్లి బ్యాంక్ ఖాతాల నుంచి వివిధ తేదీలలో మొత్తం రూ.50,54,000/- సదరు వ్యక్తులకు బదిలీ చేశాను. డబ్బులు తీసుకున్న అనంతరం, 2015 ఏప్రిల్ 2న తనని చెన్నైకి తీసుకువెళ్లి, రైల్వే జోన్‌లో రెండు రోజులు ట్రైనింగ్ పేరుతో తిప్పించి మళ్లీ ఇంటికి తీసుకొచ్చారు. ఆ తర్వాత ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని గ్రహించి తన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీశాను. ఈ మోసంపై కంభం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడ ఉన్న ఒక లేడీ కానిస్టేబుల్ తనను బెదిరించి, మభ్యపెట్టి తాను ఇచ్చిన రిపోర్టును మార్చేసింది. నలుగురిపై ఫిర్యాదు చేస్తే, కేవలం భూతపాటి ప్రశాంత్‌పై మాత్రమే కేసు నమోదు చేసి, మిగతా ముగ్గురి పేర్లను తొలగించారు. కావున వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

తన పొలానికి 22 ఏ జాబితా నుంచి విముక్తి కలిగించాలని కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన చాగంటి పోతురెడ్డి విజ్ఞప్తి చేశారు. పెద ఓగిరాల గ్రామంలోని సర్వే నం. 274లో తన కుటుంబానికి చెందిన 2.60 ఎకరాల పొలాన్ని మద్రాసు హైకోర్టు (1943) తీర్పు ద్వారా కొనుగోలు చేశామన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షసాధింపులో భాగంగా దాన్ని జమీందారీ పొలమని, దేవస్థానానికి చెందిన భూమిగా చూపుతూ ట్రిబ్యునల్‌లో కేసులు వేయించి 22(ఏ) (1) (సీ)నిషేధిత జాబితాలో చేర్చారు. ప్రభుత్వం ఇటీవల కల్పించిన వ్యవసాయ భూముల సరళీకరణ విధానంలో భాగంగా తన భూమిని 22(ఏ) జాబితా నుండి తొలగించి, సర్వహక్కులతో తిరిగి అప్పగించాలని కోరారు.



- రైల్వే ఉద్యోగం పేరిట రూ.50.54 లక్షలకు టోపీ
- గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ కక్ష సాధింపు.. కోర్టు తీర్పుతో కొనుగోలు చేసిన భూమి 22(ఏ)జాబితాలోకి
- రికార్డులు తారుమారు చేసి.. హైవే విస్తరణ నష్టపరిహారం మింగేశారు
- న్యాయం చేయాలంటూ బాధితుల విన్నపాలు
- అర్జీలు స్వీకరించిన ఏపీ కొప్పుల వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్

రోడ్డు విస్తరణలో పోయిన తన భూమికి సంబంధించిన నష్ట పరిహారాన్ని తనకు రాకుండా చేసి కాజేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ కడప జిల్లా చక్రాయపేటకు చెందిన ముల్లా బషీరున్ విజ్ఞప్తి చేశారు. సర్వే నంబర్ 814/1, సర్వే నంబర్ 830 లలో మొత్తం తనకు 3.14 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో నేషనల్ హైవే రోడ్డు విస్తరణ నిమిత్తం సర్వే నం. 814/1దీ లో 0.89 సెంట్లు, సర్వే నం. 830/2 లో 0.69 సెంట్లు కలపి మొత్తం 1.58 ఎకరాల భూమి రోడ్డు పరిధిలోకి వెళ్లింది. రోడ్డు విస్తరణ అనంతరం చక్రాయపేట తహశీల్దార్ కార్యాలయ అధికారులు, మండల గ్రామ సర్వేయర్లు, విఆర్ఓలు కుమ్మక్కై ఆన్‌లైన్ రికార్డులలో సర్వే నంబర్ 81-2 కింద 3.14 ఎకరాలుగా తప్పుగా మార్చారు. రోడ్డుకు పోయిన భూమిలో 27 మామిడి చెట్లు, 4 వేప చెట్లు, బావి, బోరు, కరెంటు సర్వీసు మీటరు కూడా పోయాయి. మొదట్లో వీటికి సంబంధించి నష్టపరిహారం చెక్కు వస్తుందని నోటీసు ఇచ్చిన అధికారులు, తరువాత తమకు తెలియకుండా ఆ పరిహారం సొమ్మును వారే తీసుకుని తమకు దక్కకుండా చేశారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తనకు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, తనకు న్యాయం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం, పుల్లేరు గ్రామానికి చెందిన పి.జయమ్మ విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో తన తండ్రి పేరిట సర్వే నంబర్ 62-4 లో వ్యవసాయ భూమి ఉందన్నారు. తండ్రి మరణించిన అనంతరం ఆ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారు. ఈ భూమికి సంబంధించి విద్యుత్ కనెక్షన్ బిల్లులు, ఇతర అన్ని రకాల ఆధారాలు తమ వద్దే ఉన్నాయి. పొలానికి సంబంధించి పాస్‌బుక్ మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, కొందరు వ్యక్తులు అడ్డుపడుతూ పాస్‌బుక్ రాకుండా అడ్డుకుంటున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ భూమిని కొందరు వ్యక్తులు మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ న్యాయం చేయాలని కృష్ణాజిల్లా ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామానికి చెందిన వాకా లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలోని తమ కుటుంబ ఉమ్మడి భూములైన సర్వే నంబర్ (258/3..0.50 ఎకరాలు), (254/1, 2, 3, 4...1.70 ఎకరాలు), (257/2సి, 258/2...1.04 ఎకరాలు) మొత్తం దాదాపు 3.24 ఎకరాల భూమిని తమను, తమ కుమారుడు హనుమంతరావును నమ్మించి, 2016లో పైసా డబ్బులు ఇవ్వకుండా ఇద్దరు దంపతులు మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ మోసంపై చిన్న కుమారుడు వాకా ప్రేమ్ కుమార్ అవనిగడ్డ సబ్ కోర్టులో దావా వేశారు. ప్రస్తుతం ఈ భూమి వివాదం కోర్టు పరిధిలో ఉంది. భూమి తమ కుమారుడు ప్రేమ్ కుమార్ స్వాధీనంలోనే ఉంది. గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే సమయంలో కోర్టు కేసు పెండింగ్‌లో ఉన్నందున, ఆ భూమికి సంబంధించి అడంగల్స్‌లో ఎవరి పేరు పెట్టకుండా 'బ్లాక్' లో పెట్టాలని తహసీల్దార్‌ను కోరాను. అయితే ఆ దంపతులు అక్రమ పద్ధతుల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు పొందడానికి ప్రయత్నిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ స్థలంలో దౌర్జన్యంగా చొరబడి కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా నల్లపాడు గ్రామానికి చెందిన శాంతపాటి విశ్రాంతి విజ్ఞప్తి చేశారు. నల్లపాడులోని రత్నగిరి కాలనీలో తనకు చిన్న పూరి గుడిసె ఉందన్నారు. ఆ గుడిసె కూలిపోవడంతో, అక్కడ మట్టి తోలించి రేకుల షెడ్డు వేసుకోవడానికి తన కుమారుడు ప్రయత్నించాడు. ఆ సమయంలో స్థానిక వ్యక్తులు కొందరు వచ్చి, స్థలంలోకి చొరబడి దౌర్జన్యానికి దిగారు. తనని, తన కుమారుడిని కొట్టడానికి వచ్చి "ఎస్సీ" అంటూ కులం పేరుతో తీవ్రంగా దూషించారు. ప్రాణభయంతో అక్కడి నుండి పారిపోయాను. ఈ ఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

తన భూమికి సంబంధించిన అడంగల్, 1 బీ రికార్డులు తనపేరు మీద మార్పించాలని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం తరుణ వాయి గ్రామానికి చెందిన మర్రి శీనయ్య విజ్ఞప్తి చేశారు. తనకు వారసత్వం ద్వారా తన తల్లి మర్రి వజ్రమ్మ ద్వారా సంక్రమించిన భూముల రికార్డులు తన పేరు మీద మార్చాలంటూ ఐదేళ్లు తిరిగితే సర్వే నంబర్ 238లోని 18 సెంట్ల భూమిని మాత్రమే రికార్డుల్లో నమోదు చేశారన్నారు. సర్వే నంబర్ 239 లోని 57 సెంట్లు, 363-2లో ఉన్న 40సెంట్ల భూమి ని మాత్రం రికార్డుల్లోకి ఎక్కించలేదన్నారు.ఈ భూము లు తన ఎన్నోఏళ్లుగా తన సాగులోనే ఉన్నాయన్నారు. భూములు తక్షణమే పరిశీలించి, తన పేరు మీద అడంగల్, 1బీ రికార్డులలో మార్చాలని కోరారు.

మరణించిన తన తండ్రి సంతకం ఫోర్జరీ చేసి తమ పొలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మార్కాపురం జిల్లా కొమరోలు మండలం తాటిచర్లపాడు గ్రామానికి చెందిన ఏకం తిరిపాలు రెడ్డి విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో సర్వే నంబర్ 477/2, 477/4 ఇతర నంబర్లలో 16.70 ఎకరాల భూమి ఉందన్నారు. అయితే, తన తండ్రి సుబ్బారెడ్డి గతంలోనే మరణించినప్పటికీ ఆయన జీవించి ఉన్నట్లుగా నకిలీ పత్రాలు సృష్టించి ఫోర్జరీ సంతకాలు పెట్టించిన కొందరు వ్యక్తులు అక్రమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు చేసినప్పటికీ, సంబంధిత అధికారులు సరైన విచారణ జరపకుండా అన్యాయం చేస్తున్నారు. పోలీసులు కూడా అక్రమార్కులకు కొమ్ము కాస్తూ కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని, రెవెన్యూ అధికారులు కూడా సరిగా స్పందించడం లేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తన స్థలాన్ని కబ్జా చెర నుంచి విడిపించి తనకు న్యాయం చేయాలని బాపట్ల జిల్లా పల్లెకోన గ్రామానికి చెందిన నాంచారమ్మ విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో తనకు 7 సెంట్ల స్థలం ఉందన్నార. తనకు తెలియ కుండా తాను లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని తన బంధువులు ఇద్దరు కలిసి ఆ 7 సెంట్ల స్థలాన్ని అక్రమంగా కబ్జా చేశారు. ఈవిషయంపై ఇప్పటికే రెవెన్యూ , పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తనకు తగిన న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.



2 ఏళ్ల నమ్మకం
అభివృద్ధి, సంక్షేమం

రాష్ట్ర అభివృద్ధికి బలమైన ప్రజా రవాణా వ్యవస్థ అత్యంత కీలకం. ప్రజల సమయం ఆదా కావాలి, ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందాలి. మహిళలు, దివ్యాంగులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు సురక్షితంగా ప్రయాణించాలి, ఉద్యోగుల సంక్షేమం కాపాడాలి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలి అనే లక్ష్యాలతో గత రెండేళ్లలో రాష్ట్ర ప్రజా రవాణా రంగంలో విస్తృత సంస్కరణలు అమలయ్యాయి. "రెండేళ్ల నమ్మకం" పేరిట ప్రజా రవాణా వ్యవస్థలో చేపట్టిన మార్పులు సేవల నాణ్యతను మాత్రమే కాకుండా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని మరింత పెంచాయి.

# ప్రజా రవాణా రంగంలో డిజిటల్ విప్లవం



### డిజిటల్ రవాణా సేవలకు శ్రీకారం

గతంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహన నమోదు, పర్మిట్లు, పన్నుల చెల్లింపుల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. రవాణా శాఖ సేవలను పూర్తిగా డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన నమోదు, పర్మిట్లు, ఫీజు చెల్లింపులు, దరఖాస్తుల ట్రాకింగ్ వంటి సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తోంది. దీంతో సమయం ఆదా కావడంతో పాటు అవినీతి అవకాశాలు కూడా గణనీయంగా తగ్గాయి.

### ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్-పారదర్శక లైసెన్స్ వ్యవస్థ

రాష్ట్రవ్యాప్తంగా 85 ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా డ్రైవింగ్ పరీక్షలను పూర్తిగా సాంకేతిక ప్రమాణాల ఆధారంగా నిర్వహిస్తున్నారు. మానవ జోక్యాన్ని తగ్గించి అర్హత ఉన్నవారికే లైసెన్స్ జారీ చేసే విధానాన్ని అమలు చేయడం వల్ల రోడ్డు భద్రత మరింత బలోపేతమైంది. మిగిలిన టెస్టింగ్ సెంటర్లను కూడా త్వరలో ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన ప్రమాణాలతో సేవలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

### 'సారథి' యాప్‌తో ప్రజల చేతిలో రవాణా శాఖ

సాంకేతికతను ప్రజలకు మరింత చేరువ చేస్తూ 'సారథి' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ యాప్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ సేవలు, వాహన నమోదు, పర్మిట్లు, పన్నుల చెల్లింపులు, దరఖాస్తుల స్థితి, ఇతర రవాణా సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి రావడంతో ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గింది.

### రవాణా శాఖ ఆదాయంలో రికార్డు వృద్ధి

పారదర్శక పరిపాలన, డిజిటల్ సేవల విస్తరణ, సమర్థవంతమైన పన్నుల వసూళ్ల కారణంగా రవాణా శాఖ ఆదాయంలో గణనీయమైన పెరుగుదల నమోదైంది. 2024-25లో రూ.4,004 కోట్లుగా ఉన్న ఆదాయం, 2025-26 నాటికి రూ.5,050 కోట్లకు పెరగడం పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 8.85 లక్షలకు పైగా కొత్త వాహనాల నమోదు జరగడం ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది.

### 24×7 కమాండ్ కంట్రోల్ సెంటర్

అత్యాధునిక కమాండ్-కంట్రోల్ సెంటర్ ద్వారా బస్సుల కదలికలు, వేగం, మార్గాలు, ఫిర్యాదులు, రోడ్డు భద్రత... అన్నింటినీ రియల్ టైమ్‌లో పర్యవేక్షించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. దీంతో సేవల నాణ్యతతో పాటు ప్రయాణికుల భద్రత మరింత మెరుగుపడింది.

### దివ్యాంగ శక్తి-సమాన అవకాశాల దిశగా...

21 రకాల దివ్యాంగులకు ప్రత్యేక బస్సు పాస్‌లు, సులభ ప్రయాణ సౌకర్యాలు కల్పించడం ద్వారా సమ్మిళిత ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. స్వేచ్ఛాయుత ప్రయాణం, సామాజిక భాగస్వామ్యం, స్వావలంబనకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది.

### ప్రయాణికుల సంతృప్తిలో భారీ పెరుగుదల

ఏపీఎస్‌ఆర్టీసీ సేవల నాణ్యత, సమయపాలన, భద్రత, సిబ్బంది సేవా దృక్పథం కారణంగా ప్రయాణికుల సంతృప్తి 90 శాతం నుంచి 96 శాతానికి పెరిగింది. ఇది ప్రజా రవాణాపై ప్రజల్లో ఏర్పడిన విశ్వాసానికి నిదర్శనం.

### ఆటో డ్రైవర్లకు నైపుణ్యం-భద్రత- గౌరవం

ఆటో డ్రైవర్లను రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములుగా గుర్తిస్తూ వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. చిత్తూరు, తిరుపతి, అనంతపురం, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల ద్వారా 2.34 లక్షలకు పైగా ఆటో డ్రైవర్లు, యజమానులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు,



ప్రయాణికుల సేవలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వంటి అంశాల్లో శిక్షణ పొందారు. దీంతో సురక్షితమైన, నాణ్యమైన ప్రజా రవాణా సేవలు అందేలా వ్యవస్థ మరింత బలోపేతమైంది.

### 'స్త్రీశక్తి'తో మహిళలకు ఉచిత ప్రయాణం

మహిళల ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తూ "స్త్రీశక్తి" పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. APSRTC ఫ్లీట్‌లో సుమారు 74శాతం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుతోంది. ప్రస్తుతం మహిళల బస్సు ప్రయాణ వాటా 60శాతానికి పైగా పెరగడం ఈ పథకం విజయాన్ని చాటుతోంది. ప్రభుత్వం ప్రతిరోజూ సుమారు రూ.8.50 కోట్లు వెచ్చిస్తూ మహిళల కుటుంబాలపై ప్రయాణ వ్యయ భారం తగ్గిస్తోంది.

### రోడ్డు భద్రతలో విశేష పురోగతి

డ్రైవర్ల శిక్షణ, స్పీడ్ లిమిటర్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆటోమేటెడ్ టెస్టింగ్ వ్యవస్థల కారణంగా ఏపీఎస్‌ఆర్టీసీ ప్రమాదాల నిష్పత్తి తగ్గింది. 10 లక్షల కిలోమీటర్లకు ప్రమాదాల రేటు 0.07 నుంచి 0.06కు తగ్గడం భద్రతా చర్యల ఫలితంగా నిలిచింది. ప్రైవేట్ బస్సుల పర్యవేక్షణను కూడా సాంకేతికంగా అనుసంధానిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేస్తున్నారు.

### కొత్త బస్సులతో సేవల విస్తరణ

ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభవం అందించేందుకు 2024-25లో 1,189 కొత్త బస్సులను ఏపీఎస్‌ఆర్టీసీలో చేర్చారు. ఏసీ, నాన్-ఏసీ, స్టార్ లైనర్, స్లీపర్ కోచ్‌లు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నాయి.

### గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్‌కు పెద్దపీట

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా... వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు, GCC విధానంలో 5,120 ఎలక్ట్రిక్ బస్సుల దశలవారీ ప్రవేశం, CNG బస్సుల కొనుగోలు... వంటి చర్యలతో భవిష్యత్ ప్రజా రవాణాను పర్యావరణహితంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నారు.

### సాంకేతిక సేవల్లో ఏపీఎస్‌ఆర్టీసీ ముందంజ

మొబైల్ యాప్, వాట్సాప్ టికెటింగ్, యూపీఐ చెల్లింపులు, డిజిటల్ బస్సు పాస్‌లు, వాహన ట్రాకింగ్, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్, రద్దు వంటి సేవలను ఒకే వేదికపై అందిస్తూ ఆర్టీసీ దేశంలోనే ఆధునిక ప్రజా రవాణా సంస్థగా నిలుస్తోంది.

### ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

పెండింగ్ ఉద్యోగ విరమణ ప్రయోజనాల చెల్లింపులు, కారుణ్య నియామకాలు, ఉద్యోగుల కుటుంబాలకు EDLI ప్రయోజనాలు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు సంబంధించిన విధాన సంస్కరణలు అమలు చేయడం ద్వారా ఉద్యోగుల సేవా భద్రతను బలోపేతం చేశారు. కొత్త సాంకేతికతకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి.

### జాతీయ స్థాయిలో గుర్తింపు

సురక్షిత రవాణా, సాంకేతిక వినియోగం, సమర్థవంతమైన నిర్వహణ, ప్రయాణికుల సేవల్లో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు ఏపీఎస్‌ఆర్టీసీ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

### భవిష్యత్ లక్ష్యాలు-మరింత ఆధునిక ప్రజా రవాణా

2026-27 కోసం రూపొందించిన కార్యాచరణలో
- 100% డిజిటల్ సేవలు
- అన్ని ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ప్రారంభం
- 5,120 ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం
- CNG బస్సుల విస్తరణ
- గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని సేవలు
- 100% డిజిటల్ టికెటింగ్
- ప్రయాణికుల సంతృప్తిని 98%కు పెంచడం
- రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడం... వంటి లక్ష్యాలను నిర్దేశించారు.

గత రెండేళ్లలో ప్రజా రవాణా రంగంలో అమలైన సంస్కరణలు కేవలం పరిపాలనా మార్పులు మాత్రమే కాదు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా తీసుకున్న కీలక అడుగులు.

డిజిటల్ సేవలు, పారదర్శక వ్యవస్థలు, మహిళలకు ఉచిత ప్రయాణం, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, ఆటో డ్రైవర్ల నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, రోడ్డు భద్రత, ఆధునిక బస్సులు, గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వంటి అనేక చర్యలు ప్రజా రవాణాను కొత్త స్థాయికి తీసుకెళ్లాయి.

"రెండేళ్ల నమ్మకం"తో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, పారదర్శకమైన, సాంకేతికత ఆధారిత, పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించే దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోంది.

**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు



# ఉత్తరాంధ్ర సాగునీటి స్వప్నం సాకారం

- రూ.641 కోట్లతో నెరడి బ్యారేజీ పూర్తికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి
- దశాబ్దాల వంశధార చిక్కుముడులు విప్పి చారిత్రాత్మక గెజిట్ సాధన
- ఏడాదిలోగా 106 ఎకరాల భూమిని సేకరించి ఇవ్వనున్న ఒడిశా ప్రభుత్వం



శ్రీకాకుళం (చైతన్యరథం): ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాను దశాబ్దాలుగా వేధిస్తున్న వంశధార నీటి వివాదానికి స్వస్తి పలుకుతూ నెరడి బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 641 కోట్లు మంజూరు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర గెజిట్ సాధించడంలోనూ, సరదాగా నిధులు మంజూరు చేయించడంలోనూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసాధారణ చొరవ ప్రదర్శించారు. జిల్లా సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టు సాధనకై ఆయన తొలినుంచి నిరంతర పట్టుదలతో కృషి చేశారు. నాటి సుప్రీంకోర్టు ఉత్తర్వులు, ట్రిబ్యునల్ వివాదాల నుంచి ప్రాజెక్టును గట్టెక్కించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించిన అచ్చెన్నాయుడు, లీగల్ పోరాటంలో రాష్ట్ర వాదనలు ట్రిబ్యునల్‌లో బలంగా వినిపించేలా చేసి చారిత్రాత్మక తీర్పు రావడంలో ప్రధాన భూమిక పోషించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార దశ-II పూర్తిపై ప్రత్యేక దృష్టోత్సాహంతో వ్యవహరించిన మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి సూచనలు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెచ్చారు. ఈ సుదీర్ఘ ప్రయత్నాల ఫలితంగానే కేంద్ర జలశక్తి శాఖ ట్రిబ్యునల్ తీర్పును అధికారికంగా గెజిట్‌లో ప్రచురిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనివల్ల ఒడిశా భూభాగంలోని 106 ఎకరాల సేకరణకు మార్గం సుగమం కావడమే కాకుండా, బ్యారేజీ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి హక్కులు లభించాయి. ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యంతో పెండింగ్‌లో పడిన ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించి గెజిట్ సాధించడం అచ్చెన్నాయుడు రాజకీయ రాజనీతికి, ప్రాంతీయ అభివృద్ధి పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది.

కేంద్ర గెజిట్ విడుదలైన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా కేబినెట్ భేటీలో రూ. 641 కోట్లను మంజూరు చేయించడం ద్వారా అచ్చెన్నాయుడు తన కార్యాచరణ వేగాన్ని నిరూపించుకున్నారు. రాబోయే రెండేళ్ల వ్యవధిలోనే నెరడి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి వెనుకబడిన, కరువు పీడిత ప్రాంతాల రైతులకు నీళ్లందిస్తామని ప్రకటించి జిల్లా ప్రజల దశాబ్దాల కలను సాకారం చేశారు. చట్టపరమైన చిక్కులను అధిగమించి, నిధులు రాబట్టి, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేలా అచ్చెన్నాయుడు తీసుకుంటున్న చర్యలపై జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# ఉత్తరాంధ్ర ప్రజలకు రెండు రోజులు ముందుగానే పెన్షన్ల పంపిణీ

విజయనగరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాల పెన్షన్ లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. సాధారణంగా జరిగే తేదీ కంటే రెండు రోజుల ముందుగానే పెన్షన్ల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. భోగాపురం అల్లూర అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉత్తరాంధ్ర జిల్లాల్లో జూలై 30వ తేదీనే పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ ఆరు జిల్లాల్లో మొత్తం 11.98 లక్షల మంది లబ్ధిదారులకు రూ.514.42 కోట్ల మేర ముందస్తు పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జూలై 30వ తేదీనే పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆరు జిల్లాల్లో మొత్తం 11.98 లక్షల మంది లబ్ధిదారులకు రూ.514.42 కోట్ల మేర పెన్షన్ నగదు అందించనున్నారు. ఈ నేపథ్యంలోనే పెన్షన్ పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జూలై 29వ తేదిలోగా అవసరమైన నగదు ఉపసంహరణ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# మహిళా రక్షణ గురించి వైసీపీ మాట్లాడటం హాస్యాస్పదం : ఎమ్మెల్యే అదితి



విజయనగరం (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిలో మహిళా రైతులను అవమానించారని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆరోపించారు. విజయనగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసీపీకి చెందిన మహిళలు రక్షణ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో మహిళా సంక్షేమ రక్షణ చట్టాలు అమలు చేయలేదని అన్నారు. నేర ప్రవృత్తి, గంజాయి అమ్మకాలు పెరగడంతో మహిళలు రోడ్డుపై నడవటానికే భయపడ్డారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో మహిళా సంక్షేమానికి సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

# కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

అనకాపల్లి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు టీడీపీ శ్రేణులు సన్నద్ధం కావాలని రాష్ట్ర గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర అన్నారు. అనకాపల్లిలోని 81వ డివిజన్లో ఈనెల 27వ తేదీ నుంచి చేపట్టనున్న 'ఇంటింటి ప్రచారం' పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చి.. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు.



# రైవాడ ఆయకట్టుకు నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే బండారు



అనకాపల్లి (చైతన్యరథం): ఖరీఫ్ వరి సాగుకు సంబంధించి రైవాడ ఆయకట్టుకు జలాశయం నుంచి 250 క్యూసెక్కుల నీటిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం విడుదల చేశారు. కుడి కాల్వ ద్వారా 100, ఎడమ కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల దిగువకు వదిలారు. జలాశయంలో నీటి నిల్వ తక్కువ ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులను కోరారు. నీటి విడుదలకు ముందు గంగాదేవికి జలహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కెలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయం డీఈఈ సత్యం నాయుడు, సాగునీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులపై దృష్టిసారించాలి

- కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేసిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విజయనగరం (చైతన్యరథం): పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిమిత్తం న్యూఢిల్లీలో ఉన్న విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు గురువారం కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులు మందకొడిగా సాగుతున్న అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లి, ఫ్లైఓవర్ పనులు ఆలస్యం కావడం వల్ల స్థానిక ప్రజలు, వ్యాపారవేత్తలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటూ ప్రాణనష్టం సంభవించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఎంపీ వినతిపై కేంద్ర మంత్రి స్పందించి విజయవాడ రీజినల్ ఆఫీసర్‌తో మాట్లాడి, ట్రాన్స్పోర్ట్ భవన్ అధికారులకు సూచనలు ఇచ్చి ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కూడా ఎన్‌హెచ్ఏఐ ఆర్‌వో ఆర్కే సింగ్‌తో మాట్లాడి పరిస్థితులను వివరించి ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# కూటమి ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి : కిడారి శ్రావణ్‌కుమార్




అరకు (చైతన్యరథం): గాజువాక శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన డోర్ టూ డోర్ అవగాహన సదస్సులో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మరియు గాజువాక నియోజకవర్గం పరిశీలకులు కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు సమన్వయంతో డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఇంటి సందర్శన వివరాలను మైటీడీపీ (వీఎణ్) యాప్లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని, పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గాజువాక శాసనసభ్యులు, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు, మండల మరియు వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు చేతుల మీదుగా 22వ వార్డులో విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ శివప్రసాద్ మిగిలిన జీవీఎంసీ అధికారులు సిబ్బందితో కలిసి బలరాం నగర్ ఏరియాలో 40 లక్షల జీవీఎంసీ నిధులతో నూతనంగా నిర్మింపబడే కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వార్డు నాయకులు మహిళా నాయకులు డ్వాక్రా మహిళల నడుమ ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బలరాం నగర్ యువజన సేవా సంఘం సభ్యులు మరియు గ్రామ పెద్దలు.. వార్డు అధ్యక్షులు కోడిబోయిన ఆనంద, ప్రధాన కార్యదర్శి మల్లా రవికుమార్, యువత అధ్యక్షుడు పండు, ఓమ్మి అప్పారావు, దువ్వి స్వామి, డొక్కర శ్రీనివాస్‌రావు, దువ్వి రాజకుమార్, సత్యం, డేవిడ్, బర్ల రాజు, దేవర రఘు, సంతోష్, నాగూర్, వల్లి, బండారు దేవుడు, పెసల శ్రీను, మహిళా అధ్యక్షురాలు గున్న లక్ష్మి, అఖిల, సత్యవతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలో నలుగురికీ తల్లికి వందనం

**●ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎంకు పాలాభిషేకం**



కాకినాడ (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి మంజూరు చేసిన తల్లికి వందనం ఫలాలు ఒకే కుటుంబంలోని నలుగురు ఆడపిల్లలకు ఒకేసారి వారి అకౌంట్లలో జమ కావడంతో ఆ కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సహకరించిన నారా లోకేష్ యువజన ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మాజీ ఎమ్మెల్సీ టీడీ. జనార్దన్, జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్, ఆర్డీవో మురళీకృష్ణలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అలాగే పూర్తి సహకారం అందించిన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, జిల్లా అధ్యక్షులు బత్తుల సూర్యప్రసాద్, అడపా జగదీష్ లకు కృతజ్ఞతాభినందనలు వ్యక్తం చేశారు. కరప గ్రామానికి చెందినకురుపూడి శ్రీనివాస్ గతంలో స్వంతకారు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కాలక్రమంలో అద్దె కార్లకు ఆదరణ లేకపోవడంతో కారు అమ్మివేసి చిరుద్యోగిగా కుటుంబం గడుపుతున్నారు. ఈయనకు ఒకే కానుపులో నలుగురు ఆడపిల్లలు కలగడంతో వారి చదువులు అతికష్టం మీద చెప్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకానికి దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. ఈక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బును ఆశ్రయించగా, సుబ్బు కృషితో తల్లికి వందనం పథకానికి ఆటంకంగా ఉన్న సాంకేతిక ఇబ్బందులు తొలగించుకుని జిల్లా కలెక్టర్ సహాయంతో అర్హత సాధించగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం పథకం వర్తించి వారి ఖాతాలలో ఒక్కొకరికి రూ.13000/-లు చొప్పున నలుగురికీ రూ.52వేల రూపాయలు ఒకేసారి జమ అయ్యాయని తెలిపారు.

## తల్లికి వందనంతో ప్రతి ఇంటా పండుగ

**●మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు**

**●రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటా చదువుల పంటగా మారిందని, తల్లికి వందనం అందుకున్న కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక అలీనగర్, సాయినగర్, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస కాలనీ ప్రాంతాల్లో రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల ఆలోచన మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని డివిజన్లలో అభివృద్ధితోపాటు శానిటేషన్ పైనా దృష్టి సారించామని చెప్పారు. క్షేత్రస్థాయిలో కూటమి నాయకులతో కలిసి పర్యటిస్తున్నామని, ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యార్థులు ఉన్న ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందన్నారు. తల్లికి వందనం నిధులు జమ కావడంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు బెంగ లేకుండాపోయిందని తెలిపారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నారని చెప్పారు. నేడు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నారని, దీని ద్వారా విద్యార్థుల సామర్థ్యాలు మదింపు సాధ్యమవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా పునాదులు వేస్తున్నారన్నారు.

## దేశభక్తి, స్వరాజ్య స్ఫూర్తికి చిరస్మరణీయ ప్రతీకలు తిలక్

**● నివాళులర్పించిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**

విజయవాడ (చైతన్యరథం): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, భారత జాతీయోద్యమానికి మార్గదర్శకులైన లోకమాన్య బాలగంగాధర్ తిలక్ మరియు అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా గురువారం నాడు గొల్లపూడిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్థానిక నాయకులతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. "స్వరాజ్యం నా జన్మహక్కు.. దాన్ని సాధించుకుని తీరుతాను" అనే నినాదంతో దేశవ్యాప్తంగా స్వేచ్ఛా స్ఫూర్తిని రగిలించి, స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దిన మహోన్నత నాయకుడు తిలక్ అని కొనియాడారు.

## హజ్ 2027 యాత్ర ఆన్లైన్‌కు నేడే చివరి రోజు

**●ఆప్షన్ ద్వారా షార్ట్ హజ్ ను సద్వినియోగం చేసుకోవాలి**

**●హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ జనాబ్ హసన్ బాషా వెల్లడి**



అమరావతి (చైతన్యరథం): పవిత్ర మక్కా హజ్ యాత్ర 2027 ఆన్లైన్ నమోదుకు జులై 24 ఆఖరి రోజు అని కుదిరించబడిన రోజులతో "షార్ట్" హజ్ యాత్ర సౌకర్యాన్ని కేంద్ర హజ్ కమిటీ కల్పించినట్లు హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ జనాబ్ హసన్ భాష వెల్లడించారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి సమయం లేదని తొందరగా నమోదు చేసుకోవాలని మరియు తక్కువ రోజుల వ్యవధితో హజ్ యాత్ర పూర్తి చేయాలనుకునే వారు ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా అవకాశాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2027లో దాదాపు 20 రోజులకు కుదించబడిన ప్రణాళికతో షార్ట్ హజ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నదన్నారు. ఈ ప్యాకేజీలో మదీనాలో 2 లేదా 3 రోజుల బస కూడా చేర్చబడిందన్నారు. ప్రస్తుతం 35-45 రోజుల వ్యవధితో హజ్యాత్రకు, 20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ యాత్ర ప్యాకేజీ ధరల్లో ఎలాంటి వ్యత్యాసముండదని మంత్రి ఫరూక్ స్పష్టత ఇచ్చారు.2027 - హజ్ యాత్రలో దేశ వ్యాప్తంగా హజ్ కు వెళ్లే వారిలో గరిష్టంగా 10000 మందికి ఈ సౌకర్యం కల్పించేందుకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుందన్నారు. 20 రోజుల వ్యవధితో షార్ట్ హజ్ కోరుకునే వారు తమ హజ్ దరఖాస్తును ఆన్ లైన్‌లో సమర్పించేటప్పుడు, అందులో ఇచ్చిన షార్ట్ హజ్ ప్యాకేజీ ఆప్షన్ ను ఎంచుకోవాల్సి ఉంటుందని తెలిపారు.ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా షార్ట్ హజ్ ను పొందుపరిచిన అనంతరం, ఆన్ లైన్ లో దరఖాస్తు సమర్పించిన అనంతరం ప్యాకేజీ మార్చుకోవడానికి అవకాశం ఉండదని తెలిపారు.షార్ట్ హజ్‌కు దరఖాస్తు చేసుకున్న యాత్రికులను లాటరీ విధానంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. హజ్ కు ఎంపికై షార్ట్ హజ్‌కు ఎంపిక కాని వారికి ఆటోమేటిక్ గా సాధారణ హజ్ పాకేజ్ (35-45 రోజులు) వర్తిస్తుందని తెలిపారు.ఒక కవర్ లోని యాత్రికులందరూ ఈ షార్ట్ హజ్ ఆప్షన్ ఎన్నుకోవలసి ఉంటుందన్నారు. ఒకే కవర్‌లో రెండు ప్యాకేజీలు అనుమతించబడవని పేర్కొన్నారు.కాగా షార్ట్ హజ్ యాత్ర ఢిల్లీ,ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చిన్,కోల్ కతా, అహ్మదాబాద్ నుండి మాత్రమే నిర్వహించ బడుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రయాణికులందరికీ కూటమి ప్రభుత్వం అందించే రూ. లక్ష ఆర్థిక సహాయం పథకాన్ని సద్వినియోగం హసన్ భాష విజ్ఞప్తి చేశారు.

## చంద్రన్న బీమా... కార్యకర్తల కుటుంబాలకు గొప్ప ధీమా

**●రమేష్, రామారావు, శ్రీకాంత్ కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది**

**●15లక్షల రూపాయల విలువైన ప్రమాద బీమా అందజేసిన ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): తెలుగుదేశం సైనికుల సంక్షేమం..సంతోషానికి టీడీపీ అధినాయకత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, ప్రమాదవశాత్తూ మరణించిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం.. కార్యకర్తల పిల్లల యోగక్షేమాలు, చదువుసంధ్యలు చూడటంలో పార్టీ ఎప్పుడూ ముందుంటుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. కార్యకర్తల సంక్షేమం కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన చంద్రన్నబీమా నిజంగా లక్షలాది టీడీపీ కుటుంబాలకు గొప్ప ధీమాగా నిలుస్తోందని ప్రత్తిపాటి తెలిపారు.

**రమేష్, రామారావు, శ్రీకాంత్ కుటుంబాలకు అండగా ఉంటాం...**

ఇటీవలి కాలంలో మూడు వేర్వేరు దుర్ఘటనల్లో ప్రమాదవశాత్తూ మరణించిన ముగ్గురు టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రమాద బీమా పరిహార చెక్కులు అందించారు. చిలకలూరిపేట రూరల్ మండలం కోమటినేనివారిపాలెం గ్రామానికి చెందిన వెంపరాల రమేష్, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామ నాయకులు నెల్లూరి రామారావు, జంగాలపల్లి గ్రామానికి చెందిన మద్ది శ్రీకాంత్ ఇటీవల మరణించిన నేపథ్యంలో, ప్రత్తిపాటి గురువారం వారి కుటుంబసభ్యులతో మాట్లాడి, ఒక్కో కుటుంబానికి పార్టీ అందించిన రూ.5లక్షల విలువైన చెక్కులు అందించి, వారి కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. పార్టీపై పటిష్టత, గౌరవం కోసం పాటుపడిన రమేష్, రామారావు శ్రీకాంత్ ఆత్మకుశాంతి కలగాలని వారి కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని ప్రత్తిపాటి చెప్పారు.

**యువనేత లోకేశ్ సారథ్యంలో పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుంది**

ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ... దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనంత కార్యకర్తల బలం టీడీపీకి ఉందని, వారే పార్టీ సైన్యమని. ప్రజలకు మంచి చేయడంలో వారు నిస్వార్థంగా తమసేవలు అందిస్తారని తెలిపారు. అటువంటి కార్యకర్తల్ని ఆదుకోవాలన్న ధృఢచిత్తంతో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రమాదబీమా సౌకర్యం కల్పించారన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక పార్టీకి యువరక్తం ఎక్కించి నూతనోత్తేజం తీసుకొచ్చారని ప్రత్తిపాటి చెప్పారు.

## పేద విద్యార్థిని ఉన్నత విద్యకు ఎమ్మెల్యే బొండా ఉమా సహకారం

**● పీ - 4 కార్యక్రమం ద్వారా సహాయం అందజేత**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 27వ, డివిజన్ భావాజీపేట ప్రాంతానికి చెందిన టంకాల మోహనప్రియ డిగ్రీ విద్యను పూర్తి చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన ల్యాప్‌టాప్ కొనుగోలు కోసం పీ-4 కార్యక్రమం ద్వారా సహాయం చేయాలని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు కోరారు. విద్యార్థిని అభ్యర్థనను వెంటనే పరిశీలించిన ఎమ్మెల్యే బొండా ఉమా, ఆమె విద్యాభ్యాసానికి అవసరమైన వివరాలను తెలుసుకుని రూ.25,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తనకు అవసరమైన ల్యాప్‌టాప్ కొనుగోలు చేసి ఉన్నత విద్యను విజయవంతంగా కొనసాగించాలని సూచిస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... పేదరికం ఏ విద్యార్థి భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తోంది" అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో కూడా పీ-4 కార్యక్రమం ద్వారా అనేక మంది విద్యార్థులకు, నిరుపేద కుటుంబాలకు సహాయం అందిస్తున్నామని, తమ కుమారులు బొండా సిద్ధార్థ, బొండా రవితేజ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఫీజులు, విద్యా సామగ్రి, నిత్యావసర వస్తువులు అందిస్తూ వారి చదువుకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని, చదవాలనే తపన ఉన్న ప్రతి విద్యార్థికి తమ వంతు సహాయం అందిస్తూనే ఉంటామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

జోన్ - 3
(మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)
చైతన్యరథం

## రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌తో టీడీపీ నూతన ఎంపీల సమావేశం



న్యూఢిల్లీ / అమరావతి (చైతన్యరథం): పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన నూతన ఎంపీలు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ గురువారం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌ని సెషన్ విరామ సమయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల నిర్వహణ, రాజ్యసభ సెషన్స్ వేళ చర్చకు రానున్న వివిధ ప్రధాన అంశాలు మరియు పార్లమెంటరీ విధానాలపై వారు సమగ్రంగా చర్చించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలుగా సభలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటించాల్సిన సభా నియమావళిపై రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌తో వారు ప్రత్యేకంగా మాట్లాడారు. దీనితో పాటు రాష్ట్ర ప్రయోజనాలు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక విషయాలపై కూడా ఈ సమావేశంలో ఫలప్రదమైన చర్చలు జరిగాయి.

## విశాఖ పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



విశాఖపట్నం / జగ్గయ్యపేట (చైతన్యరథం): పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ రెండవ రోజు సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వీఎంఆర్‌డీఏ పరిధిలో కార్మిక సంక్షేమ సెస్ వసూళ్లు జరగకపోవడంపై నమోదైన ఆడిట్ అభ్యంతరాలను కమిటీ సభ్యులు సమీక్షించారు. సంబంధిత అధికారులు ఆడిట్ అభ్యంతరాలపై వివరణలు అందించగా, వసూళ్లలో ఏర్పడిన లోపాలను సరిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిటీ సూచించింది. అనంతరం జరిగిన మరో సమావేశంలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రొఫెషన్ ట్యాక్స్ పూర్తి స్థాయిలో బదిలీ కాకపోవడంపై నమోదైన ఆడిట్ అభ్యంతరాలను పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమగ్రంగా పరిశీలించింది.

## ఖాళీ స్థలాల శుభ్రతకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): అసెంబ్లీ, మున్సిపల్ కౌన్సిల్ లో రెండుళ్ల‌గా ఖాళీ స్థలాల సమస్య పై నిరంతరం గళమెత్తుతున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చొరవతో, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఖాళీ స్థలాల క్లియరెన్స్ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. తొలి సారిగా 25వ డివిజన్ సీతారామనగర్ -- ఆదర్శనగర్ రోడ్డులో ఖాళీ స్థలాల శుభ్రత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘనంగా ప్రారంభించారు. డివిజన్‌లో మూడు ప్రాంతాల్లో జరుగుతున్న ఖాళీ స్థలాల క్లియరెన్స్ పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఇళ్ల మధ్యలో నిర్లక్ష్యంగా వదిలిపెట్టిన ఖాళీ స్థలాలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ఈ సమస్యను గత రెండేళ్లుగా అసెంబ్లీలోనూ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లోనూ పదేపదే ప్రస్తావించానని, వర్షాకాలంలో ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, విషసర్పాలు, క్రిమికీటకాలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని, అంతేకాకుండా ఇలాంటి ప్రదేశాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన అనేక ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నించామని చెప్పారు. ఈ అంశాన్ని ఫొటోగ్రాఫిక్ (ఫోటోల) ఆధారాలతో అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించడంతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కూడా ప్రత్యేక నివేదిక అందజేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## కూటమి చూపిన ఘనత... బధిర జీవితాల్లో నవత..!

**●బధిర డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ఎమ్మెల్యే నరేంద్ర వర్మ హర్షం**



బాపట్ల (చైతన్యరథం): బాపట్ల మండలం వెదుళ్ళపల్లిలో బధిరుల డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు హర్షం వ్యక్తం చేశారు. 1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో రాష్ట్రంలోనే తొలిసారిగా బధిరుల పాఠశాల ఏర్పాటు చేశారు. 1999లో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో బధిరుల జూనియర్ పాఠశాల ఇక్కడే ఏర్పాటు చేశారు. తిరిగి తాజాగా కూటమి ప్రభుత్వంలోనే బధిరుల డిగ్రీ కళాశాల ఏర్పాటు కావడం ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఇది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వంలోనే సాధ్యపడిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంద్రధనస్సు పథకం కింద దీన్ని ఏర్పాటు చేయటం శుభసూచకం అన్నారు. దివ్యాంగుల సంక్షేమం పట్ల చంద్రబాబుకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. రాష్ట్రంలోనే తొలిసారిగా బధిరుల డిగ్రీ కళాశాల బాపట్ల ప్రాంతంలో ఏర్పాటు కావడం తనకి ఎంతో గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ చెప్పారు.

## భూమన కుటుంబం ఆక్రమించిన ప్రభుత్వ భూములపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు అట్లూరి నారాయణరావు, శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ, తుమ్మ ఓంకార్ తదితరులు కలిసి తిరుపతి సమీపంలోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో భూమన కుటుంబం ఆక్రమించిందని ఆరోపిస్తున్న స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సుమారు 9 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ప్రభుత్వ భూములపై ఎటువంటి అక్రమ ఆక్రమణలు జరిగినా వాటిని ఉపేక్షించకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు తేలితే సంబంధిత బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆక్రమణలను వెంటనే తొలగించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటిని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, ఈ అంశంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ విజ్ఞప్తి చేసింది.

## రూ.15.26 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు



విజయవాడ రూరల్ (చైతన్యరథం): మండలంలోని గొల్లపూడిలోని శాసనసభ్యుని కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) పత్రాలను మైలవరం శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిస్తున్న సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వేగంగా స్పందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండపల్లికి చెందిన మాలమంటి ఎస్తేరురాణికి రూ.3,32,616లు, జి.కొండూరు మండలం చెరువుమాధవరం గ్రామానికి చెందిన పొన్నా ఏడుకొండలుకు రూ.2,69,304లు, కొత్తూరు తాడేపల్లి శివారు సీతారాంపురం తండాకు చెందిన కొర్రా వెంకట జగదీష్‌కు రూ.2,71,610లు, ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండకు చెందిన షైక్ జాఫర్‌కు రూ.75,833లు, విజయవాడ రూరల్ మండలం రాయనపాడుకు చెందిన శ్రీ హర్షకు రూ.1,05,945లు, కొత్తూరు తాడేపల్లికి చెందిన పోరల్ల సాంబశివరావుకు రూ.3,01,038, జక్కంపూడికి చెందిన పెనుమూడి గంగాధరరావుకు రూ.1,70,000లు విలువైన ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. మొత్తం ఏడుగురు లబ్ధిదారులకు రూ.15,26,346లు విలువైన ఎల్‌ఓసీలను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు.

## ప్రజా ఫిర్యాదులు పరిష్కారంపై దృష్టి సారించాలి

**●ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు ఆదేశం**



వినుకొండ (చైతన్యరథం): ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా వెంటనే పరిష్కరించాలని, ప్రజా దర్బార్ వేదికగా ప్రజలు సమర్పించిన ప్రతి ఒక్క అర్జీని పూర్తి చేసి ఆ విషయాన్ని వారికి తెలియజేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజల నుండి గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్లు, సిసి రోడ్లు, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి మొత్తం 22 అర్జీలు వచ్చాయి. ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించిన జీవి ఆంజనేయులు, ప్రజా దర్బార్ వేదిక నుండే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సుపరిపాలన, సమన్యాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా తీసుకెళ్తూ ప్రజా ప్రభుత్వంగా మన్ననలు పొందుతున్నామని ఆయన వివరించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా పారదర్శక సేవలు అందించడమే ధ్యేయమని, ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పెద్ద సంఖ్యలో సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలు ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆలోచనల ప్రకారం సేవలలో నాణ్యత, సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

## సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలి

**● మంత్రాలయం, అలంపూర్ పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ**

గన్నవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రాలయంలో శ్రీ గురు రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని దర్శించుకుని సేవల్లో పాల్గొన్నారు. మఠం అధికారులు స్వాగతం పలకగా, వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం శక్తిపీఠాల్లో ఐదవ శక్తిపీఠంగా ప్రసిద్ధి చెందిన అలంపూర్ శ్రీ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని, బాలబ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి శేషవస్త్రాలతో సత్కరించారు. తదుపరి జోగులాంబ గద్వాల్ జిల్లా బీచుపల్లి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని దర్శించిన యార్లగడ్డ వెంకట్రావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు యార్లగడ్డ తెలిపారు.

# గిద్దలూరు అభివృద్ధికి సహకరిస్తా

## ఎమ్మెల్యే ముత్తుములకు మంత్రి నారాయణ హామీ



గిద్దలూరు (చైతన్యరథం): మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గిద్దలూరు పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను సమర్పించారు. ఈ సందర్భంగా గిద్దలూరులో నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం, పార్కుల ఏర్పాటు ఆధునికీకరణ, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి వంటి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. శాసన సభ్యుల వారి వినతిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, గిద్దలూరు పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ పాల్గొన్నారు.



# కార్యకర్తలకు అండగా ఉంటాం

## దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి (చైతన్యరథం): సందువారిపాలెం గ్రామానికి చెందిన 10 మంది గురువారం దర్శి నుండి బోధనంపాడు దశదిన కర్మ కార్యక్రమానికి బయలుదేరారు. వారు ఎక్కిన ఆటో టైరు పగిలి ఆటో భోల్తా పడి తీవ్రంగా గాయపడ్డారు. దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత సాగర్. పరామర్శించారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్న వైద్యులను అడిగి వివరాలు తెలుసుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ మేరకు వైద్యులు ముగ్గురికి ప్రథమ చికిత్స చేసి 108 లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మిగిలిన వారికి దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. గొట్టిపాటి వెంట మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు సత్యనారాయణ, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు సందువారిపాలెం ప్రజలు ఉన్నారు.

# బాలయ్య బాగుండాలని శివాలయంలో పొర్లుదండాలు



కాకినాడ పోర్ట్ లో చిత్రీకరిస్తున్న ఫైట్ సీన్ లో బాలకృష్ణ కి గాయమయింది. అయినా.. ఆయన చాలా ధైర్యంగా ఉన్నారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. బాలకృష్ణకు హాస్పిటల్‌లో చిన్న ఆపరేషన్ జరుగుతుందని ఆపరేషన్ సక్సెస్ అవ్వాలని కోరుతూ మూలాపేట శివాలయం చుట్టూ పొర్లు దండాలు పెట్టారు. బాలకృష్ణ నూరేళ్ళు ప్రజా సేవ లో ఆయన జీవితాన్ని అంకితం చేస్తారు..దైవ స్వరూపులు శ్రీ నందమూరి బాలకృష్ణ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని, సినీ రంగంలోనూ, ప్రజాసేవలోనూ మరింత ఉత్సాహంగా, విజయవంతంగా తన సేవలను కొనసాగించాలనిఆయన త్వరగా కోలుకుని.. విజయవాడలో నిర్మిస్తున్న క్యాన్సర్ హాస్పిటల్ కి పూర్తి చెయ్యాలి.. నిరుపేదలకు నిస్వార్థ సేవలు అందించాలని వేడుకున్నారు.




# ఘనంగా తల్లికి వందనం ప్రారంభం

తిరుపతి (చైతన్యరథం): ఎంఆర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో "తల్లికి వందనం" కార్యక్రమాన్ని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవి నాయుడు పాల్గొన్నారు. తల్లికి వందనం పథకం నిధులు తల్లుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా విద్యార్థులు ప్లేకార్డులు, రోజాపూలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్వీట్లు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా, విద్యార్థులకు ఎల్లప్పుడూ స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ అందించిన ఆర్ఓ వాటర్ ప్యూరిఫైయర్‌ను, ముఖ్య అతిథి అనిమిని రవి నాయుడు చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా టీడీపీ : సుగవాసి

రాయచోటి (చైతన్యరథం): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అబ్బన్నగారి జయరాం, రెడ్డిచర్ల రవీంద్ర మృతదేహాలకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు నివాళులు అర్పించారు. టి.సుండుపల్లి మండలం ఉప్పరపల్లి సమీపంలో నిన్న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చిన్నగొల్లపల్లి గ్రామానికి చెందిన అబ్బన్నగారి జయరాం, రెడ్డిచర్ల రవీంద్ర గార్లు దుర్మరణం చెందారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, రాష్ట్ర టీడీపీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు, స్థానిక టీడీపీ నాయకులు శివారెడ్డి, రామచంద్ర, రెడ్డయ్య, సుబ్బరామ, అరుణ్ తదితరులతో కలిసి మృతుల స్వగ్రామానికి వెళ్లి వారి పార్థివ దేహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు



అర్పించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి ప్రగాఢ దుఃఖంలో భాగస్వాములయ్యారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కోల్పోవద్దని, కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. పేర్కొన్నారు.



# కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

## వైసీపీ నాయకులకు కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి హెచ్చరిక



కావలి (చైతన్యరథం): మండలం సర్వాయపాలెం పంచాయతీ తాగేటివారిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త చాట్ల వాసు హత్యపై ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చాట్ల వాసు కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తన భర్తను దారుణంగా హత్య చేశారని చాట్ల వాసు భార్యకన్నీటి పర్యంతమయ్యింది. చాట్ల వాసు కుటుంబానికి ఎమ్మెల్యే రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి ఉద్యోగం సహా అవసరమైన ప్రభుత్వ సహాయంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. "చాట్ల వాసు ఏం తప్పు చేశాడని ఇంత దారుణంగా హత్య చేశారు?" "చాట్ల వాసును ఇంత దారుణంగా హత్య చేయడం నా మనసును కలచివేసింది" అని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. "తాగేటివారిపాలెం అరుంధతివాడ ప్రశాంతతకు మారుపేరు. అలాంటి గ్రామంలో ఇలాంటి ఘటన జరగడం అత్యంత బాధాకరం" మాజీ సర్పంచ్, వైసీపీ రూరల్ మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంద మధు సుపారీ గ్యాంగ్‌తో ఈ దారుణానికి పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, గ్రామస్థాయి నాయకుల ఆలోచనా విధానం ఒకేలా ఉందని ఎమ్మెల్యే విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి రాజకీయంగా ఎదుర్కోలేక హత్యా రాజకీయాలకు తెరతీస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. "ఇకపై టీడీపీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు" అని ఎమ్మెల్యే హెచ్చరించారు. "రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక మా నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు" "మా నాయకుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోను" మేమేంటో చూపిస్తాం.. రాజకీయంగా నేను అడ్డుగా ఉంటే నన్ను చంపేయండి... మా నాయకుల జోలికి వస్తే సహించను" ఎమ్మెల్యే?? "ఒక అరగల కృష్ణయ్య, ఒక చాట్ల వాసు...ఇకపై చూస్తూ ఊరుకోం" ఎమ్మెల్యే వైసిపి పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే రాజకీయాలను ప్రజలంతా ఖండించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కావలి నియోజకవర్గంలో శాంతి భద్రతలు కాపాడటమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. వైసిపి పార్టీ గ్రామాల్లో వర్గ విభేదాలు సృష్టించే ప్రయత్నాలను అడ్డుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కావలి ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలను సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. చాట్ల వాసు కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

# అప్పగించిన పని సమర్థవంతంగా చేశారు

## కార్యకర్తలకు ఎమ్మెల్యే కందికుంట కితాబు



కదిరి (చైతన్యరథం): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమాన్ని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్క పార్టీ నాయకుడు, కార్యకర్తకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సంసిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కలిసి కట్టుగా పనిచేసి, ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన లిగొడ్డలి పార్టీకిలి ఇక కదిరి నియోజకవర్గంలో స్థానం లేదని పేర్కొన్నారు. కదిరి నియోజకవర్గాన్ని ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చేస్తున్నామని, రాబోయే రోజుల్లో మరింత వేగంగా అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలబెడతామని అన్నారు. ప్రతిష్ఠాత్మక కదిరి కోనేరు అభివృద్ధి పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామనిలి స్పష్టం చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన లిముస్లిం మైనార్టీ ఫంక్షన్ హాల్ (షాదీ ఖానా)లిను ఇప్పుడు అత్యాధునిక సౌకర్యాలతో సుందరీకరించి, మరింత అందంగా తీర్చిదిద్ది ప్రజల వినియోగానికి అందిస్తామని తెలిపారు.




కడప జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బ రామిరెడ్డి, నాయకుడు పుత్తా లక్ష్మి రెడ్డి కలిసి పరిశీలించారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు అండగా టీడీపీ ప్రభుత్వం

మడకశిర (చైతన్యరథం): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మడకశిర ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు 269 ఇండక్షన్ స్టవ్‌లు 269 కుక్కర్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు గ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని అంగన్వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారులు, గర్భిణీలు బాలింతలకు నాణ్యమైన పోషకాహారం పరిశుభ్రమైన వాతావరణంలో అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఆధునిక వంట పరికరాల వినియోగంతో వంట ప్రక్రియ మరింత సులభతరమై, సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎసి,సీడీపీఓ , రాధా, సూపర్వైజర్లు శ్రీదేవి, లీలావతి, నియోజకవర్గ కన్వీనర్లు, అంగన్వాడీ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

నందికొట్కూరు (చైతన్యరథం): అంగన్‌వాడీలో చిన్నారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని ఎమ్మెల్యే జయసూర్య అంగన్‌వాడీలకు సూచించారు. నందికొట్కూరులోని మండల అభివృద్ధి కార్యాలయంలో అంగన్‌వాడీ సెంటర్లకు ఇండక్షన్ స్టవ్‌లను అందజేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల్లోని 267 అంగన్ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, ఐసీడీఎస్ సీడీపీవో మంగవల్లి, నందికొట్కూరు సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ ముర్తుజావళి, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.



# ప్రగడ కోటయ్య జయంతి వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

## చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య వెల్లడి



చీరాల (చైతన్యరథం): స్వాతంత్ర సమరయోధుడు ప్రగడ కోటయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య వెల్లడించారు. చేనేత కార్మికులకు, చేనేత రంగానికి సహకార సంఘాలు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని గట్టిగా నమ్మిన బీసీ రాజకీయ నేత కోటయ్య అని గుర్తు చేశారు. మూడు సార్లు శాసన సభ్యునిగా ఒక సారి ఎంపీ గా పనిచేసి చేనేత కార్మికుల సంక్షేమం కోసం, సహకార రంగం పటిష్టత కోసం ఎంతో శ్రమించిన ప్రజా బంధు స్వర్గీయ ప్రగడ . కోటయ్య జయంతి వేడుకలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలో పండుగ వాతావరణంలో చీరాల ఆర్.టి.సి. బస్టాండ్ దగ్గరలో పద్మశాలీయ బహూత్తమ కళ్యాణ మండపంలో జరుగుతాయని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర చేనేత బి.సి.సంక్షేమ శాఖామాత్యులు ఎస్. సవిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా, హ్యాండ్ లూమ్స్ టెక్స్ టైల్స్ శాఖ కమిషనర్ జి రేఖారాణి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగడ కోటయ్య అభిమానులు ప్రజలు అందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# కేసీ కెనాల్ పనులు వేగవంతం చేయాలి

## జలవనరులశాఖ అధికారులకు కలెక్టర్ రాజకుమారి ఆదేశం

నంద్యాల (చైతన్యరథం): ప్రభుత్వ వైద్య కళాశాల మీదుగా వెళ్తున్న కేసీ కెనాల్ నూనెపల్లె సప్లయ్ చానల్ సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మెడికల్ కళాశాలను ఆనుకుని ఉన్న కేసీకెనాల్ సప్లయ్ చానల్ కాల్వకు ఇరువైపులా రూ. 32లక్షలతో జరుగుతున్న సుందరీకరణ పనులను కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్‌తో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సుందరీకరణ పనులను ఎట్టి పరిస్థితుల్లోను ఆగస్టు నెలాఖరు లోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ వైద్యకళాశాల పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో ఉండేలా సుందరీకరణ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కెనాల్‌లో లైనింగ్‌కు మరమ్మతులు చేయడంతో పాటు ఇన్‌స్పెక్షన్‌పాత్‌ను ఏర్పాటు చేసి గ్రావెల్ వేసేవిధంగా అధికారులను ఆదేశించామన్నారు. కెనాల్ పరిసరాల్లో పేరుకపోయిన చెత్త, మట్టి దంపులు, కలుపు మొక్కలను పూర్తిగా తొలగించి పరిశుభ్రంగా ఉంచేలా చూస్తామన్నారు. టెండర్ నిబంధనల ప్రకారం మూడు నెలల గడువులో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఆగస్టు నెలాఖరులోపే అన్ని పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురా వాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల భవనాల నిర్మాణ పురోగతి, హాస్టల్ భవనాల, విద్యాకార్యక్రమాల నిర్వహణ, ల్యాబ్‌ల పనితీరు గురించి ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో ఫ్యాకల్టీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి బోధన, ల్యాబ్ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నిరంజన్‌రెడ్డి, వైద్య కళాశాల ఏవో రమ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కనుల పండువగా
# షట్ కల్యాణ మహోత్సవం

**మిస్సోరిలో వైభవంగా ముగిసిన నవకుండాత్మక శత చండీ సహిత రుద్రయాగం**

**మహా క్రతువును తిలకించి పులకించిన భక్తులు**





**మిస్సోరి (అమెరికా):** లోక కల్యాణం, విశ్వశాంతి, సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయంగా అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో ఉన్న 'ది హిందూ టెంపుల్ ఆఫ్ సెయింట్ లూయిస్' వేదికగా ఆరు రోజుల పాటు నిర్వహించిన ప్రతిష్ఠాత్మక నవకుండాత్మక శత చండీ సహిత రుద్ర యాగం దివ్యమైన పూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. అమెరికాలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక వేడుకలో పాలుపంచుకుని ప్రత్యేక పూజలు చేశారు.

యాగానికి ముగింపు పలికే ఆఖరి రోజున సంకల్పకర్తలు, స్పాన్సర్ల ఆధ్వర్యంలో పవిత్ర కలశాలతో యాగశాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ శివుడికి వైభవంగా 'మహా రుద్రాభిషేకం' నిర్వహించారు. దేవీదేవతల నామస్మరణలతో యాగశాల దివ్య తేజస్సుతో ప్రకాశించింది. యాగం పూర్తికాగానే వర్షం కురవడాన్ని పండితులు యాగ పరిపూర్ణతకు, శ్రేయస్సుకు శుభసూచకంగా, దైవానుగ్రహంగా అభివర్ణించారు.

**దశసహస్ర మోదక హోమం:** యాగంలో భాగంగా వినాయకుడికి అత్యంత ప్రీతిపాత్రమైన 10వేల మోదకాలను ఆలయ స్వచ్ఛంద సేవకులు భక్తి భావంతో స్వయంగా తయారు చేసి ప్రత్యేక హోమం నిర్వహించడం విశేషం.

**షట్ కల్యాణ మహోత్సవం:** ఆలయ ధ్వజస్తంభం వద్ద నిర్మించిన 90 అడుగుల విశాలమైన వేదికపై ఒకే ప్రాంగణంలో రాధాకృష్ణులు, సీతారామచంద్రులు, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శివపార్వతులు, లక్ష్మీనరసింహస్వామి, వేంకటేశ్వర స్వామివార్ల కల్యాణాలను ఒకేసారి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ అరుదైన దృశ్యాన్ని తిలకించి భక్తులు మైమరిచిపోయారు.

ఈ బృహత్తర యజ్ఞం విజయవంతం కావడానికి అహర్నిశలూ కృషి చేసిన వేద పండితులను, వలంటీర్లను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. యాగ కమిటీ చైర్మన్ గంగవరపు రజనీకాంత్ మాట్లాడుతూ.. భక్తుల తోడ్పాటు, వలంటీర్ల నిష్కామ సేవ, దాతల ఉదార స్వభావమే ఈ కార్యక్రమ విజయానికి మూలమని తెలిపారు.

యాగ నిర్వహణలో వైస్ చైర్మన్ విజయ్ కె.సాక్షి, కార్యదర్శి జంగా కిషోర్, కోశాధికారి మురళీకృష్ణ పుట్టగుంట, స్టీరింగ్ కమిటీ సభ్యుడు బైరపునేని సురేంద్రనాథ్, మీడియా కో-ఆర్డినేటర్ రాజా సూర్యపనేని కీలక పాత్ర పోషించి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆహార కమిటీ ఛైర్మన్లు రాజేష్ ఏవూరు, సతీష్ లంక నేతృత్వంలో ఆరు రోజుల్లో దాదాపు 25వేల మందికి పైగా భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. ఈ ఆధ్యాత్మిక యజ్ఞం ఉత్తర అమెరికా గడ్డపై సనాతన ధర్మ వైభవానికి ప్రతిరూపంగా నిలిచింది.







### కువైట్‌లో భారత పాస్‌పోర్ట్, వీసా, కాన్సులర్
## సేవలు పున: ప్రారంభం

**కువైట్ సిటీ:** కువైట్‌లో భారత పాస్‌పోర్ట్, వీసా, కాన్సులర్ సేవలు పునఃప్రారంభమయ్యాయి. ఈ మేరకు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మూడు కొత్త ఇండియన్ కాన్సులర్ అప్లికేషన్ సెంటర్ల ద్వారా సేవలు అందుబాటులోకి రానున్నాయి.

కొత్తగా ప్రారంభమైన కేంద్రాల చిరునామా:

కువైట్ సిటీ ICAC: అల్ జవహారా టవర్, 1వ అంతస్తు, కిబ్లా, బ్లాక్ 11, ప్లాట్ 11, సలేం అల్ ముబారక్ స్ట్రీట్.




ఫహాహీల్ ICAC: సమా మాల్, 3వ అంతస్తు, యూనిట్ 55, ప్లాట్ నం.21, ఫహాహీల్.

దజీజ్ ICAC: వాహా మాల్, గ్రౌండ్ ఫ్లోర్, యూనిట్లు 37, 38, అల్ దజీజ్.

ఇవి ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తాయి.

దరఖాస్తుదారులు నేరుగా కేంద్రాలను సందర్శించి సేవలు పొందవచ్చు లేదా ఆన్‌లైన్‌లో ముందస్తుగా అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో అపాయింట్మెంట్ తీసుకునే సమయంలో అవసరమైన సేవా విభాగాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని భారత రాయబార కార్యాలయం సూచించింది.

భారత ప్రభుత్వం నిర్ణయించిన పాస్‌పోర్ట్, వీసా, కాన్సులర్ సేవల ఫీజులకు అదనంగా ప్రతి దరఖాస్తుకు DU Digital Global 6 కువైటీ దినార్ (KD 6) సేవా రుసుము వసూలు చేస్తుంది. ఇందులో దరఖాస్తు ఫారం నింపడం, ఫొటోగ్రఫీ, డాక్యుమెంట్ టైపింగ్, దేశీయ కొరియర్ సేవలు, ప్రింట్లు, ఫొటో కాపీలు వంటి అనుబంధ సేవలు కూడా ఉంటాయి. వివిధ సేవలకు సంబంధించిన ప్రభుత్వ ఫీజులు, సేవా రుసుముల పూర్తి వివరాలను కూడా భారత రాయబార కార్యాలయం విడుదల చేసింది.

### 'మిస్ జార్జియా టీన్ యూఎస్ఏ'గా
# కిరణ్ రెడ్డి

**తొలి భారతీయ-అమెరికన్‌గా కొత్త చరిత్ర**

**ఆగస్టులో జరిగే జాతీయ పోటీలకు అర్హత**




**జార్జియా:** అమెరికాలో భారత సంతతికి చెందిన 18 ఏళ్ల యువతి కిరణ్ రెడ్డి అందాల పోటీల్లో సత్తా చాటింది. జార్జియాలో నివాసముంటున్న ఆమె ఇటీవల జరిగిన 'మిస్ జార్జియా టీన్ యూఎస్ఏ-2026' కిరీటాన్ని దక్కించుకుంది. తద్వారా ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయ-అమెరికన్‌గా చరిత్ర సృష్టించింది.

కౌంటీ పోటీల నుంచి కిరీటం వరకు.. జార్జియాలోని కాఫీ కౌంటీకి చెందిన కిరణ్ రెడ్డి ఇటీవలే విద్యాభ్యాసం పూర్తి చేసింది. మూడేళ్ల క్రితం స్థానిక కౌంటీ స్థాయి అందాల పోటీలతో ప్రారంభమైన ఆమె ప్రయాణం కొద్దికాలంలోనే రాష్ట్ర స్థాయి కిరీటం వరకు సాగింది. వైద్య వృత్తిలో ఉన్న తన తండ్రి నుంచి ఎంతో స్ఫూర్తి పొందానని, భవిష్యత్తులో తాను కూడా వైద్య రంగంలోనే సేవ చేయాలని ఆశిస్తున్నట్టు కిరణ్ రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీకి సై 'మిస్ జార్జియా టీన్ యూఎస్ఏ' విజేతగా నిలిచిన కిరణ్ రెడ్డి ఆగస్టులో ఫ్లోరిడాలోని మియామిలో జరిగే జాతీయ స్థాయి 'మిస్ టీన్ యూఎస్ఏ' పోటీల్లో జార్జియా రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ పోటీల్లో అమెరికా దేశవ్యాప్తంగా పాల్గొనే 50 మంది పోటీదారులతో ఆమె తలపడనుంది.

### ఎన్ఆర్ఐలు ఓటు హక్కు
## నమోదు చేసుకోవాలి

**ఏపీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి**

**ఎన్ఆర్ఐ టీడీపీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పిల్లి గురురాజా**

**యూఎస్ఏ:** విదేశాల్లో ఉంటున్న భారతీయులు (ఎన్ఆర్ఐలు) ఓటర్ల నమోదు ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొనాలని, 100 శాతం ఓటు నమోదు లక్ష్యాన్ని సాధించేందుకు ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని ఎన్ఆర్ఐ టీడీపీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పిల్లి గురురాజా పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని, ప్రతి ఎన్ఆర్ఐ తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలోను, కీలక రాజకీయ నిర్ణయాల్లోనూ ఎన్ఆర్ఐలు గణనీయమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. "మీ ఓటు కేవలం మీ హక్కు మాత్రమే కాదు.. జన్మభూమికి, పుణ్యభూమికి మీరు ఇవ్వగలిగే అత్యుత్తమ కానుక" అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా ఓటర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, విదేశీ నివాస చిరునామా, భారతదేశంలోని శాశ్వత చిరునామా పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఓటు నమోదుకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా సమీపంలోని భారతీయ ఎంబసీ లేదా కాన్సులేట్ కార్యాలయాన్ని సంప్రదించాలని డాక్టర్ గురురాజా సూచించారు.



# భారీ వర్షాలతో గుజరాత్ అతలాకుతలం

## 16 గంటల్లోనే 1,100 మిల్లీమీటర్ల వర్షపాతం, పరిస్థితి అత్యంత విషమం, వరద నీటిలో పార్కింగ్ స్థలాల మునక



గుజరాత్‌లోని దక్షిణ ప్రాంతమైన వల్సాడ్ జిల్లా భారీ వర్షాలతో అతలాకుతలమైంది. పార్కింగ్ చేసిన కార్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. ముఖ్యంగా ఉంబర్‌గావ్ ప్రాంతంలో కేవలం 16 గంటల్లోనే 1,100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవడంతో పరిస్థితి అత్యంత విషమంగా మారింది. వాపి ప్రాంతంలోని ఓ భవనం పార్కింగ్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోగా, అక్కడ నిలిపి ఉంచిన 50కిపైగా కార్లు నీటిలో చిక్కుకుపోయాయి. ఈ ఘటనకు సంబంధించిన డ్రోన్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా వల్సాడ్ జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఔరంగా, పార్, దమన్ గంగా నదులు పొంగిపొర్లడంతో వరదలు మరింత ఉధృతమయ్యాయి. ప్రమాదకర పరిస్థితుల నేపథ్యంలో అధికారులు వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సూరత్ నగరంలోని లోతట్టు ప్రాంతాల నుంచి కూడా 2,200 మందికిపైగా ప్రజలను ముందస్తు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. దక్షిణ గుజరాత్‌లోని వల్సాడ్, నవ్‌సారీ, డాంగ్స్, సూరత్, తాపి జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం, శుక్రవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు పలువురు మంత్రులను వరద ప్రభావిత జిల్లాలకు పంపించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నారు.




# ఇన్‌స్టా స్టోరీలో 'కాక్రోచ్' పోస్ట్.. వివాదంలో ఆర్‌పీఎఫ్ ఆఫీసర్ సోనియా!

విద్యార్థుల నిరసనలపై సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ తీవ్ర దుమారానికి తెరతీసింది. దీంతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ సోనియా షెహ్రావత్ వివాదంలో చిక్కుకున్నారు. నిరసనకారులను ఉద్దేశిస్తూ ఆమె ఇన్‌స్టా స్టోరీ వేదికగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీయడంతో వెంటనే దానిని ఆమె రిమూవ్ చేశారు. హరియాణాకు చెందిన సోనియా షెహ్రావత్‌కు సోషల్ మీడియాలో ప్రముఖ వ్యక్తిగా మంచి గుర్తింపు ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 6 లక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. విధి నిర్వహణకు సంబంధించిన అంశాలతోపాటు వ్యక్తిగత జీవితం, ప్రయాణాలు, వ్యాయామం, ఆధ్యాత్మికత వంటి విషయాలకు సంబంధించిన పోస్టులను ఎప్పటికప్పుడు పంచుకుంటుంటారామె. అలాగే.. ఢిల్లీలో ఇటీవల విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనల సమయంలో విధుల్లో పాల్గొన్న ఆమె.. తన ఇన్‌స్టా స్టోరీలో చనిపోయిన బొద్దింక ఫొటోను ఒకదానిని షేర్ చేశారు. దానికి 'తమను తాము మార్చుకోలేని వారు దేశాన్ని మార్చాలనుకుంటున్నారు' అనే క్యాప్షన్ జోడించారు. ఇది కాసేపటికే నెట్టింట వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వ్యాఖ్యలపై నిరసనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ.. 'ఎక్స్'లో ఆమెపై విమర్శలకు దిగింది. శాంతియుత నిరసనకారులను ఇలా కాక్రోచ్‌లతో పోల్చడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. ఈ వివాదం మరింత ముదరడంతో తన ఇన్‌స్టా స్టోరీని సోనియా వెంటనే తొలగించారు .

# నీట్ పేపర్ లీక్‌పై దద్దరిల్లిన లోక్‌సభ

## ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ రేపటికి వాయిదా



నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ రేపటికి వాయిదా పడింది. రాజ్యసభను కూడా మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాయిదా పడింది. నీట్ పేపర్ లీక్ ఉదంతానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం ప్రారంభించాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టాయి. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది. పేపర్ లీక్ జరిగినట్టు ప్రభుత్వం అంగీకరిస్తే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. రూల్ 267 కింద చర్చ చేపట్టాలని కోరుతుంటే ప్రభుత్వం అంగీకరించట్లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని కేంద్రం అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాతే తాము ఏ చర్చకైనా సిద్ధమని స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల తీరుపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. నీట్‌పై చర్చ నుంచి తప్పించుకోవాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ఆరోపించారు. చర్చ ముందు షరతులు పెట్టడం భావ్యం కాదని అన్నారు. ఈ అంశంపై తన వాదన వినిపించే హక్కు ప్రభుత్వానికి కూడా ఉంటుందని అన్నారు.

# నేడు దేశ వ్యాప్త నిరసనకు సీజేపీ పిలుపు

నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఇటీవలి జంతర్‌మంతర్, పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చినట్టు తెలిపింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లకు సిద్ధం కావాలని యువతను కోరింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. బాధితులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేయాలని కూడా సూచించింది. నిరసనల్లో కేవలం సానుకూల నినాదాలను మాత్రమే చేయాలని చెప్పింది.

ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. నిరసనకు అనుమతి ఉన్న ప్రాంతాలకే పరిమితం కావాలని, ట్రాఫిక్‌కు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. రెచ్చగొట్టే చర్యలకు స్పందించవద్దని కూడా పేర్కొంది. ఇక నీట్ ఉదంతంపై విచారణ కోసం కేంద్రం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే.



# మెట్రో స్టేషన్ల మూసివేతపై సీజేఐ సీరియస్

## సరిదిద్దకపోతే జోక్యం చేసుకుంటామని హెచ్చరిక

దేశ రాజధాని ఢిల్లీలో సీజేపీ నిరసనల నేపథ్యంలో పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలతో పాటు సుప్రీంకోర్టుకు వచ్చే న్యాయవాదులు, వ్యాజ్యదారులు, కోర్టు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మధ్యాహ్నంలోగా పరిస్థితి సరిదిద్దకపోతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలను కారణంగా చూపుతూ ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ వరుసగా రెండో రోజు కూడా 16 మెట్రో స్టేషన్లను మూసివేసింది. ఈ నిర్ణయంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మెట్రో స్టేషన్ల మూసివేత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ బార్ అసోసియేషన్ ఓ పిటిషన్ వేసింది. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. మధ్యాహ్నం వరకు వేచి చూద్దామని, ఆ తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే తాము జోక్యం చేసుకుంటామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిరసనకారులు జంతర్ మంతర్ వద్ద తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్లు చేస్తున్నారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ఢిల్లీ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మరోవైపు పార్లమెంట్‌ను కూడా ఈ లీకేజీ వ్యవహారం కుదిపేస్తోంది.

# పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు

## శత్రుదేశాల పరస్పర హెచ్చరికలతో భయానక పరిస్థితులు



పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా తీవ్రస్థాయికి చేరాయి. జలసంధి కేంద్రంగా ఇరాన్, అమెరికా దేశాల మధ్య మాటల యుద్ధం కాస్తా.. ప్రతీకార దాడుల హెచ్చరికలకు దారితీసింది. ఇరాన్ మౌలిక సదుపాయాలపై దాడి చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ అంతే ఘాటుగా స్పందించింది. ప్రాంతీయంగా ఉన్న బ్రిడ్జిలు, విద్యుత్ ప్లాంట్లు, చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ తీవ్రంగా హెచ్చరించింది.

**పరస్పర హెచ్చరికలు**

కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేసిన ప్రతీసారి, ఇరాన్‌కు చెందిన ఒక వారధిని లేదా విద్యుత్ ప్లాంట్‌ను బాంబులతో ధ్వంసం చేస్తామని డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'అమెరికా గనుక మా దేశంలోని ఏ ఒక్క బ్రిడ్జిని లేదా పవర్ ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నా... మేము ఈ ప్రాంతంలోని మౌలిక సదుపాయాలతో పాటు అమెరికాకు ప్రయోజనం కల్పించే చమురు కేంద్రాలను సమూలంగా ధ్వంసం చేస్తాం' అని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ దీనిపై స్పందిస్తూ... తమ దేశం 'కంటికి కన్ను' విధానాన్ని పాటిస్తుందని, తమ దేశ మౌలిక సదుపాయాలపై జరిగే ఏ దాడికైనా అంతే తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు.

# వారెంట్ ఉన్నా అంత ఈజీ కాదు

## ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై న్యూయార్క్ మేయర్ మమ్దానీ



ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసినప్పటికీ, ఆయనను అరెస్ట్ చేసే చట్టపరమైన అధికారం తనకు లేదని న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ స్పష్టం చేశారు. నెతన్యాహు న్యూయార్క్‌కు వస్తే అరెస్ట్ చేయిస్తానని గతంలో ప్రకటించిన మమ్దానీ, ఇప్పుడు అమెరికా చట్టాల ప్రకారం అది సాధ్యం కాదని అంగీకరించారు. 'ఐసీసీ అరెస్ట్ వారెంట్‌ను అమలు చేసే అధికారం న్యూయార్క్ నగరానికి లేదా మేయర్ కార్యాలయానికి లేదు. వార్ క్రిమినల్ అయిన నెతన్యాహును మేం అరెస్ట్ చేయలేం. అయితే అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి ఆ అధికారం ఉంది. అంతర్జాతీయ చట్టాలను గౌరవించి నెతన్యాహుపై అమెరికా అధ్యక్షుడు చర్యలు తీసుకోవాలి' అని మమ్దానీ డిమాండ్ చేశారు. 2024లో గాజా యుద్ధానికి సంబంధించిన యుద్ధ నేరాల ఆరోపణలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు బెంజమిన్ నెతన్యాహుపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అయితే ఇజ్రాయెల్ ఈ ఆరోపణలను ఖండించింది. ఐసీసీ అధికార పరిధిని అంగీకరించ లేదు. ఈ వివాదంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా గతంలో స్పందించారు. 'నెతన్యాహు అమెరికాలో ఉన్నంత వరకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అరెస్ట్ కారు' అని స్పష్టం చేశారు.

# ట్రంప్ నోట మళ్ళీ సుంకాల మాట

## వాణిజ్య నిర్ణయం ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక వాణిజ్య నిర్ణయం ప్రకటించారు. విదేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే జనరిక్ మందులపై రెండేళ్ల పాటు సుంకాలేవీ ఉండబోవని ప్రకటించారు. ఆ తర్వాత 2028 ఆగస్టు నుంచి 100 శాతం టారిఫ్ విధించనున్నట్లు వెల్లడించారు. ఆ తర్వాత ఏడాది నుంచి ఈ టారిఫ్‌ను 200 శాతానికి పెంచుతామన్నారు. అమెరికాలో ఔషధ తయారీని ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుకున్న ప్రధాన ఉద్దేశమని ట్రంప్ తెలిపారు. జనరిక్ మందులను ఉత్పత్తి చేసే కంపెనీలు తొలి రెండేళ్లలో అమెరికాలో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఔషధాలను దేశీయంగానే ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ట్రంప్ వెల్లడించారు. అమెరికాకు జనరిక్ మందులను సరఫరా చేసే ప్రధాన దేశాల్లో భారత్ ఒకటి. భారతీయ ఫార్మా కంపెనీలు అమెరికా మార్కెట్‌పై గణనీయంగా ఆధారపడుతున్నాయి. అందువల్ల 2028 నుంచి అమల్లోకి వచ్చే ఈ టారిఫ్‌లు భారత ఔషధ ఎగుమతులపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ముందుగా మేల్కొనడం అవసరమని సూచిస్తున్నారు. అయితే రెండేళ్ల గడువు ఇవ్వడంతో కంపెనీలు తమ ఉత్పత్తి, పెట్టుబడి వ్యూహాలను మార్చుకునేందుకు సమయం లభించనుంది.



# సౌదీ ట్యాంకర్లపై మేమే విరుచుకుపడ్డాం

## యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుదారు హౌతీ ప్రకటన



ఎర్రసముద్రంలో ప్రయాణిస్తున్న సౌదీ అరేబియాకు చెందిన రెండు భారీ చమురు ట్యాంకర్లపై తాము క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడినట్లు యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుదారైన హౌతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. ఇటీవల యెమెన్ రాజధాని సనా విమానాశ్రయంపై సౌదీ దళాలు నిర్వహించిన వైమానిక దాడులకు ప్రతీకారంగానే ఈ సైనిక చర్య చేపట్టినట్లు స్పష్టం చేశారు. హౌతీ దళాల అధికారిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సరియా టెలిగ్రామ్ వేదికగా ఈ దాడి వివరాలను వెల్లడించారు. సౌదీ అరేబియాకు చెందిన 'ఎన్సేలియా', 'లైలా' అనే రెండు చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు తెలిపారు. బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులు, విస్ఫోటన డ్రోన్లతో ఈ దాడి జరిపినట్లు, ఈ దెబ్బకు రెండు నౌకల్లోనూ భారీగా మంటలు చెలరేగాయని హౌతీలు ప్రకటించారు. ఈ దాడి భయంతో మరో 10 వాణిజ్య నౌకలు ప్రయాణాన్ని రద్దు చేసుకుని వెనక్కి మళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఆగని ఆధిపత్య పోరు

## వరుసగా 11వ రాత్రి కూడా వైమానిక దాడులు

ఇరాన్‌పై అమెరికా సైన్యం వరుసగా 11వ రాత్రి కూడా వైమానిక దాడులు నిర్వహించింది. హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్య పోరాటం కోసం ఇరు దేశాలు దాడులకు దిగుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు జరుగుతున్న దౌత్య ప్రయత్నాలపై ఈ దాడులు ప్రభావం చూపుతున్నాయి. ఒకవైపు పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు దౌత్య చర్చలు కొనసాగుతున్నాయి. ఇరాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి ఎస్కందర్ మొమెని తాజాగా పాకిస్థాన్‌ను అధికారికంగా సందర్శించారు. ఈ పర్యటనలో ఆయన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్‌తో సమావేశమయ్యారు. సరిహద్దు భద్రత, ద్వైపాక్షిక వాణిజ్యం, ప్రాంతీయ భద్రత, అమెరికా-ఇరాన్ యుద్ధ పరిస్థితులపై చర్చించారు. అమెరికాతో కాల్పుల విరమణ గురించి కూడా ఎస్కందర్ చర్చలు జరిపినట్టు సమాచారం. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చలపై ప్రస్తుతానికి ఆసక్తి లేదని మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా సైన్యం దాడులు చేస్తూనే ఉంది. కాగా, తాజా దాడుల్లో ఏ లక్ష్యాలను గురి చేసిందనే విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించలేదు.






## వచ్చే ఏడాది జూన్ 9న డబ్ల్యూటీసీ ఫైనల్

### ఆతిథ్య హక్కులు మూడోసారీ ఇంగ్లండ్‌కే

*అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) మరోమారు ఇంగ్లండ్‌కే పట్టం కట్టింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (WTC 2025-27 Final) ఆతిథ్య హక్కులను వరసగా మూడోసారీ ఆ దేశానికే కట్టబెట్టింది. డబ్ల్యూటీసీ ఫైనల్ ఓవల్ మైదానంలో జరగనుంది. మరో మూడు పర్యాయాలు ఇంగ్లండ్‌కే అవకాశం ఇస్తామని పేర్కొన్న ఐసీసీ చెప్పినట్టే వేదికను ఖరారు చేసింది. ఆరంభ ఎడిషన్‌లో భారత్, న్యూజిలాండ్ ఇదే మైదానంలో తలపడగా.. ఈసారి కూడా టెస్టు పోరు ఇక్కడే జంగనుంది. జూన్ 9వ తేదీ నుంచి మ్యాచ్ నిర్వహించనున్నారు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 ఫైనల్ తేదీ ఖరారైంది. వచ్చే ఏడాది జూన్ 9న ఇంగ్లండ్‌లోని ఓవల్ మైదానంలో టైటిల్ పోరు జరుగనుంది. తొలి సీజన్ 2021-23 ఫైనల్ ఇదే స్టేడియంలో నిర్వహించిన ఐసీసీ.. మరోమారు ఓవల్‌కు అవకాశమిచ్చింది. అయితే.. 2023-25 మాదిరిగా లార్డ్స్ స్టేడియంలోనే ఫైనల్ జరపాలని తొలుత ఐసీసీ భావించింది. కానీ ఇటీవలే ఈ మైదానంపై ఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేయడంతో వేదికను మార్చాలని ఇంగ్లండ్ వేల్స్ బోర్డు అభ్యర్థించింది. ఇంగ్లండ్, న్యూజిలాండ్ టెస్టు అనంతరం లార్డ్స్ పిచ్ ఏమంత బాగాలేదని నివేదిక రావడమే అందుకు కారణం. దాంతో మరోసారి ఓవల్‌కు డబ్ల్యూటీసీ ఫైనల్ నిర్వహించే అవకాశం లభించింది. జూన్ 9 నుంచి 13 వరకూ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది.*

**టాప్‌లో ఆసీస్, దక్షిణాఫ్రికా**

*ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. గత ఎడిషన్ విజేత దక్షిణాఫ్రికా, తొలి సీజన్ ఛాంపియన్ న్యూజిలాండ్ వరసగా రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. చూస్తుంటే.. ఈసారి ఫైనల్లో ఆసీస్, సఫారీలు లేదా.. ఆసీస్, కివీస్ తలపడే అవకాశముంది.*

# కామన్వెల్త్ గేమ్స్... పతకం ఖాయం చేసిన బాక్సర్ లవ్లీనా

గ్లాస్గో: స్కాట్లాండ్ వేదికగా ప్రారంభమైన కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత పతకాల బోణీ ఖాయమైంది. మహిళల 75 కేజీల బాక్సింగ్ విభాగంలో స్టార్ బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించి దేశానికి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్స్‌లో కేవలం ఐదుగురు బాక్సర్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో లవ్లీనాకు డ్రాలో 'బై' లభించింది. లవ్లీనాతో పాటు మరో ఇద్దరు బాక్సర్లు నేరుగా సెమీస్ చేరగా మిగిలిన ఇద్దరి మధ్య ఒకే ఒక్క క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ నెల 31న జరిగే సెమీఫైనల్లో తువాలుకు చెందిన టికెబీపీ తాపాకీతో లవ్లీనా తలపడనుంది. ఒకవేళ సెమీస్‌లో ఓడినా.. లవ్లీనాకు మాత్రం కనీసం కాంస్య పతకం దక్కనున్నది. కామన్వెల్త్ క్రీడల్లో ఇంకా ఓపెనింగ్ సెర్మనీ కూడా జరగకముందే ఇండియాకు పతకం ఖాయం కావడం గమనార్హం. రింగ్‌లోకి ఎంటర్ కాకముందే ఆమెకు పోడియంలో చోటు దక్కిందని అధికారులు పేర్కొన్నారు. ఈసారి ఇండియా తరపున కామన్వెల్త్ క్రీడల్లో 124 మంది అథ్లెట్లు హాజరవుతున్నారు. 2022లో జరిగిన క్రీడల్లో ఇండియా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే.



**లవ్లీనా కెరీర్ మైలురాళ్లు**

ఒలింపిక్స్ (2020): 69 కేజీల విభాగంలో కాంస్య పతకం

ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ (2023): 75 కేజీల విభాగంలో స్వర్ణ పతకం

ఆసియా ఛాంపియన్‌షిప్ (2022): స్వర్ణ పతకం

ఆసియా క్రీడలు (2023): రజత పతకం

కెరీర్‌లో ఎన్నో ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో మెరిసిన లవ్లీనాకు కామన్వెల్త్ క్రీడల్లో పతకం సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

# ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లో 'పిటిషన్ల' దుమారం

**అర్జెంటీనాపై నిషేధం విధించాలంటూ 2.33 కోట్ల సంతకాలు**

ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచ కప్ ముగిసినప్పటికీ దానికి సంబంధించిన వివాదాలు సోషల్ మీడియా వేదికగా కొనసాగుతూనే ఉన్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనా ఫైనల్లో స్పెయిన్ చేతిలో 0-1 తేడాతో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. అయితే టోర్నీ సందర్భంగా అర్జెంటీనా జట్టుపై ఆన్‌లైన్ వేదికగా ప్రారంభమైన ఒక డిజిటల్ పిటిషన్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా రికార్డులు తిరగరాస్తోంది.

లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా జట్టుకు ఫిఫా నిర్వాహకులు, రిఫరీలు అనుకూలంగా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ నెటిజన్లు ఆన్‌లైన్‌లో పిటిషన్ ప్రారంభించారు. ప్రపంచ కప్ బరిలోకే దిగకుండా అర్జెంటీనాను శాశ్వతంగా నిషేధించాలని డిమాండ్ చేస్తూ సేకరించిన డిజిటల్ సంతకాల సంఖ్య ఏకంగా 2.33 కోట్లు (23,316,108) దాటింది. దాదాపు 170 దేశాల ప్రజలు దీనిపై సంతకాలు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక సంతకాలు సాధించిన పిటిషన్లలో ఒకటిగా నిలిచి గిన్నిస్ రికార్డుకు అత్యంత సమీపంలోకి వెళ్లింది.

మరోవైపు అర్జెంటీనా అభిమానులు సైతం ఫిఫా ఫైనల్ మ్యాచ్‌ను పునః సమీక్షించి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఇంకో పిటిషన్ తీసుకువచ్చారు. స్పెయిన్‌తో జరిగిన ఫైనల్ పోరులో రిఫరీ నిర్ణయాలు తమ జట్టుకు వ్యతిరేకంగా ఉన్నాయని, మ్యాచ్ ఫలితాన్ని తప్పుదోవ పట్టించాయని అర్జెంటీనా ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. ఈ పిటిషన్‌కు కూడా వేలాదిగా మద్దతు లభిస్తోంది. అయితే ఫిఫా నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ పిటిషన్లకు ఎటువంటి చట్టబద్ధత ఉండదని, మ్యాచ్ ఫలితాన్ని మార్చే లేదా పునః పరిశీలించే అధికారం వీటికి ఉండదని క్రీడా విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.



# యాషెస్ షెడ్యూల్ విడుదల

**ఏకకాలంలో అబ్బాయిలు, అమ్మాయిల మ్యాచ్‌లు**






టెస్టు క్రికెట్‌లోని గొప్ప పోరాటాల్లో ఒకటిగా పేరొందిన యాషెస్ సిరీస్ షెడ్యూల్ వచ్చేసింది. వచ్చే ఏడాది ఇంగ్లండ్ వేదికగా జరిగే సిరీస్ తేదీలను ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ECB) గురువారం వెల్లడించింది. ఈసారి ఏకకాలంలో ఆస్ట్రేలియా పురుషులు, మహిళల జట్లు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్నాయి. తొలుత పురుషుల యాషెస్ జూన్ 18న ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా మొదలవుతుంది. ఆపై జూన్ 24న మహిళల ఏకైక యాషెస్ టెస్టు హెడింగ్లే మైదానంలో జరుగనుంది. గత యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా గడ్డపై చావుదెబ్బ తిన్న ఇంగ్లండ్ ప్రతీకారానికి సిద్ధమవుతోంది. అప్పటి ఓటమికి బదులు తీర్చుకునేందుకు వచ్చే ఏడాది జూన్‌లో సిరీస్ నిర్వహణకు సిద్ధమవుతోంది ఇంగ్లండ్ వేల్స్ బోర్డు. గురువారం యాషెస్ ఐదు మ్యాచ్‌ల సిరీస్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈసారి ఏకకాలంలో ఆసీస్ పురుషుల, మహిళల జట్లు ఇంగ్లండ్‌లో పర్యటించేలా సిరీస్‌ను ప్లాన్ చేసింది ఈసీబీ.

ఓవల్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 ఫైనల్ (జూన్ 9-13) ముగియగానే యాషెస్ సిరీస్ షురూ కానుంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పురుషుల జట్ల మధ్య జూన్ 18న ట్రెంట్ బ్రిడ్జ్‌లో తొలి టెస్టు మొదలవ్వనుంది. మహిళల యాషెస్ ఏకైక టెస్టు జూన్ 24న లీడ్స్‌లోని హెడింగ్లే స్టేడియంలో జరుగనుంది. అనంతరం మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో ఆసీస్ మహిళల జట్టు తలపడుతుంది.

# ఆగస్టు 15 నుంచి 'ఆంధ్ర పికిల్‌బాల్ లీగ్'

**చీఫ్ ప్యాట్రన్ సుజయ్ కృష్ణ రంగారావు వెల్లడి**

విశాఖపట్నం: రాష్ట్రంలో పికిల్‌బాల్ క్రీడను మరింత ఆదరణలోకి తీసుకువచ్చే లక్ష్యంతో 'ఆంధ్ర పికిల్‌బాల్ లీగ్' (APL) నిర్వహిస్తున్నట్టు లీగ్ చీఫ్ ప్యాట్రన్, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 15న ఈ ప్రతిష్ఠాత్మక లీగ్ ప్రారంభమవుతుందన్నారు. లీగ్‌లో మొత్తం 8 జట్లు పోటీపడతాయని, వేలంలో ఆటగాళ్లను దక్కించుకునేందుకు ఒక్కో ఫ్రాంచైజీకి రూ.11 లక్షల బడ్జెట్ కేటాయించామని వివరించారు. ప్రతి జట్టులో మొత్తం 11 మంది క్రీడాకారులు ఉంటారు. అందులో ముగ్గురు మహిళలు, ఎనిమిది మంది పురుష క్రీడాకారులకు చోటు కల్పిస్తారు. లీగ్ మ్యాచ్‌లకు విశాఖపట్నం, విజయవాడ నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. లీగ్ ప్రారంభోత్సవ వేడుకలను విజయవాడలో, ముగింపు వేడుకలను విశాఖపట్నంలోని 'గీతం యూనివర్సిటీ'లో నిర్వహిస్తామని సుజయ్ చెప్పారు.



చైతన్య రథం
సినిమా
శుక్రవారం 24 జూలై 2026 X


# నాతో నటిస్తే మంత్రులు, సీఎం అవుతున్నారు

## బాబీ దేవోల్ ఆసక్తికర వ్యాఖ్యలు



హిందీతో పాటు దక్షిణాది భాషల్లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న ప్రముఖ నటుడు బాబీ దేవోల్ తన సహ నటుల గురించి సరదాగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. దళపతి విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' చిత్రంలో బాబీ దేవోల్ ప్రతినాయకుడి (విలన్) పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మంచి ఆదరణ పొందుతున్న నేపథ్యంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'నాలాగే విజయ్ కూడా పబ్లిసిటీకి దూరంగా ఉండటానికి ఇష్టపడతారు.

నేను పెద్దగా ప్రచారాలు చేయను. విజయ్ కూడా హంగామా ప్రచారాలను ఇష్టపడరు. మనం చేసే పనే మాట్లాడాలని ఆయన నమ్ముతారు, నేను కూడా అదే భావిస్తాను" అన్నారు. దక్షిణాది నటులతో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకుంటూ బాబీ దేవోల్ ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తనతో కలిసి పనిచేసిన వారంతా రాజకీయాల్లో కీలక స్థానాల్లోకి వెళ్తున్నారన్నారు

***నందమూరి బాలకృష్ణ:*** ఆయనతో కలిసి 'డాకు మహారాజ్'లో నటించాను. ఆయన సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉంటూ మొన్నటి ఎన్నికల్లోనూ మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

***పవన్‌కల్యాణ్:*** ఆయనతో 'హరి హర వీరమల్లు' చేశాను. ప్రస్తుతం ఏపీకి ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు.

***దళపతి విజయ్:*** ఇప్పుడు 'జన నాయగన్' చేశాను. ఆయన ఏకంగా తమిళనాడు సీఎం అయ్యారు" అని సరదాగా వ్యాఖ్యానించారు.

ఇదే క్రమంలో సూర్యతో కలిసి నటించిన 'కంగువ' బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా ఆయనతో పనిచేసిన అనుభవం చాలా సరదాగా సాగిందని బాబీ దేవోల్ చెప్పుకొచ్చారు.

# 'టాక్సిక్'... పెద్దలకు మాత్రమే!

## నిర్మాత క్లారిటీ



కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె.వెంకటనారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాలకంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతి పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతే కాకుండా... 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలిచ్చారు. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

**సూర్య బర్త్‌డే స్పెషల్**

# విశ్వనాథ్ అండ్ సన్స్ స్టైలిష్ పోస్టర్లు వైరల్



వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య స్టైలిష్ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది.

ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ కూడా ప్రకటించారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలోని రెండో పాటను విడుదల చేయనున్నట్టు అధికారికంగా వెల్లడించారు.

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్టు తెలుస్తోంది. సూర్యను కొత్త కోణంలో చూపించే ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అందుకే 'బిగ్‌బాస్' ఆఫర్ వదులుకున్నా

## జబర్దస్త్ బ్యూటీ సత్యశ్రీ



జబర్దస్త్ కామెడీ షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి సత్యశ్రీ ప్రస్తుతం సినిమాల్లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్నారు. టెలివిజన్‌కు దూరంగా ఉంటూ వెండితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, కెరీర్ ఎంపికలు, అలాగే బిగ్‌బాస్ ఆఫర్‌ను ఎందుకు తిరస్కరించారనే విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జబర్దస్త్ తర్వాత సినిమాల్లో మంచి అవకాశాలు రావడంతో టెలివిజన్‌లో తక్కువగా కనిపిస్తున్నానని తెలిపారు. కెరీర్ ప్రారంభంలో వచ్చిన ప్రతి అవకాశాన్నీ స్వీకరించినప్పటికీ... ఇప్పుడు మాత్రం పాత్రల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని చెప్పారు.

ఇప్పుడు నేను ఉన్న దశలో నా ఇమేజ్, రెప్యుటేషన్‌ను దృష్టిలో పెట్టుకుని పాత్రలు ఎంచుకుంటున్నాను. గ్లామర్ ఉన్నంతవరకు మంచి అవకాశాలను సెలెక్టివ్‌గా చేయాలనుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన 'అనగనగా ఒక రాజు' చిత్రంలో నటించిన సత్యశ్రీ, హీరో నవీన్ పొలిశెట్టి గురించి కూడా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సెట్స్‌లో నవీన్ ఎప్పుడూ పనిపైనే దృష్టి పెట్టే వ్యక్తి అని, ప్రతి క్షణం సినిమా గురించే ఆలోచిస్తుంటారని చెప్పారు. 'జాతిరత్నాలు' సమయంలోనే మరో సినిమాలో కలిసి పని చేద్దామని ఆయన చెప్పారు. ఆ మాటను నిలబెట్టుకుని 'అనగనగా ఒక రాజు'లో అవకాశం ఇవ్వడం నాకు చాలా ఆనందంగా అనిపించింది" అని సత్యశ్రీ తెలిపారు. ఇటీవల బిగ్‌బాస్ తెలుగు సీజన్-10 కోసం ఆఫర్ వచ్చిందనే వార్తలపై కూడా ఆమె స్పందించారు. ఆ వార్తల్లో నిజం ఉందని, కానీ కుటుంబ పరిస్థితుల కారణంగా ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు.

# బాలకృష్ణ మోకాలి శస్త్ర చికిత్స విజయవంతం

## ఏఐజీ ఆస్పత్రిలో 3 గంటల పాటు సర్జరీ

హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు మోకాలి శస్త్ర చికిత్స విజయవంతమైంది. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో వైద్యుల బృందం దాదాపు 3గంటల పాటు శ్రమించి సర్జరీని విజయవంతంగా పూర్తిచేసింది. ఇటీవల కాకినాడలో ఓ సినిమా షూటింగ్‌లో పాల్గొన్న సమయంలో బాలకృష్ణ మోకాలికి తీవ్ర గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆయన ఏఐజీ ఆస్పత్రిలో చేరగా నిపుణులైన వైద్యులు మోకాలి శస్త్ర చికిత్స నిర్వహించారు. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యంస్థిరంగా ఉందని, కోలుకుంటున్నారని వైద్యులు వెల్లడించారు. కొద్దిరోజుల విశ్రాంతి అనంతరం ఆయన సాధారణకార్యక్రమాల్లో పాల్గొంటారని,త్వరలోనే ఆస్ప త్రి నుంచి డిశ్చార్జ్ అయ్యేఅవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. బాలకృష్ణ శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు ఉపశమనం పొందారు.



# రాయల్ లుక్‌లో 'ఇస్మార్ట్' బ్యూటీ

'సవ్యసాచి' చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి 'ఇస్మార్ట్ శంకర్'తో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన అందాల భామ నిధి అగర్వాల్. పవన్ కల్యాణ్ సరసన ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు'తో పాటు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ది రాజాసాబ్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఈ భామ సోషల్ మీడియాలోనూ అంతే యాక్టివ్‌గా ఉంటోంది. ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటో షూట్‌లతో అభిమానులను అలరించే నిధి తాజాగా పంచుకున్న ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. వైట్ కలర్ లెహంగా, చోళీ ధరించిన నిధి అగర్వాల్.. దానికి మ్యాచింగ్‌గా పింక్, గ్రీన్ కలర్ స్టోన్స్‌తో ఉన్న హెవీ చోకర్ నెక్లెస్, రాయల్ ఇయర్ రింగ్స్ ధరించి మెరిసిపోయింది. రాచరికపు కళతో ఉన్న ఈ ట్రెడిషనల్ అండ్ స్టైలిష్ లుక్‌లో నిధి దేవకన్యలా మెరిసిపోతోందంటూ నెటిజన్లు, ఫాలోవర్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. వైట్ డ్రెస్‌లో ఆమె ఇచ్చిన కిల్లర్ పోజులు ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి.

